శనివారం

21-12-2024

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 90

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

గ్రీసు పడవ ప్రమాదంలో 8 మంది మృతి

ఏథెన్స్: గ్రీసులోని రోడ్స్ ఐలాండ్‌లో పడవ ప్రమాదం సంభవించి ఎనిమిది మంది చనిపోయారు. మరో 18 మందిని సహాయక సిబ్బంది కాపాడారు. పెట్రోలింగ్ నౌకను తప్పించుకునే క్రమంలో స్పీడ్ బోటు ప్రమాదానికి గురైందని అధికారులు చెప్పారు. కోస్టుగార్డు నౌకలు, హెలికాప్టర్లతో గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు పడవలో ఎంత మంది ఉన్నారు, ఎంత మంది ఆచూకీ లేరో కచ్చితంగా చెప్పలేమన్నారు. టర్కీ తీరానికి సమీపంలోని రోడ్స్ దీవుల్లో ప్రమాదం జరిగిందని, ఆ మార్గంలో అక్రమ రవాణా ఎక్కువన్నారు. కాగా వారం రోజుల్లో ఇది రెండవ ఘటనగా చెప్పారు. దీనికి ముందు జరిగిన పడవ ప్రమాదంతో ఏడుగురు మరణించారు.

జస్టిస్ దత్తా ధర్మాసనానికి 'ఈవీఎం' కేసులు

న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) తనిఖీ కోసం విధానం తేవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను జనవరి 20న జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం విచారిస్తుందని సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం తెలిపింది. హర్యానా మాజీ మంత్రి కరణ్ సింగ్ దలాల్, లఖన్ కుమార్ సింగ్ దాఖలు చేసిన తాజా పిటిషన్‌ను సీజేఐ ధర్మాసనం శుక్రవారం పరిశీలించింది. దీనిపై వచ్చే నెలలో విచారణ జరుగుతుందని తెలిపింది. ఎన్నికల కమిషన్ తరపున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్ వాదనలు

- మిగతా 2 లో

6 వరకు జుబేర్‌ను అరెస్టు చేయొద్దు

లక్నో: ఆల్ట్ న్యూస్ సహ-వ్యవస్థాపకుడు మహమ్మద్ జుబేర్‌కు తాత్కాలిక ఉపశమనం కల్పిస్తూ అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. జనవరి 6వ తేదీ వరకు అరెస్టు చేయొద్దని ఆదేశించింది. అప్పటి వరకు జుబేర్‌కు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. అదే రోజు తదుపరి విచారణ జరుగుతుందని పేర్కొంది. ఈ కేసును జస్టిస్ సిద్ధార్థ వర్మ, జస్టిస్ నళిన్ శ్రీవాత్సవతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారించింది. అరెస్టు నుంచి

- మిగతా 2 లో

నందిగం సురేశ్‌కు సుప్రీంలో చుక్కెదురు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మరియమ్మ హత్య కేసులో మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణను జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మధ్యంతర బెయిల్ కోసం సురేశ్ తరపు న్యాయవాది, సీనియర్ నాయవాది కపిల్ సిబల్

- మిగతా 2 లో

జేపీసీకి జమిలి

పార్లమెంటు నిరవధిక వాయిదా

విజయ్‌చౌక్ వద్ద ప్రతిపక్షాల ధర్నా

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 20తో ముగిశాయి. అదానీ ముడుపుల అంశం, మణిపూర్‌లో జాతుల హింస, సంభల్‌లో అల్లర్లు, అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా వివాదాస్పద వ్యాఖ్యలు తదితర అంశాలతో పార్లమెంట్ ఉభయ సభలు శీతాకాల సమావేశాల్లో ఇండియా ఎంపీల ఆందోళనలతో అట్టుడికి పోయాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అవమాన పరిచారంటూ ఇండియా ఐక్యసంఘటన ఎంపీలు శీతాకాల సమావేశాల చివరి రోజైన శుక్రవారం నిరసన చేపట్టారు. ప్రతిపక్ష నేతల నిరసనకు పోటాపోటీగా ఎన్‌డీఏ ఎంపీలు సైతం ప్లకార్డులతో ఆందోళనకు దిగడంతో సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇక ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే శుక్రవారం రాజ్యసభ సమావేశాన్ని మధ్యాహ్నం 12గంటలకు ఛైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ వాయిదా చేశారు. సభలో ప్రతిష్టంభన ముగించే ప్రయత్నంలో భాగంగా సభా నాయకుడు జేపీ నడ్డా, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గే సహా ప్రతిపక్ష పార్టీల నాయకులతో ధన్కర్ భేటీ అయ్యారు. సభను సజావుగా సాగేలా చూడాలని వారిని కోరారు. కాగా ప్రతిపక్ష సభ్యుల నిరసన మధ్యే లోక్‌సభ శుక్రవారం సమావేశమైంది. జమిలి ఎన్నికల ముసాయిదాను జేపీసీకి పంపాలన్న తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌ను స్పీకర్ ఓం బిర్లా కోరారు. ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు 'జై భీమ్'

- మిగతా 2 లో

భూ యజమానుల

హక్కులు కాపాడతాం

'డిజిటల్ పోర్టల్'తో ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి రైతుల వివరాలు

ధరణి అద్భుతమైతే సభలో ఉండి కేసీఆర్ నిలదీయాలి

భూభారతిపై చర్చ పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ యత్నం: రేవంత్

విశాలాంధ్ర-హైదరాబాద్: భూ యజమానుల హక్కులు కాపాడేందుకు చట్టాన్ని సభలో ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో చర్చ జరగడం ద్వారా రైతులకు ఉపయోగపడే చట్టాన్ని తీసుకురావాలని భావించామని పేర్కొన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీ అహంకారంతో చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. సహనం కోల్పోయేలా రెచ్చగొట్టి చర్చను పక్కదారి పట్టించే ప్రయత్నం చేసినా మీరు ఆ అవకాశం ఇవ్వలేదని సభాపతిని ఉద్దేశించి అన్నారు. ఓపికనశించి వాళ్లు వెళ్లిపోయినా చర్చకు అవకాశం కల్పించిన మీకు అభినందనలు అన్నారు. శాసనసభలో భూభారతి 2024 చట్టంపై శుక్రవారం చర్చ జరిగింది. సీఎం మాట్లాడుతూ... నాడు రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రా రెడ్డి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐలమ్మ పోరాటాలు చేసింది భూమి కోసమే అని గుర్తు చేశారు. భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారన్నారు. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుకు కూడా కొంతమంది భూమిపై ఆధిపత్యం చాలాయించడమే కారణం అన్నారు. యజమాని హక్కులను కాపాడేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయని, భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. ధరణి పోర్టల్ కేసీఆర్ సొంతంగా కనిపెట్టింది కాదని, 2010లోనే ఒడిశాలో ఈ-ధరణి పేరుతో ఐఎల్ఎఫ్ఎస్ కంపెనీకి అప్పగించిందని, అయితే అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు ఈ-ధరణి పోర్టల్ ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టిందన్నారు. లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ ఎందుకు తెలంగాణ ప్రజలపై రుద్దారో చెప్పాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. 2018లో ఐఎల్ఎఫ్ఎస్‌తో పాటు గాదె శ్రీధర్ కు చెందిన ఈ సెంట్రిక్, విసన్ ఇన్ఫో టెక్ సంయుక్తంగా కాంట్రాక్టు సాధించుకున్నాయన్నారు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారని, ఆ తరువాత ఐఎల్ ఎఫ్ ఎస్ సబ్సిడరీ కంపెనీ అయిన టెరాసిస్ ధరణి కాంట్రాక్టును దక్కించుకుందన్నారు. ఈ టెర్రాసిస్ లో 99 శాతం షేర్లు ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ ఎస్జీ అనే సంస్థ రెండు దఫాలుగా 2021 లో కొనుగోలు చేసిందని

- మిగతా 2 లో

భూదోపిడీపై ఫోరెన్సిక్ ఆడిట్

- 'భూభారతి' భూ యజమానులకు చుట్టం
- దొరలు, సామాన్యులకు ఒకటే విధానం: పొంగులేటి
- చట్టంపై శాసనసభలో చర్చ



విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఇస్తే చాలు రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానన్న గత ప్రభుత్వ పెద్దలు వేటకుక్కలుగా మారి అందినకాడికి దోచుకున్నారని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భూదోపిడీపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామన్నారు. శాసనసభలో శుక్రవారం భూభారతి-2024 చట్టంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... సమాజంలో అట్టడుగు వర్గాలు మొదలుకొని భూ యజమానులకు మేలు చేసే భూ భారతి చట్టం... భూ యజమానులకు చుట్టమన్నారు. ఇటు రాష్ట్రం అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతాంగానికే కాకుండా యావత్తు ప్రజానీకానికి ఎంతో మేలు చేశాయని చెప్పడానికి గర్వపడుతున్నానన్నారు. భూకమతాల పరిమితి చట్టం తెచ్చిన నాటి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావు, కౌలు రైతులకు మేలు చేసే విధంగా రక్షిత కౌలుదారి చట్టం తీసుకువచ్చిన నాటి ముఖ్యమంత్రి బూర్గుల

- మిగతా 2 లో

టార్గెట్ రాహుల్

అదే కమల వ్యూహం

- ప్రతిపక్షం లేని పాలనే బీజేపీ లక్ష్యం
- ఏకచ్ఛత్రాధిపత్యం కోసం హింసాస్త్రం
- అల్లర్లతో ఆందోళనల అణచివేతకు కుతంత్రం

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది. ఆయనతో పాటు విపక్షాన్ని ఇరకాటంలో పెట్టడానికి కాషాయ పార్టీ ఎత్తులకు పైఎత్తులు వేస్తోంది. జిత్తులు ప్రదర్శిస్తూ హింసను రెచ్చగొడుతోంది. అందుకోసం ఎందాకైనా వెళ్లడానికి వెనుకాడటం లేదు. గత పదేళ్ల పరిణామాలే ఇందుకు నిదర్శనం. తాజాగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ పేరిట అగ్గి రాజేసింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఆయన 'కమల' వ్యూహంలో చిక్కుకునేలా చేస్తోంది. ఇందుకోసం పార్లమెంటు సాక్షిగా హింసకు బీజేపీ తెరతీసింది. ఓ మహిళా ఎంపీని రాహుల్ ఇబ్బంది పెట్టినట్లు ఆరోపించి... ఆయనపై ఎఫ్ఐఆర్, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టించింది. ఇందుకు నాగాలాండ్‌కు చెందిన గిరిజన మహిళా ఎంపీని ఉపయోగించుకుంది. అంతేకాకుండా రాహుల్‌పై హత్యాయత్నం ఆరోపణలు చేస్తోంది. తమ ఆరోపణలకు బలం చేకూర్చేందుకు ఇద్దరు ఎంపీలను ఐసీయూలో చేర్చింది. తొలుత తలకు చిన్న బ్యాండేజీతో కనిపించిన ఎంపీ ప్రతాప్ సారంగి... ఆ తర్వాత తలపాగా స్థాయిలో కట్టుతో కనిపించడం ద్వారా నాటకాన్ని రక్తి కట్టించింది. ఎంపీల ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆసుపత్రి వర్గాలు చెప్పాయి. చూడటానికి... వినడానికి ఇదంతా తమాషాగా అనిపించవచ్చు కానీ లోతుగా ఆలోచిస్తే దీని వెనుక కుట్ర భయపెడుతుంది. రాహుల్ గాంధీపై దాడి ప్రణాళికబద్ధంగా జరిగింది. కులగణన కోసం ఒత్తిడి తెస్తుండటంతో ఎస్సీ మహిళపై దౌర్జన్యానికి పాల్పడినట్లు తీవ్రమైన ఆరోపణలతో ఆయనను అణచివేయాలని తెలివిగా పన్నిన పన్నాగం. మణిపూర్‌లో హింస వైపునకు అందరి దృష్టి ఆకర్షించేందుకు, ప్రభుత్వాన్ని జవాబుదారీగా చేసేందుకు ప్రతిపక్షం చేస్తున్న ప్రయత్నాలను విఫలం చేయడమే కాకుండా ఆ పార్టీల నేతల పరువు తీసేందుకు జరిగిన కుట్ర. నాగాలాండ్ కూడా ఈశాన్య రాష్ట్రమే కాబట్టి అక్కడి మహిళా ఎంపీతో ఆరోపణలు చేయించడం ద్వారా మణిపూర్‌లోని తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవచ్చన్నది బీజేపీ వ్యూహం.

ఇక్కడ ఏ విషయంలోనూ దాపరికాలు లేవు. బీజేపీ తన జిత్తులను బాహాటంగానే ప్రదర్శిస్తోంది. అబద్ధాన్ని నిజం చేయగల

- మిగతా 2 లో

చౌతాలా కన్నుమూత

న్యూఢిల్లీ: ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ) సీనియర్ నేత, హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా శుక్రవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 89 సంవత్సరాలు. గురుగావ్ నివాసంలో గుండెపోటు రావడంతో ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచినట్టు వైద్యులు ప్రకటించారు. హర్యానా రాజకీయాల్లో దిగ్గజనేతగా పేరున్న చౌతాలా 1989 నుంచి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. చివరిసారిగా 1999 నుంచి 2005 వరకూ సీఎంగా పనిచేశారు. ఎమ్మెల్యేగా హర్యానాకు చిరకాల సేవలందించిన నేతగా రికార్డు సృష్టించారు. 1935 జనవరిలో ఓం ప్రకాశ్ చౌతాలా జన్మించారు. హర్యానాకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా, దేశ ఆరవ ఉప ప్రధానమంత్రిగా పనిచేసిన చౌదరి దేవీలాల్ తనయుడే ఓం ప్రకాశ్ చౌతాలా. తన తండ్రి అడుగుజాడల్లోనే

- మిగతా 2 లో

కేటీఆర్‌పై కేసు సక్రమమే

ఫార్ములా ఈ- కారు రేసులో అక్రమాలు వాస్తవమే: మహేశ్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర-హైదరాబాద్: కేటీఆర్‌లో అహంకారం పరాకాష్టకు చేరిందని, ఆయనపై నమోదైన కేసు సక్రమేనని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అక్రమాలు జరిగినట్టు ఆధారాలున్నా... కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఫార్ములా ఈ-కారు రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని, ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక ఇది అక్రమ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఆధారాలు కనిపిస్తున్నా అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయించడం విడ్డూరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి కాంగ్రెస్ అక్రమంగా కేసులు బనాయించట్లేదని తెలిపారు. హెచ్ఎండీఏ భాగస్వామ్యం కాకున్నా... దాని ఖాతా నుంచి ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే రూ.54.88 కోట్లు చెల్లించేలా కేటీఆర్ ఒత్తిడి తెచ్చారని అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు ఎలా చేస్తారని నిలదీశారు. కేటీఆర్ అక్రమాలకు అధికారులు బలిపశువులుగా మారారని ఆవేదన వెలిబుచ్చారు. నిబంధనలు పాటించకుండా విదేశాలకు నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.ఎనిమిది కోట్లకు పైగా పన్ను చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఈ కార్ రేసింగ్ నిబంధనలను కాదని మూడేళ్లలో రూ.600 కోట్లు చెల్లించేలా ఒప్పందం కేటీఆర్ అనుమతితోనే జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు వెల్లడించారు. ఫార్ములా ఈ-కారు రేసు పేరుతో నిధులు గోల్‌మాల్ చేసి... ఇప్పుడు సుద్ధపూసలాగ కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కేసు విచారణలో అధికారులకు సహకరించాల్సిన కేటీఆర్... అహంకారంతో ఉద్యమకారులం... భయపడం అంటూ కేసుకు సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

ఇదీ లోకం!

రాహుల్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయొద్దు

బీజేపీ వ్యవహారశైలిపై పొన్నం ఫైర్

విశాలాంధ్ర-హైదరాబాద్: రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా బీజేపీ వ్యవహరిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. శాసనసభ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటు అత్యున్నత వ్యవస్థ అని అలాంటి పార్లమెంటులోకి ప్రవేశించే ద్వారం దగ్గర ప్రతిపక్ష సభ్యులను, లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సహా ఇతర నాయకులను పార్లమెంటు లోపలికి పోకుండా దారికి అడ్డం నిల్చొని నిరోధించే ప్రయత్నం చేశారని విమర్శించారు. వారిని పక్కకు జరుపుకుంటూ పార్లమెంటు లోపలికి వెళ్లే ప్రయత్నంలో ఓ సభ్యుడు కింద పడి గాయపడితే, దానిపై బీజేపీ కుట్ర పూరితంగా రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ నేరస్తుడు అనే భావన తెచ్చే విధంగా హత్యయత్నం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యల పై చర్చకు వేదికగా ఉండే పార్లమెంటు వద్ద అడ్డుకుంటున్నారంటే వారి కుట్రలు, అరాచకం, నియంతృత్వం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ప్రధాని మోదీ పార్లమెంటులో మాట్లాడాల్సింది పోయి అమిత్ షా ... అంబేద్కర్ ను అవమాన పరిస్తే అతడిపై చర్యలు తీసుకోకుండా రాహుల్ గాంధీ నోరు మూయించేలా హత్యాయత్నం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆ కేసు ఉపసంహరించుకోవాలని, అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

30 వరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ప్రాథమిక దర్యాప్తు పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం... ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో

- మిగతా 2 లో

కేటీఆర్‌పై ఈడీ కేసు

విశాలాంధ్ర-హైదరాబాద్ : ఫార్ములా-ఈ కార్ రేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ అంశంపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ కేసు నమోదు చేసింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించిన సంగతి తెలిసిందే. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. అయితే ఈ కేసును విచారణ కొనసాగించవచ్చని ఏసీబీకి సూచించింది.

అమెరికాలో షట్‌డౌన్!

ట్రంప్ బిల్లును ఆమోదించని ప్రతినిధుల సభ

వాషింగ్టన్: నిధులు సమకూర్చే అంశమై అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన బిల్లును ప్రతినిధుల సభ తిరస్కరించింది. దీంతో షట్‌డౌన్ దిశగా మరో అడుగు పడినట్లు అయింది. ప్రభుత్వ కార్యకలాపాలు, జీతాలపై కీలక బిల్లునకు సభ ఆమోదం తెలుపలేదు. అమెరికా స్తంభించిపోయే ముప్పు ఎదుర్కొంటోంది. తొలుత బైడెన్ ప్రభుత్వం తెచ్చిన బిల్లును ట్రంప్ తిరస్కరించారు. ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ మార్చి 14 వరకు ప్రభుత్వానికి నిధులు సమకూర్చేలా కొత్త బిల్లును ప్రవేశపెట్టారు. రెండేళ్లపాటు రుణాలపై పరిమితుల రద్దు వంటి ట్రంప్ డిమాండ్లు ఇందులో పొందుపర్చారు. ట్రంప్ కూడా దీనికి మద్దతు తెలుపారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేయాలని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. అయితే ఈ బిల్లును డెమోక్రాట్లు వ్యతిరేకించారు. ప్రతినిధుల సభలో ఓటింగ్ జరుగగా 235 సభ్యులున్న సభలో 174 ఓట్లు వచ్చాయి. 38 మంది రిపబ్లికన్ సభ్యులు వ్యతిరేకంగా ఓటేశారు. దీంతో బిల్లుకు సభ ఆమోదం లభించలేదు. సెనెట్‌లో డెమోక్రాట్లకు పట్టుంది. శుక్రవారం అర్ధరాత్రికల్లా ప్రభుత్వానికి నిధులు సమకూర్చడంలోకాంగ్రెస్ విఫలమైతే షట్‌డౌన్ తప్పదనే పరస్థితి నెలకొంది. షట్‌డౌన్ జరిగితే దాదాపు 8,75,000 మంది పనులు నిలిచిపోతాయి. ప్రభుత్వ ఉద్యోగాలు పోతాయి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని 14 లక్షల మంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరుగుతుందని, సెలవుల్లో కూడా పని చేయించుకొని అందుకు జీతం ఇవ్వని పరిస్థితి వస్తుందని అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సంఘం పేర్కొంది. షట్‌డౌన్ ముగిసిన తర్వాతే పాత జీతాలు వస్తాయని తెలిపింది.

సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, రవాణా వంటి రంగాలపై షట్‌డౌన్ ప్రభావం ప్రతికూలంగా ఉంటుందన్న అంచనాలు ఉన్నాయి. షట్‌డౌన్ ఎంతకాలం ఉంటుందో తెలియదు. 2018-19 మధ్య 35 రోజుల పాటు అమెరికా స్తంభించిపోయింది. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్. అప్పట్లో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు.

పాక్ 'మిస్సైల్ ప్రోగ్రామ్'తో ప్రమాదం: అమెరికా

వాషింగ్టన్: సుదీర్ఘ లక్ష్యాలు ఛేదించే విధంగా అత్యాధునిక బాలిస్టిక్ క్షిపణలను పాకిస్థాన్ తయారు చేస్తుండటం తమ దేశానికీ ప్రమాదకరమేనని అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌కు చెందిన నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్‌తో సహా నాలుగు కంపెనీలపై ఇటీవల ఆంక్షలు విధించింది. పాక్ 'లాంగ్ రేంజ్ మిస్సైల్ ప్రోగ్రామ్'పై అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ ఫినర్ ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్య పద్ధతుల్లో తమకున్న సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాక్‌లోని అక్తర్ అండ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, అఫిలియేట్స్ ఇంటర్నేషనల్, రాక్‌సైడ్ ఎంటర్‌ప్రైజ్ సంస్థలపై ఆంక్షలు విధించినట్లు శ్వేతసౌధం తెలిపింది. ఈ సంస్థలు బాలిస్టిక్ ప్రోగ్రామ్‌కు సహకరిస్తున్నట్లు పేర్కొంది.

ఇరాన్‌పై ఇజ్రాయిల్ కన్ను

హమాస్, హెజ్బుల్లా, సిరియా తర్వాత లక్ష్యమదే

దుబాయ్: ఇరాన్‌పై ఇజ్రాయిల్ కన్ను పడింది. ఇప్పటికే హమాస్, హెజ్బుల్లా, సిరియా లక్ష్యంగా నెతన్యాహు సైన్యం విరుచుకుపడుతోంది. మారణహోమం సృష్టిస్తోంది, ఆస్తులను ధ్వంసం చేస్తోంది. వీటిని జయించిన తర్వాత ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు నెతన్యాహు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం వ్యూహాత్మక లక్ష్యాలను ప్రధాని నెతన్యాహు నిర్దేశించుకుంటున్నారని సమాచారం. గాజాపై తమ సైన్యానికి పట్టు పెంచుకోవడం, అణ్వస్త్రాలు తయారు చేసుకోవాలన్న ఇరాన్ కసరత్తుకు విఘాతం కలిగించడం, టెహ్రాన్ మిత్రపక్షాలు పలస్తీనా, హమాస్, లెబనాన్‌లో హెజ్బుల్లాను తుడిచి పెట్టడం, సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూల్చడం వంటివన్నీ నెతన్యాహు లక్ష్యసాధనలో భాగమని తెలిసింది. హమాస్, హెజ్బుల్లా, సిరియాపై విజయాన్ని ప్రకటించిన తర్వాత ఇరాన్‌పై పూర్తిగా దృష్టిని కేంద్రీకరించాలని నెతన్యాహు భావిస్తున్నారని, ఇజ్రాయిల్ సైన్యాన్ని ఇరాన్ దీటుగా ఎదుర్కొనలేదని అంతర్జాతీయ సంక్షోభ సంఘం పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికా కార్యక్రమాల డైరెక్టర్ జూస్ట్ ఆర్ హిల్టర్‌మాన్ అన్నారు. అణ్వస్త్రాలు తయారు చేసుకోకుండా ఇరాన్‌ను ఇజ్రాయిల్ అడ్డుకుంటే ఆశ్చర్యం లేదన్నారు. ఇరాన్ ఈ విషయంలో వెనక్కు తగ్గని పక్షంలో ట్రంప్, నెతన్యాహు దాడులకు తెగపడవచ్చని, వారికి అడ్డు చెప్పే వారే లేరని పలస్తీనా విశ్లేషకుడు ఘస్సన్ అల్ ఖతీబ్ అన్నారు. ఇదిలావుంటే 2024 సంవత్సరం ముగుస్తుండటంతో 14నెలలుగా సాగుతున్న గాజా పోరునకు తెరదించే దిశగా హమాస్‌తో కాల్పుల విరమణ కోసం ఒప్పందానికి ఇజ్రాయిల్ ప్రధాని అంగీకరించేందుకు అవకాశం లేకపోలేదని మధ్యవర్తిత్వం వహిస్తున్న వారి సన్నిహితులు తెలిపారు. సైన్యం తప్పుకుంటే హమాస్ తిరిగి పుంజుకుంటుందన్న నెపంతో యుద్ధం ముగిసినాగానీ ఇజ్రాయిల్ సైన్యం అధీనంలోనే గాజా ఉంటుందని ఖతీబ్ అన్నారు. గాజాలో సైనికపరమైన లబ్ధికిగాను ఇజ్రాయిల్‌కు ఉన్న మార్గం అదొక్కటేనని చెప్పారు. 2023 అక్టోబరు నుంచి గాజాపై ఇజ్రాయిల్ భూతల, వైమానిక దాడులు జరుపుతుండటం విదితమే.

భూ యజమానుల హక్కులు కాపాడతాం

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. మిగిలిన ఒక్క శాతం వాటా మాత్రం కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్ రాజు కొనుగోలు చేశారన్నారు. ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్ కు సీఈవోగా అవతారం ఎత్తారని, ఫాల్కన్ ఎస్జీ (ఫిలిప్పీన్స్) సంస్థలోని 100 శాతం షేర్లు సింగపూర్ కు చెందిన ఫాల్కన్ ఇన్వెస్ట్మెంట్స్ (సింగపూర్) అనే సంస్థ కొనుగోలు చేసిందన్నారు. సింగపూర్ బేస్డ్ కంపెనీలో 100 శాతం వాటాను ఐదు కంపెనీలు కొనుగోలు చేశాయని తెలిపారు. మళ్లీ ఇందులో స్పారో ఇన్వెస్ట్మెంట్స్ అనే సంస్థలో 100 శాతం వాటాలను గేట్ వే ఫండ్ -2 అనే కంపెనీ చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఆ కంపెనీ మూలాలు ఎక్కడ అన్నది గమనిస్తే, పన్ను ఎగవేతలకు, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా పేరుగాంచిన కెమెన్స్ ఐలాండ్ అనే దీవిలో ఉన్నాయన్నారు. ఐదింటిలో మరో కంపెనీ అయిన హిల్ బ్రూక్స్ ఇన్వెస్ట్మెంట్ మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు స్వర్గధామంగా భావించే బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్ లో ఉన్నాయన్నారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదని, అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారని చెప్పారు. రెవెన్యూ , భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టారని విమర్శించారు. ఆర్థిక నేరాల్లో ఇరుక్కుపోయిన సంస్థలకు రైతుల సంపూర్ణ డేటాను అప్పగించారని, ఇది ఎంత తీవ్రమైన నేరమో ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఎంసీహెచ్‌ఆర్డీలో అద్భుతమైన సాంకేతిక ఉందని, ఇతర రాష్ట్రాలకు మన సాంకేతికతను అందిస్తున్న పరిస్థితుల్లో వీళ్లు విదేశీ కంపెనీలకు అప్పగించారని మండిపడ్డారు. కేసీఆర్ ఆవేశంతో ఊగిపోతుంటే ఆనాడు నాకు అర్థం కాలేదని, ధరణిలో ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రయివేట్ భూముల యజమానుల పేర్లు మారాయన్నారు. అగ్రిమెంట్‌లోని 9.20 క్లాజ్ ప్రకారం యజమాని పేరు మార్చడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని, 9.20.4 క్లాజ్ లో పేర్కొన్నట్లు ప్రభుత్వ ఆఫీసులో ఉండి పనులు చేయాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సీసీఎల్ఏ కార్యాలయం నుంచి పని చేయాలని, కానీ ఇలాంటి పనులు తెలంగాణలో కాకుండా విజయవాడలో, బెంగుళూరుకు, ఈశాన్య రాష్ట్రాల నుంచి ధరణిని నిర్వహించారని ఆరోపించారు. ఈ రాష్ట్రంలో, ఈ దేశంలో లేని కంపెనీలకు, విదేశీయులకు అప్పగించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని, దీనిపై ఎంత కఠినమైన శిక్ష వేయాల్సిన అవసరం ఉందో ఆలోచన చేయాలన్నారు. గోప్యంగా ఉంచాల్సిన సమాచారం ఆ వ్యక్తికి తెలియకుండా ఎవరికీ ఇవ్వొద్దని చట్టాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టమైన విధానంతో సమావేశాలు నిర్వహించి భూ భారతి చట్టాన్ని సభ ముందుకు తీసుకొచ్చిందని, ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్ లు అర్ధరాత్రి కూడా జరిగాయన్నారు. ఆనాడు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫిర్యాదు చేసినా, లెక్కచేయకుండా తిమ్మాపూర్ భూదాన్ భూములను ప్రయివేట్ వ్యక్తుల పేరుకు మార్చారని, తమ ప్రభుత్వం వచ్చాక కేసులు నమోదు చేశామన్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను బదిలీ చేశారని వివరించారు. ధరణి అద్భుతమైతే సభలో ఉండి మమ్మల్ని నిలదీయాలి కదా, 80వేల పుస్తకాల జ్ఞానంతో సృష్టించిన ధరణి గురించి సంపూర్ణంగా వివరించచ్చు కదా అంటూ కేసీఆర్ ను సీఎం టార్గెట్ చేశారు. ఈ -కార్ రేస్ సంస్థ కు చెందిన వ్యక్తి అపాయింట్ మెంట్ అడిగితే నేనే ఇచ్చా, వారు చెప్పాకే వ్యవహారం ఏంటనేది అధికారులతో తెలుసుకున్నానని తెలిపారు. ఏసీబీ విచారణ సమయంలో, కోర్టులో వాదనలు వినిపిస్తున్న సమయంలో విచారణాధికారులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 2023 డిసెంబరు నుంచి 2024 వరకు జరిగిన అన్ని వివరాలను ప్రజలకు అందిస్తానని వెల్లడించారు.

ఫార్ములా ఈ-కార్ రేస్‌పై ఏడాదిగా చర్చ

ఫార్ములా-ఈ కార్ రేస్ పై ఏడాదిగా చర్చ జరుగుతున్నా అసెంబ్లీలో నాలుగు సమావేశాల్లో ఎప్పుడైనా దీని గురించి మాట్లాడారా అని బీఆర్ఎస్ ను సీఎం నిలదీశారు. ఏడాదిగా అవసరంలేని చర్చ ధరణి చర్చ వచ్చినప్పుడే ఎందుకని మండిపడ్డారు. కుట్రపూరిత ఆలోచనతోనే చర్చ జరగకూడదని ప్రయత్నించారని, ఫార్ములా ఈ రేస్ కు సంబంధించి ఎప్పుడు పిలిచినా చర్చకు సిద్ధం అని సవాల్ చేశారు. రూ.55 కోట్లు చిన్న మొత్తమా... మేం ఒప్పుకోకపోవడం వల్లే ప్రభుత్వం రూ.600 కోట్ల నష్టపోకుండా ఆపగలిగామన్నారు. ఔటర్ రింగ్ రోడ్ అమ్ముకున్న, హెచ్ఎండీఏ నుంచి నుంచి కోట్లు బదిలీ చేసినా ఏమీ అనొద్దు అన్నట్లుగా బీఆర్ఎస్ తీరు ఉందన్నారు. ప్రభుత్వం ఏ మాత్రం సహించదన్నారు. హరీశ్‌రావు పరిస్థితి మాకు అర్థమైందని, చొక్కాలు చించుకోకపోతే ఇంటి దగ్గర కొరడా దెబ్బలు ఉంటాయని ఎద్దేవా చేశారు. అలా చేస్తున్నారని అన్నారు.

6 వరకు జుబేర్‌ను అరెస్టు చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

రక్షణ కోరుతూ జుబేర్ దాఖలు చేసిన పటిషన్‌పై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ వివరణను కోరింది. జుబేర్ కరుడుగట్టిన నేరస్తుడు కాదంటూ ఆయనకు అరెస్టు నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించింది. విచారణకు సహకరించాలని, విదేశాలకు వెళ్లవద్దని జుబేర్‌ను హైకోర్టు ఆదేశించింది. కాగా, దస్నా దేవి ఆలయ పూజారి యతి నరసింగానంద్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎక్స్‌లో పెట్టిన పోస్టుల క్రమంలో జుబేర్‌పై విచారణ సాగుతోంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 152వ సెక్షన్ కింద ఆయనపై యూపీ పోలీసులు కేసు పెట్టారు.

జేపీసీకి 'జమిలి'

(మొదటిపేజీ తరువాయి)

'జై భీమ్' అని నినాదాలు చేశారు. స్పీకర్ వెల్‌వద్దకు వచ్చి నిరసనతెలిపారు. ఈ గందరగోళం నడుమ దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు(జమిలి ఎన్నిక బిల్లును)ను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం దిగువ సభలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున జేపీసీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అధికారపక్షం మాత్రం ఈ బిల్లు రాజ్యాంగ మూల స్వరూపానికి ఏమాత్రం భిన్నంగా లేదని స్పష్టంచేస్తూనే... అన్ని పక్షాలూ దీనిపై విస్తృత చర్చ కోరుతున్నందున జేపీసీకి పంపడానికి తమకేమీ అభ్యంతరం లేదని పేర్కొంది. ఈక్రమంలోనే జేపీసీకి పంపింది. 129వ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలో సభ్యుల సంఖ్యను పెంచారు. దీనిలో లోక్‌సభ నుంచి 21, రాజ్యసభ నుంచి 10 మంది మొత్తం 31మంది ఉంటారని ప్రభుత్వం బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి విడుదల చేసిన బులిటెన్‌లో మాత్రం లోక్‌సభ సభ్యుల సంఖ్యను 27కి, రాజ్యసభ సభ్యుల సంఖ్యను 12కి పెంచుతున్నట్లు పేర్కొంది. కాగా, ప్రతిపక్ష ఎంపీల నినాదాల మధ్యే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఛాంబర్‌లోకి ప్రవేశించారు. రాజ్యసభ మధ్యాహ్నం 12 గంటలకు మళ్లీ ప్రారంభమైన తర్వాత జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును జేపీసీకి పంపేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌ను ధన్కర్ కోరారు. ఈ తీర్మానం వాయిస్ ఓటుతో ఆమోదం పొందింది. నవంబర్ 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశం మొదటి వారంలో అనేక మార్లు వాయిదా పడింది. రాజ్యాంగం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యంపై చర్చ, బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌పై ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానం, ప్రియాంక గాంధీ లోక్‌సభ అరంగేట్రం వంటి అనేక అంశాలు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రధాన చర్చకు దారి తీశాయి. ఇక ఈసారి పార్లమెంటు ఆవరణలో గురువారం అసాధారణ ఘటన చోటుచేసుకుంది. ఎంపీల మధ్య తోపులాట జరిగింది. ఇద్దరు బీజేపీ ఎంపీలు కిందపడటంతో గాయపడ్డారు. రాహుల్ గాంధీ తోయడంతోనే వారు గాయపడ్డారని అధికార పార్టీ ఆరోపణలు చేయడమే కాకుండా, ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణలను కాంగ్రెస్ తోసిపుచ్చింది.

ప్రతిపక్షాల ధర్నా

దిల్లీలోని విజయ్ చౌక్ వద్ద ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు ధర్నా చేపట్టారు. అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ విజయ్ చౌక్ నుంచి పార్లమెంట్ వరకు ర్యాలీగా వచ్చి తమ నిరసన తెలిపారు. ఈ క్రమంలో మోదీ సర్కార్ పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీపై కేసులు పెట్టడం బీజేపీ నైరాశ్యాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను దేశ ప్రజలంతా చూస్తున్నారన్నారు. బీజేపీ రాహుల్ గాంధీపై అసంబద్ధ ఆరోపణలు చేస్తూ, కేసులు పెట్టడం వారి అహంకారాన్ని సూచిస్తోందని మండిపడ్డారు.

అర్థవంత చర్చలు జరగాలి: ధన్కర్

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ పని చేసింది కేవలం 43 గంటల 27 నిమిషాలేనని చైర్మన్ ధన్కర్ తెలిపారు. పార్లమెంటేరియన్లుగా తాము దేశ ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంటున్నామని వ్యాఖ్యానించారు. సమావేశాల నిరంతర అంతరాయాలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసాన్ని క్రమంగా సన్నగిల్లేలా చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన చర్చ జరగాలని కోరుతూ సభను నిరవధిక వాయిదా వేశారు.

సభ్యులకు స్పీకర్ హెచ్చరిక

ఎంపీలు పార్లమెంటులో ప్రదర్శనలు, నిరసనలకు దిగితే చర్యలు తప్పవని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం హెచ్చరించారు. అంబేద్కర్‌ను కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అవమానించారంటూ పార్లమెంటు ఆవరణలో అధికార, విపక్ష సభ్యులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో ఓం బిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు.

"పార్లమెంట్ ఆవరణలో ఎక్కడైనా ప్రదర్శనలు లేదా నిరసనలు చేయొద్దు. అలా చేస్తే ఎంపీలపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే పార్లమెంటు గేట్ల వద్ద ఎలాంటి నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడం సరికాదు. ఈ విషయంలో మీరు నిబంధనలను పాటించాలి. ఈ హెచ్చరికను సీరియస్‌గా తీసుకోవాలని నేను మిమ్మల్ని మరోసారి కోరుతున్నాను" అని స్పీకర్ ఓం బిర్లా లోక్ సభ నిరవధిక వాయిదాకు ముందు వ్యాఖ్యానించారు.

భూదోపిడీపై ఫోరెన్సిక్ ఆడిట్

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణారావు, జాగీర్ల రద్దులో కీలకంగా వ్యవహరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి ... తమకు దిశానిర్దేశకులన్నారు. ఇప్పుడు వారి అడుగుజాడల్లో ప్రజోపయోగమైన ఈనూతన రెవెన్యూ చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. ధరణిలో నా భూమి నేను చూసుకొనే వీల్లేదని, ఇందిరమ్మ ప్రభుత్వంలో దొరలు, సామాన్యులకు ఒకటే విధానం, భూ భారతిలో అంతా పారదర్శకమే అన్నారు. ఆనాటి బ్రిటిష్ దొరలు జమీందారులను సృష్టించి శిస్తుల రూపంలో దోపిడీ చేస్తే ... ఈనాటి దొరలు భూముల డిజిటలైజేషన్ పేరుతో ధరణిని సృష్టించి భూదోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మద్దెల కృష్ణయ్య (73) అనే దళిత రైతు ... ధరణి వచ్చిన తర్వాత 35 ఏళ్ల క్రితం కొన్నభూమి వేరే వాళ్ల పేరుపై పట్టారావడంతో మనస్థాపంతో జనవరి, 2023లో ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ఇటువంటి సంఘటనలు ఎన్నో జరిగాయని, అటువంటి పరిస్థితి మరొకరికి రాకుండా భూ భారతి చట్టాన్ని రూపొందించామన్నారు. లక్షలాది మంది భూ హక్కుదారులను 2020 రెవెన్యూ చట్టంతో ఇబ్బంది పెట్టగా నేడు భూభారతి పేరిట దేశానికే ఓ రోల్ మోడల్ గా ఉండే రెవెన్యూ చట్టం ప్రవేశపెట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. భూభారతి చట్టాన్ని సభలో ప్రవేశపెడుతుండగా కొంతమంది స్పీకర్ పైనా, కాంగ్రెస్ సభ్యులపైనా కాగితాలు విసరడం దురదృష్టకరమన్నారు. సమసమాజం సిగ్గుపడేలా బీఆర్ఎస్ సభ్యులు గూండాయిజానికి పాల్పడడం దారుణం, దీనిపై స్పీకర్ తగు చర్యలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీలో గొప్ప బిల్లును ప్రవేశపెడుతుండగా ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాకపోవడం సరికాదన్నారు. ప్రజలపై ఆయనకు ఉన్న నిబద్ధత ఏమిటో తెలుస్తుందని, భూభారతిపై సలహాలు సూచనల కోసం పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని, మరోవైపు సీనియర్ శాసనసభ్యులు హరీశ్‌రావు ఏడు పేజీల సూచనలు ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. ఇటువంటి అత్యంత ప్రాధాన్యత ఉన్న బిల్లును ప్రవేశపెడుతుండగా కేవలం కేటీఆర్‌పై నమోదైన వ్యక్తిగత కేసును తెరపైకి తెచ్చి శాసనసభలో గందరగోళం సృష్టించడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అని పొంగులేటి అన్నారు.

చౌతాలా కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ఓం ప్రకాశ్ చౌతాలా ప్రముఖ నేతగా రాజకీయాల్లో ఎదిగారు. చౌతాలా తన హయాంలో రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించారు. 1987లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై 1990 వరకూ సేవలందించారు. నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) భాగస్వామిగా తన రాజకీయ సత్తా చాటుకున్నారు. కాగా, వివాదాలు, న్యాయ చిక్కులు కూడా ఆయన చవిచూశారు. 1999-2000లో హర్యానాలో జూనియర్ ప్రైమరీ టీచర్ల నియామకాలకు సంబంధించి చిక్కుల్లో పడ్డారు. ఉపాధ్యాయుల నియామక కుంభకోణంలో పదేళ్ల జైలుశిక్ష పడింది. 2021 జులైలో తొమ్మిదన్నరేళ్ల శిక్ష అనంతరం 2021 జులైలో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. చౌతాలా న్యాయపరమైన వివాదాలు ఎదుర్కొన్నప్పటికీ హర్యానా రాజకీయాల్లో ఆయన చూపిన నాయకత్వ పటిమ ప్రత్యేకత సంతరించుకుంది.

ప్రముఖుల సంతాపం

ఓం ప్రకాశ్ చౌతాలా మృతికి ప్రముఖులు సంతాపం తెలిపారు. చౌతాలా రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నో ఏళ్లు చురుకుగా పనిచేశారని, చౌదరి దేవీలాల్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నిరంతరం కృషి చేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సంతాప సందేశంలో గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, హర్యానా మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపీందర్ సింగ్ హుడా తదితరులు సంతాపం తెలిపారు.

టార్గెట్ రాహుల్

(మొదటిపేజీ తరువాయి)

గోది మీడియాను చేసుకొని రొమ్ము విరుస్తోంది. తాజా పరిణామాలపై విశ్లేషకుల్లో చాలామంది తటస్థ వైఖరి అవలంబిస్తున్నారు. ఇప్పటివరకు అంబేద్కర్‌పై తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చుకునే ప్రయత్నాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేయగా బీజేపీ అండగా నిలిచింది. అంబేద్కర్ విషయంలో అమిత్‌షా వైఖరిని విపక్షాలు ఎండగట్టడం సాధారణమే అయినా...తన బుద్ధిని పోనిచ్చుకోని బీజేపీ అహంకారపూరితంగా విపక్షాల నిరసనలపై ఎదురుదాడి చేస్తోంది.

హింస పాత్ర...

ఆందోళనను అణచివేయడానికి హింస సమర్థ మార్గమంటే అతిశయోక్తి కాదు. బీజేపీ ఇదే పద్ధతిని పదేళ్లుగా అనుసరిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు హింస అనే అస్త్రాన్ని సంధిస్తోంది. 2017 డిసెంబరులో బీమా కోరేగావ్ ఘటన, 2018 ఏప్రిల్‌లో దళితుల భారత్ బంద్, 2019లో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేక ఆందోళనలు, ఆపై రైతుల చారిత్రక ఉద్యమప్పుడు హింసకు ప్రభుత్వంతో పాటు బీజేపీ తెరతీసింది. జేఎన్‌యూ, దిల్లీ యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల్లో హింసాత్మక ఘటనల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. హింస జరిగితే అనుమానాలు వస్తాయి. గందరగోళం నెలకొంటుంది. బీజేపీకి ఇది బాగా తెలుసు. విపక్షాల ప్రతి ఆందోళనను అణచివేసేందుకు హింసను రెచ్చగొట్టడంలో ఈ పార్టీ దిట్ట. హింస జరిగితే అందరి దృష్టి దానివైపునకు మళ్లుతుంది. అసలు ఆందోళనలు ఎందుకు జరిగాయన్నది ఎవరూ పట్టించుకోరు. బీజేపీకి కావాల్సింది అదే. ప్రధాన మీడియా కూడా బీజేపీకి అనుకూలంగా, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉండటంతో కమలం పార్టీకి ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతోంది.

పార్లమెంటులో ఇదే మొదటిసారి....

ఇప్పటివరకు అల్లర్లు, హింస వీధులకు పరిమితం కాగా బీజేపీ వాటిని పార్లమెంటు దాకా తీసుకొచ్చింది. చట్టసభల్లో బీజేపీ సభ్యుల అనుచిత వైఖరి గురించి అందరికీ తెలుసు. డిసెంబరు 19న మాటలతో మొదలైన హింస... భౌతికదాడుల వరకు వెళ్లింది. గత ప్రభుత్వాల హయాంలో విపక్షాలు వందలసార్లు ఆందోళనలు చేసి ఉంటాయి. కానీ ఇలా విపక్షాన్ని అణచివేసేందుకు పాలక పక్షం దూకుడు ప్రదర్శించడం ఇదే మొదటిసారి. డిసెంబరు 19న బీజేపీ ఏం చేసిందన్నది ప్రజలు అర్థం చేసుకోవడం ముఖ్యం. రాహుల్ పరువు తీయడమే లక్ష్యంగా ఆయన మాటలకు విలువులేకుండా చేసేందుకు జిత్తులు ప్రదర్శిస్తోంది. గతంలోనూ ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఇప్పుడు కూడా ప్రతిపక్ష నాయకుడి హోదా నుంచి రాహుల్‌ను తప్పించాలని చూస్తోంది. ఈ డిమాండ్ ఎప్పుడు వస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూసే స్పీకర్ ఉండటం ఆ పార్టీకి కలిసివచ్చే అంశం. రాహుల్ ఒక్కరే కాదు... మొత్తం విపక్షాన్ని అణచివేయాలని బీజేపీ యత్నిస్తోంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలకు గుర్తింపు లేకుండా చేయాలన్న ప్రణాళికతో వారి పరువు తీయడమే లక్ష్యంగా బురద జల్లేందుకు ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో పాలక పక్షానికి అనుకూలమైన మీడియా పైశాచిక ఆనందం పొందుతోంది.

ప్రజలు వాస్తవాలు గ్రహించాలి

బీజేపీ కుట్రల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కాంగ్రెస్‌కు సవాల్‌గా మారింది. బీజేపీ జిత్తులతో పాటు నిరసనలు తెలిపేందుకు విపక్షానికి ఉన్న హక్కుల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరిపై ఉంది. విపక్షాన్ని అణచివేసి ఏకఛత్రాధిపత్యం సాగించాలని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును హరించాలని బీజేపీ బలంగా కోరుకుంటోంది.

కేటీఆర్‌కు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ... తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది.

రాజకీయ కక్షసాధింపునకే కేసు

'అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవు. ముఖ్యంగా 13(1) (ఏ) సెక్షన్ ఈ కేసుకు వర్తించదు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని అనేందుకు ఆధారాలు లేవు. ప్రొసీజర్ పాటించలేదనడం సరైంది కాదు. 14 నెలల తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ కూడా లేకుండా కేసు పెట్టారు. కేవలం రాజకీయ కక్షసాధింపు కోసమే కేటీఆర్‌పై కేసు పెట్టారు. ఈ కేసులో ఎన్నో తప్పులు కనిపిస్తున్నాయి. కార్ రేస్ నిర్వహణకు 2022 అక్టోబరు 25న ఒప్పందం జరిగింది. సీజన్ 10 నిర్వహణకు స్పాన్సర్ వెనక్కి తగ్గారు. రేస్ నిర్వహణలో ఇబ్బందుల నివారణకే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఇబ్బందులు రాకూడదనే హెచ్ఎండీఏ చెల్లింపులు చేసింది. సీజన్-9 వల్ల దాదాపు రూ.700 కోట్ల లాభం వచ్చింది. ఆర్థికశాఖ అనుమతి లేదని ఏసీబీ అధికారులు అంటున్నారు. కార్ రేసింగ్ ఒప్పందాన్ని కొత్త ప్రభుత్వం ఉల్లంఘించింది. కొత్త ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఒప్పందం రద్దయింది. ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యానికి కారణాలు చెప్పలేదు. సుప్రీం తీర్పుల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదులో ఆలస్యం తగదు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అవసరమని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను ఏసీబీ అధికారులు పట్టించుకోలేదు. ప్రజాప్రతినిధిపై కేసుకు ముందు ప్రాథమిక విచారణ చేయాలి. 18న ఫిర్యాదు అందగానే 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేటీఆర్ స్పెక్యులేషన్ చేసినట్టు ఎక్కడా పేర్కొనలేదు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పలేదు. కానీ, అవినీతి నిరోధక చట్టం కింద కేసు పెట్టారు' అని కేటీఆర్ తరపు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు.

దర్యాప్తులో తేలుతుంది: ఏజీ

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'ఎఫ్ఐఆర్ నమోదు ప్రాథమిక అంశం మాత్రమే. అందులో పేర్కొన్న అంశాలే అంతిమం కాదు. దర్యాప్తులో తేలే విషయాల ఆధారంగా సెక్షన్లు చేరుస్తారు. రెండు నెలల క్రితమే కేసు నమోదుకు నిర్ణయించారు. కేసు నమోదు కోసం గవర్నర్ నిర్ణయానికి పంపారు. గవర్నర్ ఆమోదించాకే కేసు నమోదు చేశారు. ఫార్ములా సంస్థకు డబ్బు విదేశీ కరెన్సీలో చెల్లించారు. దీంతో హెచ్ఎండీఏపై అధిక భారం పడింది. విదేశీ కరెన్సీలో చెల్లింపు కోసం ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. ఆర్థికశాఖ అనుమతి కూడా లేదు' అని ఏజీ వివరించారు. గవర్నర్ అనుమతి కాపీని కోర్టు అడగడంతో ఏజీ అందజేశారు. చెల్లింపుల్లో కేటీఆర్ పాత్ర ఏంటని హైకోర్టు ప్రశ్నించింది. కేటీఆర్ పాత్ర ఏంటో దర్యాప్తులో తేలుతుందని ఏజీ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనేది దర్యాప్తు కోసమేనని వివరించారు. కేసు పూర్తి వివరాలు అభియోగపత్రంలో ఉంటాయని, రూ.56 కోట్లకు పైగా చెల్లింపుల్లో నిబంధన ఉల్లంఘన జరిగిందని ఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు.

న్యాయపరంగా ఎదుర్కొంటాం: కేటీఆర్

మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలతో ఫార్ములా ఈ- రేసింగ్ కేసులో అవినీతి జరగలేదనే విషయం స్పష్టం అవుతుందని కేటీఆర్ అన్నారు. హెచ్ఎండీఏ కార్పొరేషన్ చట్టంలోనే హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏకార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని ఉందన్నారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతులు అవసరం లేదని, దానికి స్వతంత్రత ఉందన్నారు. శాసనసభ లాబీలో విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసులో అణాపైసా అవినీతి లేదని, అయినా ప్రభుత్వం కేసు పెట్టాలని అనుకుంటే వాళ్ల ఇష్టం... న్యాయ పరంగా ఎదుర్కొంటామన్నారు. ఓఆర్ఆర్ రోడ్డు లీజు సిట్ ఏర్పాటుపై కేటీఆర్ స్పందిస్తూ టీవోటీ ఇప్పటికే దేశంలో అమలులో ఉందని, ఆ విధానంలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వచ్చిన డబ్బులను రైతు రుణమాఫీకి ఉపయోగించామని తెలిపారు. ఆర్థిక వనరుల సమీకరణపైన అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చిందని పేర్కొన్నారు. నేషనల్ హైవే అథారిటీ... జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీవోటీ విధానంలోనే అవుటర్ రింగ్ రోడ్డు నుంచి డబ్బులు సేకరించామన్నారు. ప్రయివేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రేవంత్ రెడ్డి మాట్లాడిన లక్ష కోట్ల అవినీతి వ్యాఖ్యలపైన హెచ్ఎండీఏ పరువు నష్టం కేసు వేసిందని గుర్తు చేశారు. ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారని, కుంభకోణం అంటున్న అవుటర్ రింగ్ రోడ్డు లీజ్ ను ఎందుకు రద్దు చేయడం లేదో చెప్పాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు రీడిజైనింగ్ రద్దుచేసి, సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పదివేల కోట్ల రూపాయల కోకాపేట కుంభకోణం అంటున్న భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు.

సురేశ్‌కు సుప్రీంలో చుక్కెదురు

(మొదటిపేజీ తరువాయి)

కోరారు కానీ సుప్రీంకోర్టు అంగీకరించ లేదు. ఈ కేసులో ఇంకా చార్జిషీటు దాఖలు చేయలేదని, సురేశ్ అరెస్టుకు 90 రోజులు కాలేదు కాబట్టి బెయిల్ ఇవ్వలేమని స్పష్టంచేసింది. గతంలో మాజీ ఎంపీపై కేసు వివరాలను పిటిషన్‌లో నమోదు చేయకపోవడాన్ని తప్పుబట్టింది. 2020లో ఈ కేసు నమోదు కాగా, అప్పటి ప్రభుత్వం ఎందుకు విచారణ జరపలేదని, విచారిస్తే తన నిర్దోషిత్వం రుజువు అయ్యేది కదా అని సుప్రంకోర్టు వ్యాఖ్యానించింది.

జస్టిస్ దత్తా ధర్మాసనానికి 'ఈవీఎం' కేసులు

(మొదటిపేజీ తరువాయి)

వినిపించారు. గతంలో ఇదే తరహా పిటిషన్లను తిరస్కరించడాన్ని గుర్తుచేశారు. దీనిపై సీజేఐ ఖన్నా స్పందిస్తూ ఇక ఈ వ్యవహారాన్ని జస్టిస్ దత్తా ధర్మాసనం చూసుకుంటుందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జస్టిస్ ఖన్నా, జస్టిస్ దత్తా ధర్మాసనం ఈవీఎంల వెరిఫికేషన్‌పై తీర్పు వెలువరించింది. పేపర్ బ్యాలెట్‌ల పునరుద్ధరణకు తిరస్కరించింది. ఈనెల 13న జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పీవీ వరాలే నేతృత్వ ధర్మాసనం తాజా పిటిషన్‌ను విచారించింది. అనంతరం సీజేఐ ధర్మాసనానికి సిఫార్సు చేసింది. ఫలితాలను సవాల్ చేస్తూ దాఖలైన మరికొన్ని పిటిషన్లు పంజాబ్, హర్యానా హైకోర్టు వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈవీఎంల తనిఖీ ప్రక్రియను ఎనిమిది వారాల్లోగా పూర్తి చేసేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలని సుప్రీం కోర్టును పిటిషనర్లు కోరారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 90కుగాను 48స్థానాల్లో బీజేపీ గెలిచిన సంగతి తెలిసిందే.

అమిత్ షా రాజీనామా చేయాలని కాంగ్రెస్ ధర్నా

విశాలాంధ్ర - గార్ల : భారత రాజ్యాంగ రూపకర్త బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద తమ నోళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణాగౌడ్, జిల్లా నాయకులు గుండా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అమిత్ షా మనువాద విధానాన్ని, అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, కేంద్ర పాలకులకు తొలినుండి అంబేద్కర్ అంటే చిన్నచూపే అని విమర్శించారు. హిందూ ముస్లింల మధ్య దేశంలో మత చిచ్చు రగిలచేందుకు బాబ్రీ మసీదు కూల్చి ఘర్షనలకు పునాది వేశారని, మైనారిటీలను ఊచకోత కోశారని బిజెపి విధానాలపై తీవ్రంగా విమర్శించారు. కర్ణాటకలో దళితులపై, మణిపూర్‌లో ఆదివాసులపై దారుణమైన హత్యాకాండను బీజేపీ పాలకులు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అంబేద్కర్‌ను, దేశాన్ని ప్రేమించేవారు అమిత్ షా రాజీనామా కోసం డిమాండ్ చేస్తూ ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హతిరాం నాయక్, మాలోత్ వెంకట్ లాల్, యాకుబ్ పాష, పృథ్వి రాజ్, బాబురావు, రాంబాబు, యుగేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం ఇవ్వండి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఐటిడిఏ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాలలో శుక్రవారం ఏటూరు నాగారం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్ సూచనల మేరకు, పోలీస్ సిబ్బంది, శుక్రవారం ఉదయం ముమ్మరంగా ఇంటింటి తనిఖీలు నిర్వహించారు. ఇంటి యజమానులు, అద్దెకు ఉంటున్న వారి వివరాలు ధ్రువపత్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారించి వదిలేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై తాజుద్దీన్ మాట్లాడుతూ కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని. తెలియని వారికి ఇళ్లు అద్దెకు ఇవ్వవద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసు వారికి సమాచారం అందించాలన్నారు. సివిల్ సిఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాకు హోంమంత్రిగా ఉండే అర్హత లేదు : తమ్మినేని

విశాలాంధ్ర - ఇల్లెందు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంట్ లోనే అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. తక్షణమే హోం మంత్రిగా అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు లేకపోతే మతోన్మాదుల చేతుల్లో చిక్కిన ఈ దేశానికి భవిష్యత్తు ఉండదన్నారు. మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని తిప్పికొట్టేందుకే కాంగ్రెస్ తో జాతీయస్థాయిలో కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇల్లెందు 24 ఏరియా సింగరేణి కమ్యూనిటీ హాల్ లో శుక్ర, శనివారాలు నిర్వహించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీపీయం మూడో మహాసభల్లో తమ్మినేని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే ఎన్నికల దేశవ్యాప్త జమిలి ఎన్నిక విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రయోజనాల కోసమే వ్యూహాత్మకంగా ఒకే ఎన్నిక విధానాన్ని బిజెపి ముందుకు తీసుకొస్తున్నట్లు విమర్శించారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బందుకు పిలుపునివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఇల్లందు పట్టణం ఎర్రజెండాలతో అరుణ తోరణం గా మారింది. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఆహ్వాన కమిటీ గౌరవాధ్యక్షులు సోమయ్య, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్, రాష్ట్ర సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బండారు రవికుమార్, మీడియం బాబూరావు, కొండపల్లి పావన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, ఆనందాచారి, మూడ్ శోభన్, మాదినేని రమేష్, భూక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్నాం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: సింగరేణిలో కార్మికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు మడ్డి ఎల్లయ్య, కె.స్వామి, ఆరెల్లి పోషంలు అన్నారు. శుక్రవారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జిడికె 2వ ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ అభివృద్ధికోసం ఏఐటీయుసి గత ఎనిమిది దశాబ్దాలకు పైగా అనేక పోరాటాలు, ఉద్యమాలు, సమ్మెలు చేసి హక్కులను సాధించిన చరిత్ర ఏఐటీయుసి యూనియన్ దని వారు పేర్కొన్నారు. నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక ఏఐటీయుసి యూనియన్ నాయకుల ప్రాణ త్యాగం ఉందన్నారు. సింగరేణిలో ఏడు సార్లు జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయుసి నాలుగు సార్లు గెలిచి ఎన్నో హక్కుల సాధన కోసం అనేక అగ్రిమెంట్‌లు చేయడం జరిగిందన్నారు. ఏఐటీయుసి ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు రంగు శ్రీను, ఎస్ వెంకట్ రెడ్డి, పొన్నాల వెంకటయ్య,కారంపూరి వెంకన్న, పి.రవి, పెద్దెల్లి శంకర్, సానా జలపతి, జోసెఫ్, ఎల్.రమేశ్, ఎస్.కె.అజీంపాషా తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : పట్టణంలో పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పురపాలక సంఘ అధికారులు, పోలీస్ అధికారులను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర వీధి వ్యాపారస్తులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే తమ వ్యాపారాన్ని చేసుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగి విధంగా రోడ్లపై వ్యాపారాన్ని నిర్వహించరాదన్నారు. పట్టణంలో పార్కింగ్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, పార్కింగ్ సమస్యను తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. షాపింగ్ మాల్, ఇతర వ్యాపార సముదాయాలలో వారి వారి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చేపల మార్కెట్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పిడి సుభాష్, పోలీస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల్లో జన్యు రుగ్మతలను గుర్తించాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : గర్భిణీలు, నవజాత శిశువులలో జన్యు, జీవక్రియ రుగ్మతలను ముందస్తుగా గుర్తించడానికి సింగిల్ జీన్ డిజార్డర్స్ విధానాన్ని సద్వినియోగం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. మాతృ నవజాత శిశువుల వారసత్వ సింగిల్ జీన్ డిజార్డర్స్ కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం రామవరంలోని ఎంసిహెచ్ ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. గర్భధారణకు ముందు, కాబోయే తల్లిదండ్రులు తమ ఆరోగ్య సంరక్షణ నిపుణులతో జన్యుపరమైన రుగ్మతతో బిడ్డ పుట్టే ప్రమాదం గురించి మాట్లాడి తెలుసుకోవాలని కోరారు. తల్లిదండ్రులు జన్యుపరమైన అసాధారణతల (ప్రీనేటల్ జెనెటిక్ కౌన్సెలింగ్) ప్రమాదాల గురించి ఆరోగ్య సంరక్షణ నిపుణులతో మాట్లాడాలని కోరారు. భావి తల్లిదండ్రులు వారి కుటుంబ చరిత్ర, ఇతర వైద్య చరిత్రను వైద్యుడు లేదా జన్యు సలహాదారుతో సమీక్షించాలాన్నారు. ఆ ప్రమాదాలను మరింత ఖచ్చితంగా అంచనా వేయడానికి పరీక్షలు (జెనెటిక్ క్యారియర్ స్క్రీనింగ్) చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, డాక్టర్ విజయలక్ష్మి, ఇన్స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్, హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్, డీసీఎంహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, డా. రాధామోహన్ సూపరింటెండెంట్, జిజిహెచ్ డాక్టర్ బాలాజీ - ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ చైతన్య, ప్రోగ డాక్టర్ మధువరన్, నిపుణుల బృందం ఇందులో పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేసిన మాల మహానాడు నేతలు

విశాలాంధ్ర - కారేపల్లి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అన్కిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని పలువురు మాల మహానాడు నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కారేపల్లిలో పార్లమెంట్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ దిష్టిబొమ్మను జిల్లా మాల మహానాడు పిలుపుమేరకు సింగరేణి మండలం మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్య చేసినటువంటి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని అదేవిధంగా అమిత్ షాపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు సోమందల రాములు నాయకులు తలారి దేవప్రకాష్, మైప పిరయ్య, తలారి చంద్ర ప్రకాష్ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకులు ఆదర్ల రాములు పప్పుల నిర్మల, పొక్కిలి యుగంధర్, సోమందుల నాగరాజు, తొగరు పోతయ్య, సోమందుల వెంకటేశ్వర్లు, రత్తయ్య, సురేష్, వెంగయ్య కందుల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి...

విశాలాంధ్ర - ఇల్లందు : ఇంటి స్థల విషయంలో తనకు అన్యాయం చెయ్యాలని చూస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు మాణిక్యమ్మ ఉన్నత అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె బాధాతప్త హృదయంతో మాట్లాడారు. 1967లో మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో కొంత స్థలాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె వివరించారు. కాగా అదే ప్రాంతానికి చెందిన స్థానికులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పలు మార్లు తనపై దాడి చేసేందుకు సైతం ప్రయత్నాలు చేశారన్నారు. ఈ విషయంపై ఇల్లందు పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు ఆవేదనతో చెప్పారు. ఫిర్యాదు చేసిన ఫలితంగా ఇంకా వేధింపులు పెరిగి అధికారులు వచ్చి ఇల్లు నిర్మాణ పనులను నిలిపివేయాలని వత్తిడి తెస్తున్నట్లు ఆరోపించారు. ఆ స్థలానికి సంబంధించిన ఆధారాలను రెవెన్యూ, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖ అధికారులకు అందించినప్పటికీ ఫలితం కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ వయస్సులో తనను ఇబ్బందులకు గురిచేయకుండా సకాలంలో న్యాయం చేయాలని ఆమె కోరారు.

100 రోబోటిక్ విప్పల్ శస్త్రచికిత్సలతో ప్రైవేట్ హాస్పిటల్ కిమ్స్

విశాలాంధ్ర-హైదరాబాద్: కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్), హైదరాబాద్‌లోని ప్రముఖ మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో ఒకటి. అత్యంత క్లిష్టమైన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లను 100 రోబోటిక్-సహాయక విప్పల్ తోటి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన భారతదేశంలో మొదటి ప్రైవేట్ హాస్పిటల్‌గా పేరొందినదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కిమ్స్ నిర్వహించిన 100 రోబోటిక్ శస్త్ర చికిత్సల్లో 14 నుంచి 80 ఏళ్ళు వయసు కలిగినవారు అధికమన్నారు. వీరంతా హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్ పరిసర ప్రాంతాలకు చెందినవారన్నారు. డాక్టర్ మధు దేవరశెట్టి, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, కిమ్స్, హైదరాబాద్ వారు ఈ 100 రోబోటిక్ శస్త్రచికిత్సల మైలురాయిని సాధించిన వైద్య బృందానికి నాయకత్వం వహించారన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత అరుదైన, సంక్లిష్టమైన ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కేసులలో ముఖ్య సమస్యలు అధిగమించుటకు, త్వరితంగా కోలుకోవటానికి తాము శస్త్రచికిత్సల కోసం రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించామన్నారు. దీనివలన చాలా మంది రోగులు శస్త్రచికిత్స తర్వాత ఐదవ రోజున డిశ్చార్జ్ అయ్యి త్వరలో వారి సాధారణ జీవితాలను గడిపే అవకాశం కలిగింది అన్నారు.

22న జీ తెలుగలో '35 చిన్న కథ కాదు'

విశాలాంధ్ర-ఆదిలాబాద్: జీ తెలుగు ఈ సంవత్సరం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని '35 చిన్న కథ కాదు' సినిమా ప్రసారం చేసేందు కు సిద్ధమైందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రఖ్యాత గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ గణితశాస్త్రానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులు అర్పిస్తోందన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 35 చిన్నకథ కాదు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ డిసెంబర్ 22న మధ్యాహ్నం 3 గంటలకు.. జీ తెలుగులో మాత్రమే ప్రసారమవుతుందన్నారు. 35 చిన్న కథ కాదు సినిమా కథ లెక్కల చుట్టూ తిరుగుతుందన్నారు.తిరుపతిలో నివసించే మధ్యతరగతికి చెందిన భార్యాభర్తలు సత్య ప్రసాద్(విశ్వదేవ్రాచకొండ), సరస్వతి (నివేదా థామస్). వారికి ఇద్దరుకొడుకులు అరుణ్(అరుణ్‌దేవ్ పోతుల), వరుణ్ (అభయ్ శంకర్).అరుణ్ గణిత నియమాలు తప్పని వాటిని ఎందుకు పాటించా లంటూ ప్రశ్నలు అడుగుతూ ఉంటాడు.అతని ప్రశ్నలకు సమాధానాలు తెలియా లంటే జీ తెలుగులో ప్రసారమయ్యే 35 చిన్న కథ కాదు సినిమా చూడాల్సిందే అన్నారు. అసాధారణ కథతో రూపొందిన ఈసినిమాకి నందకిషోర్ ఈమని దర్శకత్వం వహించారు.

పొడియాట్రిక్ చికిత్సకు అందుబాటులో అత్యాధునిక ఓ-స్కాన్ ఎంఆర్ఐ మెషీన్

హైదరాబాద్: నగరంలోని ప్రముఖ వాస్కులర్, ఎండోవాస్కులర్ అండ్ పొడియాట్రిక్ సర్జన్‌లలో ఒకరైన డాక్టర్ నరేంద్రనాథ్ మేడా ఇటీవల అత్యాధునిక ఇసావోట్ ఓ-స్కాన్ ఎంఆర్ఐని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇసావోట్ నుండి ఆయన ఆసుపత్రికి వచ్చిన ఈఎంఆర్ఐ, హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాలలో రోగులకు అందించే సంరక్షణ ప్రమాణాన్ని మరింత పెంచింది. ఈ అధునాతన రోగనిర్ధారణ సాంకేతికత యంత్రం వల్ల మస్క్యులోస్కెలెటల్, మృదు కణజాల ఇమేజింగ్ ఖచ్చితత్వం, సామర్థ్యాన్ని గణనీయంగా మెరుగుపరచటంతో పాటుగా రోగులకు మరింత ఖచ్చితమైన రోగనిర్ధారణ, మెరుగైన చికిత్సకు ఉపయోగపడుతుంది. పొడియాట్రిక్ కేర్‌లో అత్యాధునిక ఆవిష్కరణలకు ఖ్యాతి గడించిన డాక్టర్ నరేంద్రనాథ్ మేడా, ఈ కొత్త ఎంఆర్ఐ గురించి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ "ఓ-స్కాన్ ఎంఆర్ఐ మెషిన్ పొడియాట్రిక్ రోగులకు ఒక గేమ్-ఛేంజర్ కానుందన్నారు. ఇది తొలిదశలోనే సంక్లిష్ట పరిస్థితులను నిర్ధారించి మెరుగైన చికిత్స అందించటానికి ఉపయోగపడుతుందని, ప్రభావవంతమైన చికిత్స, రోగికి సానుకూల ఫలితాలను తీసుకురావటంలో ఇది కీలకమవుతుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాఠశాలలు, వసతి గృహాలు, మోడల్ స్కూల్స్, కలవల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల కేసముద్రం, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, కేసముద్రం మండలం, పెనుగొండ, బోడ మచ్చ తండలలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పక్కగా నిర్వహించాలని అన్నారు. కేసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టిక మందుల స్టాక్ వివరాలు ఇన్ పేషెంట్ ఔట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తున్న కిచెన్ గదిని స్వయంగా సందర్శించి, పిల్లలకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించదని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డైట్ మెనూ ప్రకారం రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని విద్యా, సానిటేషన్, వైద్యం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు.ప్రత్యేక అధికారులు సైతం క్షేత్రస్థాయిలో వసతి గృహాలు తనిఖీ చేయాలన్నారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్ రెడ్డి, సంబధిత శాఖల అధికారులు ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో -మెదక్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 25న మెదక్ జిల్లా పర్యటనకు రానున్నారు. సీఎం అయ్యాక మొదటిసారి అధికారికంగా జిల్లాకు వస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం ఏడుపాయల సందర్శిస్తారు. వనదుర్గామాతను దర్శించుకుంటారు. అనంతరం వందేళ్లు పూర్తి చేసుకున్న ఉత్సవాలు జరుపుకుంటున్న మెదక్ చర్చి సందర్శిస్తారు. సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ రాహుల్ రాజ్ ఏడుపాయలలో పర్యటించారు. పార్కింగ్ ప్రదేశాలు, హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు సలహాలు అందించారు. ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వెంట పాపన్నపేట తహసీల్దార్, అర్చకులు శంకర్ శర్మ, సిబ్బంది శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

25 ఏళ్లు నిండిన మారుతీ వ్యాగన్‌ఆర్

న్యూఢిల్లీ: మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) భారతదేశంలో వ్యాగన్‌ఆర్ 25 విశేషమైన సంవత్సరాలను జరుపుకుంటుంది. 1999లో 'టాల్ బాయ్'గా మొదటిసారిగా పరిచయమైనప్పుడు, వ్యాగన్‌ఆర్ దాని యూఎస్‌పీతో చాలా విశాలమైన కుటుంబ కారుగా తక్షణమే ఒక సముచిత స్థానాన్ని పొందింది. 2024 వ్యాగన్‌ఆర్ దాని కొత్త-వయస్సు భద్రత మరియు ప్రీమియం ఫీచర్‌లతో ఫ్యామిలీ హ్యాచ్‌బ్యాక్ యార్డ్‌స్టిక్‌ను ముందుకు తీసుకువెళుతున్నప్పుడు దాని విశాలత, సౌకర్యాల ప్రధాన విలువను కొనసాగించింది. దాని మనోహరమైన స్వభావానికి నిదర్శనం దాని పనితీరు, వరుసగా మూడు సంవత్సరాలుగా భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా ర్యాంక్ అందుకుంది. ఇది నమ్మకం, ఆవిష్కరణ, ఆచరణాత్మకతకు చిహ్నంగా వ్యాగన్‌ఆర్ బ్రాండ్ జనాదరణ, శాశ్వతమైన ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ మరియు సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు.

రాహుల్ ద్రవిడ్ తాజా క్యాంపెయిన్‌తో సిగ్నిపై రికార్డ్

ముంబయి: లైటింగ్‌లో సిగ్నిపై ప్రపంచ అగ్రగామిగా ఉంది. తాజాగా భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ నటించిన సిగ్నిపై టెలివిజన్ వాణిజ్య ప్రకటన 'హమ్ రాతోం మే సూరజ్ ఉగాతే హై' అద్భుతమైన విజయాన్ని అందుకుంటోంది. శక్తివంతమైన గీతంతో పవర్ ప్యాక్‌గా తెరకెక్కించగా, పండుగ సీజన్‌కు ముందు విడుదలైన టెలివిజన్ వాణిజ్య ప్రకటన, వినియోగదారులు తమ విశ్వాసం, ప్రేమ, ప్రశంసలతో సిగ్నిపై ఆదరణ చూపిస్తూనే, అంచనాలను అధిగమించి, ప్రతి ఒక్కరిలో ఆసక్తిని పెంపొందించింది. డిజిటల్, సంప్రదాయ మార్కెటింగ్ కార్యక్రమాల ఆరోగ్య మిశ్రమాన్ని తీసుకురావడం ద్వారా క్యాంపెయిన్ 200 మిలియన్లకు పైగా ఇంప్రెషన్లను అందుకుంది. ఇది 22 వార్తా ఛానెళ్లలో దీన్ని టీజర్‌తో విడుదల చేశారు. ఆ తర్వాత సోషల్ మీడియా, ప్రముఖ వార్తా ఛానెళ్లు, బహిరంగ ప్రకటనలు, పీటీఎస్ఎంల వ్యాప్తంగా అధిక-ప్రభావం, 60-రోజుల టీవీ క్యాంపెయిన్‌ను కూడా నిర్వహించారు.

మైక్రోమ్యాక్స్, ఫిసన్ భాగస్వామ్యంలో మైఫై విడుదల

న్యూఢిల్లీ: స్వదేశీ వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ మైక్రోమ్యాక్స్ ఇన్ఫర్మేటిక్స్ ఎన్ఏఎన్‌డీ కంట్రోలర్, ఎన్ఏఎన్‌డీ స్టోరేజ్ టెక్నాలజీలలో ప్రముఖ ఆవిష్కర్త అయిన ఫిసన్ భారతదేశ సాంకేతిక పరిజ్ఞానాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు సిద్ధంగా ఉన్న ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్‌గా మైఫైని ప్రారంభించాయి. భారతదేశం గ్లోబల్ ఎకనామిక్ హబ్‌గా ఆవిర్భవించడంతో, ఈ భాగస్వామ్యం కృత్రిమ మేధస్సులో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలనే దాని ఆశయంతో 'మేకింగ్ ఏఐ ఇన్ ఇండియా' అనే దేశ దృష్టి కోణానికి మద్దతు ఇస్తుంది. వ్యూహాత్మక భాగస్వామ్య ప్రకటన ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, ఉత్పత్తి ఆఫరింగ్‌లను విస్తరించేందుకు, గ్లోబల్ ఏఐ సూపర్ పవర్‌గా భారతదేశ ఆశయాలను ముందుకు తోడ్కొనివెళ్లేందుకు పరిశ్రమలోని ఇద్దరు నాయకులను ఒక్కతాటిపైకి తీసుకు రావడం ద్వారా ఈ నిబద్ధతను ప్రదర్శిస్తుంది. జీపీయూ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, అధునాతన ఎన్ఏఎన్‌డీ స్టోరేజ్ పరిష్కారాలను అందించడం దీని లక్ష్యం.

ఘనంగా పాలసముద్రం జాతీయ చిత్రలేఖన శిబిరం

ముంబయి: నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (ఎన్ఏసీఐఎన్) ఆధ్వర్యంలో సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ సహకారంతో 'పాలసముద్రం జాతీయ చిత్రలేఖన శిబిరం' నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం సమకాలీన భారతీయ కళకు చెందిన 25 మంది ప్రసిద్ధ కళాకారులను ఒకచోట చేర్చింది. వీరందరూ సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్, డిజైన్ పూర్వవిద్యార్థులు. సుందరీకరణలో భాగంగా ప్రత్యేకమైన, అర్థవంతమైన కళాకృతుల సృష్టిలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. డిసెంబర్ 13న ప్రారంభమైన ఈ పెయింటింగ్ క్యాంప్ 2024 డిసెంబర్ 19న ఎన్ఏసీఐఎన్ క్యాంపస్‌లో ముగింపు వేడుకలను నిర్వహించింది. ఈ కాలంలో, ప్రసిద్ధ కళాకారులు తమ అసాధారణ ప్రతిభను అందించి క్యాంపస్‌ను భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వం, సృజనాత్మకతను ప్రతిబింబించే శక్తివంతమైన ప్రదేశంగా మార్చారు. ఈ కార్యక్రమం క్యాంపస్ సౌందర్యాన్ని పెంచడమే కాకుండా, కళాత్మక మార్పిడి, సహకారాన్ని పెంపొందించడానికి ఒకవేదికగా మారింది.

బుక్‌మైషో ఇయర్ ఎండ్ రిపోర్ట్

ముంబయి: 2024 ముగింపు దశకు చేరుకోవడంతో, బుక్‌మైషో తాజాగా బుక్‌మైషో త్రోబ్యాక్‌ని ఆవిష్కరించింది. ఇది భారతదేశంలో వినోదానికి ఏ మాత్రం తగ్గని సంవత్సరాన్ని తిరిగి చూపుతుంది. ఐకానిక్ సినిమాటిక్ అనుభవాల నుండి విద్యుదీకరణ లైవ్ ఈవెంట్‌లు,ఆన్-డిమాండ్ స్ట్రీమింగ్‌ల వరకు భారతదేశం నిజంగా తన వినోద కలలను గడుపుతున్న సంవత్సరంగా నిలిచింది. భారతీయ కథాకథనాలను పునర్నిర్వచించిన పుష్ప 2: ది రూల్ చిత్రం ఈ ఏడాది అత్యధికంగా వీక్షించిన చిత్రంగా నిలిచింది. 10.8 లక్షల మంది సోలో వీక్షకులను ఆకర్షించింది. నవంబర్ 1, 2024, బుక్‌మైషోలో బ్లాక్ బస్టర్ డే, కేవలం 24 గంటల్లో 2.3 మిలియన్ల టిక్కెట్లు అమ్ముడై రికార్డులను బద్దలు కొట్టింది. కల్హో నా హెూ, రాక్ స్టార్, లైలా మజ్నూ వంటి రీరిలీజ్లతో థియేటర్లను ఫేవరెట్ క్లాసిక్స్‌ను వీక్షించే అభిమానులకు టైమ్ మెషీన్లుగా మార్చింది. డెడ్ పూల్, వోల్వరైన్, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ వంటి అంతర్జాతీయ బ్లాక్ బస్టర్స్ ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. భారతీయ సినీ ప్రియుల అభిరుచి సాటిలేనిది ఒక సినీప్రియుడు 221 సినిమాలు చూసిన రికార్డును నెలకొల్పాడు.

అతి పెద్ద ఫ్లాగ్‌షిప్ స్టోర్‌తో 'కికో' విస్తరణ

గుర్‌గావ్: బేబీ కేర్ ఉత్పత్తుల్లో అగ్రగామి సంస్థ అనగానే ప్రతీ ఒక్కరికీ గుర్తుకు వచ్చే పేరు కికో. 120 దేశాల్లో 65 ఏళ్లకు పైగా తల్లిదండ్రులచే విశ్వసించబడిన బ్రాండ్ కికో. కికో బ్రాండ్ ఇప్పుడు తమ వ్యాపార అభివృద్ధిలో భాగంగా గుర్‌గావ్‌లోని ఆంబియన్స్ మాల్‌లో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ని ప్రారంభించింది. ఈ సరికొత్త స్టోర్‌ని ఏర్పాటు చేయడం ద్వారా భారతదేశంలో తమ రిటైల్ వ్యాపారాన్ని మరింతగా విస్తరించాలనే నిబద్ధత కికోలో కన్పిస్తుంది. గుర్‌గావ్‌లో చిన్నారులు ఉన్న ప్రతీ కుటుంబానికి దగ్గరై వారికి చిన్నారులకు కావాల్సిన సంరక్షణ పరిష్కారాలను అందించాలని ప్రయత్నిస్తోంది కికో. ఈ కొత్త స్టోర్ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో ప్రపంచ-స్థాయి బేబీ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాకుండా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న కికో విస్తరణలో మరో మైలురాయిని కూడా సూచిస్తుంది. ఆర్టానా ఇండియా (కికో) సీఈఓ రాజేష్ వోరా కికో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ని ప్రారంభించారు.

టొయోటా కిర్లోస్కర్ మోటర్ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ మహోత్సవ్

హైదరాబాద్: కస్టమర్ రీచ్, కనెక్షన్‌ని పెంపొందించాలనే తమ నిబద్ధతకు అనుగుణంగా, టొయోటా కిర్లోస్కర్ మోటర్, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న దాని అధీకృత డీలర్ల సహకారంతో "తెలంగాణ గ్రామీణ మహోత్సవ్"ను నిర్వహిస్తోంది. డిసెంబర్ 20 నుండి 22, 2024 వరకు జరుగనున్న మూడు రోజుల కార్యక్రమం, తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ ప్రదేశాలలో సౌలభ్యం, యాక్సెసిబిలిటీని నిర్ధారిస్తూ టొయోటా సమగ్రమైన ఉత్పత్తులు, సేవలను వినియోగదారులకు చేరువ చేస్తుంది. హర్ష టొయోటా , కాకతీయ టొయోటా , మోడీ టొయోటా, ఫార్చ్యూన్ టొయోటాలు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నల్గొండ, సూర్యాపేట, కామారెడ్డి, షాద్‌నగర్ వంటి ప్రముఖ ప్రదేశాలలో జరుగుతోంది. తెలంగాణ గ్రామీణ మహోత్సవ్ వినియోగదారులకు అమ్మకాలు, సర్వీస్ (టొయోటా సర్వీస్ ఎక్స్‌ప్రెస్ ఆఫర్ కార్ సర్వీస్), యూజ్డ్ కార్ సొల్యూషన్‌లు (కార్ ఎక్స్ఛేంజ్ ఆఫర్‌లు), వాహనాలతో పాటు రూ 10,000 వరకు ప్రత్యేక స్పాట్ బుకింగ్ ప్రయోజనాలతో కూడిన సమగ్ర అనుభవాన్ని అందించడానికి రూపొందింది.

హెర్బాలైఫ్ ఇండియాకు ప్రతిష్టాత్మక ఐఐటీ మద్రాస్ సీఎస్ఆర్ అవార్డు

చెన్నై: ప్రముఖ ఆరోగ్య, సంరక్షణ సంస్థ హెర్బాలైఫ్ ఇండియా, కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ ఆక్వాఎకో చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా చేసిన సేవలు, గణనీయమైన కృషికిగాను ఐఐటీ మద్రాస్ సీఎస్ఆర్ అవార్డు 2024ను అందుకుంది. ఈ గుర్తింపు మెరుగైన, స్థిరమైన కమ్యూనిటీ ప్రభావాలను సృష్టించడానికి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో హెర్బాలైఫ్ ఇండియా నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఐఐటీ మద్రాస్ సీఎస్ఆర్ సదస్సులో 'విక్షిత్ భారత్ 2047-టెక్-ఎనేబుల్డ్ సీఎస్ఆర్ ద్వారా సమగ్ర పరివర్తన ప్రభావాన్ని నడపడం' అనే శీర్షికతో, తమిళనాడు ప్రభుత్వ పరిశ్రమలు, పెట్టుబడుల ప్రోత్సాహం, వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ టి.ఆర్.బి.రాజా, ఈ అవార్డును ప్రదానం చేశారు, ఆక్వాఎకో, హెర్బాలైఫ్ మద్దతుతో సెంటర్ ఫర్ అక్వాటిక్ లైవ్లీహుడ్స్ (జలజీవిక) చొరవ, తక్కువ వినియోగించని నీటి వనరులను స్థిరమైన జీవనోపాధిగా మార్చడం ద్వారా జల వ్యవసాయాన్ని విప్లవాత్మకంగా మార్చింది.

హైదరాబాద్ 'కేర్‌గివర్స్ హ్యాండ్‌బుక్'తో మిలాప్ సేవలు

హైదరాబాద్: భారతదేశంలోని ప్రముఖ మెడికల్ క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫామ్ మిలాప్, తాజాగా హైదరాబాద్‌లో వైద్య చికిత్సను కోరుకునే రోగులు, సంరక్షకుల కోసం ఒక ముఖ్యమైన వనరును ప్రారంభించింది. "మేకింగ్ హెల్త్‌కేర్‌ని యాక్సెసబల్ ఇన్ హైదరాబాద్: ఏ కేర్‌గివర్స్ హ్యాండ్‌బుక్" పేరుతో ఈ సమగ్ర గైడ్ వ్యక్తులు నగరంలోని విస్తృతమైన హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను సులభంగా, విశ్వాసంతో అన్వేషించటంలో సహాయపడటానికి రూపొందింది. ప్రజా భవన్ వద్ద జరుగుతున్న ప్రజావాణి సెషన్స్‌లో తెలంగాణ ప్రభుత్వ సెర్ప్ సిఇఓ, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్, గౌరవ అతిథి దివ్య దేవరాజన్ ఈ హ్యాండ్‌బుక్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కమీషనర్ కార్యాలయం మద్దతుతో ఇది అభివృద్ధి చేయబడింది, నగరంలో చికిత్స పొందుతున్నప్పుడు వైద్యపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యక్తులకు విస్తృత ప్రభావాన్ని అందించడం, అవకాశాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యం.

మారుతీ సుజుకీ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్‌పై బీహార్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ: మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) భాగల్‌పూర్, దర్భంగా, గయా, పూర్నియా, సరన్‌లలో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ ట్రాక్‌లను ఆటోమేట్ చేయడానికి బీహార్ ప్రభుత్వం రవాణా శాఖతో మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. బీహార్ రవాణా మంత్రి షీలా కుమారి సమక్షంలో ఒప్పందంపై సంతకాలు జరిగాయి. బీహార్ ప్రభుత్వ రవాణా శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ అగర్వాల్, రాష్ట్ర రవాణా కమిషనర్ నవీన్ కుమార్, మారుతీ సుజుకీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తరుణ్ అగర్వాల్ సంతకాలు చేశారు. సున్నా మానవ జోక్యంతో, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు లైసెన్స్ పరీక్షను మరింత సమగ్రంగా, సమర్థవంతంగా, పారదర్శకంగా చేయడానికి ఈ ఒప్పందం ఉద్దేశించబడింది.

ఏపీ, తెలంగాణలో కేవీబీ నూతన శాఖలు ప్రారంభం

హైదరాబాద్: కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ) శుక్రవారంనాడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో 2 కొత్త శాఖలను ప్రారంభించింది. ఏపీలోని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మెయిన్ రోడ్‌లో ఏర్పాటుచేసిన కెవిబి శాఖను జిల్లా రెవెన్యూ అధికారి మలోలా ప్రారంభించగా, హైదరాబాదులోని నిజామాబాద్ వినాయక్ నగర్ లో ఏర్పాటుచేసిన కేవీబీ శాఖను రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మోటూరి దయానంద్ గుప్తా ప్రారంభించారు. రెండు రాష్ట్రాల్లో ఒక్కో శాఖను ప్రారంభించడం ద్వారా బ్యాంకు మొత్తం బ్రాంచ్ నెట్‌వర్క్ 864కి పెరిగింది. ఈ శాఖలు ఖాతాలు, డిపాజిట్లు, పొదుపులు, కరెంట్ ఖాతాలు, లాకర్ సౌకర్యాలతో సహా రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తాయి. కరూర్ వైశ్యా బ్యాంక్‌కు ఏపీ, తెలంగాణలో 209 శాఖలు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, బ్యాంక్ భారతదేశం అంతటా 26 కొత్త శాఖలను తెరిచింది.

సంపాదకీయం

ప్రశ్నకు జవాబు దౌర్జన్యమే

పార్లమెంటు శీతాకాల సమావేశాల తంతు నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 మధ్యాహ్నానికే నిరవధికంగా వాయిదా పడింది. లోక్‌సభ 20 రోజులు సమావేశమైతే రాజ్యసభ సమావేశాలు 19 రోజులపాటు జరిగాయి. లోక్‌సభలోకన్నా రాజ్యసభలో ఈ గందరగోళం ఎక్కువ జరిగినట్టుంది. దీనికి కారణం రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్కర్ వైఖరే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఉభయసభల్లో రెండేసి రోజులు చర్చ జరిగింది. కానీ ఈ చర్చ ప్రారంభం అయిన దగ్గరనుంచి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర చోటా మోటా బీజేపీ నాయకులు ఈ చర్చను ఎమర్జెన్సీ దురంతాలను ప్రస్తావించడానికి, నెహ్రూను దుయ్యబట్టడానికే వినియోగించు కున్నారు. ఎమర్జెన్సీ విధించడాన్ని సమర్థిస్తున్నవారు ఇప్పుడు ఎవరూ లేరు. కాంగ్రెస్‌లో కూడా పశ్చాత్తాపవైఖరే కనిపిస్తోంది. కానీ అధికార పార్టీ మాత్రం ఆ విషయాన్నే పదే పదే ప్రస్తావించి పైశాచిక ఆనందం పొందుతోంది. నిజానికి రాజ్యాంగం మంచి చెడ్డలను గూర్చి ఈ తరానికి తెలియజెప్పే ప్రయత్నం పార్లమెంటులో రాజ్యాంగంపై చర్చ ద్వారా తెలియజెప్పే ప్రయత్నమే జరగలేదు. రాజ్యాంగం అంటే ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించడం, నెహ్రూను తిట్టిపోయడమే అని ఈ తరంవారు నిర్ధారణకు వచ్చేట్టుగానే సాగింది. ఈ చర్చల ద్వారా నవతరం నేర్చుకోగలిగింది ఏమీ లేకుండా పోయింది. తాము ప్రస్తావించదలచుకున్న అంశాలను చర్చకు స్వీకరించినప్పుడు ప్రతిపక్షాలు సభా కార్యక్రమాలకు అడ్డు తగలడం సహజమే. కానీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే ఈ సమావేశాలను జరగనివ్వం అని బీజేపీ నాయకులు సుష్మా స్వరాజ్, అరుణ్ జైట్లీ ప్రకటించిన సందర్భం ఉంది. ఆ కుదురుకు చెందిన వారే ఇప్పుడు అధికారపక్షంలో ఉన్నారు. ఇదివరకెన్నడూ అధికారపక్షం సభా కార్యకలాపాలకు అడ్డు తగిలిన సందర్భాలులేవు. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి ముఖ్యంగా 2019 తరవాత అధికారపక్ష సభ్యులే సభా కార్యకలాపాలకు అడ్డుతగిలి నూతన చరిత్ర సృష్టిస్తున్నారు. సభ నిర్వహణా బాధ్యత అధికార పక్షానిదే. ప్రతిపక్షం అందుకు సహకరించాలి అన్న అంశమూ గుర్తుంచుకోవలసిందే. కానీ అధికారపక్షమే సభా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తున్నప్పుడు ప్రతిపక్షాలు సహకరించడానికి అవకాశం ఎక్కడ ఉంటుంది కనక! అధికార, ప్రతిపక్షాల మధ్య సంధానకర్తగా వ్యవహరించవలసిన పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు కేవలం అధికారపక్షం తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఉండడానికి తగరు అని ఆయన తీర్మానించుకున్నారు. ఇలాంటి పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఇదివరకెన్నడూ తారస పడలేదు. అంతకు ముందు ఆయన న్యాయశాఖ మంత్రిగా ఉన్నప్పుడూ సుప్రీంకోర్టుతో రోజువారీ పద్ధతిలో ఘర్షణకు దిగేవారు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ తమవాడేనని ఆలస్యంగా గుర్తించిన మోదీ ప్రభుత్వం కిరణ్ రిజిజును పార్లమెంటరీ వ్యవహారాలశాఖకు మార్చింది. అప్పటి నుంచి పార్లమెంటులో జరిగిన రగడలన్నింటికీ ఆయనే కేంద్ర బిందువుగా మారిపోయారు. పార్లమెంటు సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను చూసి ప్రజలు గ్రహించగలిగిందల్లా పార్లమెంటు అంటే ఓ కాటా కుస్తీల గోదా, విమర్శ-ప్రతివిమర్శల కేంద్రం అన్న దుష్ట వాతావరణం కొనసాగుతోంది.

రాజ్యాంగంపై చర్చలో రాజ్యసభలో మాట్లాడిన అమిత్ షా డా. బి.ఆర్.అంబేద్కర్ ను కించపరిచి అగ్నికి ఆజ్యం పోశారు. సహజంగానే దీనిమీద ప్రతిపక్షాలు విరుచుకుపడ్డాయి. మరోవేపు ప్రతిపక్షాలు నోరెత్తకుండా రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్కర్ చేయగలిగినంతా చేశారు. ప్రతిపక్ష సభ్యులు ఏ అంశం మీదైనా నోరెత్తగానే ధన్కర్ అధికారపక్ష పాత్రలోకి మారిపోతున్నారు. రాజ్యసభ చర్చల్లో ప్రతిపక్ష నాయకులు మాట్లాడిన సమయం కన్నా ధన్కర్ చేసిన వ్యాఖ్యానాలకు పట్టిన సమయమే ఎక్కువేమో! ఇక్కడితో ఆగినా బాగుండేది. కానీ ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశానికీ దౌర్జన్యంతో సమాధానం చెప్పడం అధికార పక్షానికి రివాజై పోయింది. ఏ అంశానికైనా దౌర్జన్యంతో సమాధానం చెప్పాలని అధికారపక్షం కంకణం కట్టుకున్నట్టుంది. అంబేద్కర్ మీద అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటులో నిరసన చేస్తున్నప్పుడు పోటీగా అధికారపక్ష సభ్యులు కూడా నిరసనకు దిగారు. రాహుల్ గాంధీ అధికారపక్ష సభ్యుల మీద దాడికి దిగారన్న కట్టుకథలల్లారు. ఆయన మీద ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేశారు. నాగాలాండ్‌కు చెందిన ఒక బీజేపీ ఎంపీ విషయంలో రాహుల్ అసంబద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. ఆ ఎంపీ గిరిజన వర్గాలకు చెందిన వారు కనక రాహుల్ గాంధీ మీద ఎస్.సి., ఎస్.టి. లపై అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలంటున్నారు. ఈ ఎఫ్.ఐ.ఆర్. ఆధారంగా రాహుల్ గాంధీ మీద చర్య తీసుకోవచ్చు. అసలు ప్రయత్నం ఏదో ఒక రకంగా రాహుల్ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయించడానికే. రాహుల్ గాంధీ మీద హత్యారోపణ కూడా చేస్తున్నారు. ఈ ఆరోపణకు అనువుగా ఇద్దరు బీజేపీ సభ్యుల్ని ఆసుపత్రిలో చేర్పించారు. నిన్న నిరసన జరిగినప్పుడు రాహుల్ గాంధీ తమను తోసేశారంటున్నారు. పార్లమెంటు ఆవరణలో అడుగడుగునా సి.సి.కెమెరాలు ఉంటాయి. ఈ ఉదంతమే నిజమై ఉంటే అది ఆ కెమెరాల్లో నిక్షిప్తమై ఉండాలి. ప్రభుత్వం అలాంటి వీడియోలేవీ విడుదల చేయలేక పోయింది. దీన్నిబట్టి రాహుల్ మీద కక్ష తీర్చుకోవడానికి బీజేపీ ఏదో పెద్ద కుతంత్రమే పన్నుతున్నట్టుంది. రాహుల్ గాంధీ కులగణన మీద పట్టుబడ్తున్నారు గనక దానికి ప్రతిగా ఆయన మీద ఎస్.సి., ఎస్.టి. చట్టం ప్రకారం కేసు పెట్టాలన్న వాదన బయలుదేరింది. నాగాలాండ్ ఎంపీ ఫిర్యాదు చేయడం కూడా మణిపూర్ మీద సమాధానం చెప్పలేకే. నిరసనను ఎదుర్కోవడానికి దౌర్జన్యానికి దిగడమే బీజేపీ అలవాటు. పార్లమెంటు వెలుపల కూడా బీజేపీ నిరసనలు ఎదుర్కోవడానికి దౌర్జన్యానికి పాల్పడుతోందని భీమా కోరేగావ్ సంఘటన, పౌరసత్వ సవరణ చట్టం, షాహీన్ బాగ్ నిరసనలు, రైతు ఉద్యమం సందర్భంగా బీజేపీ ఇదే విధానాన్ని అనుసరించింది. అన్యాయం జరిగిందంటున్న వారిమీదే కేసులు మోపడం బీజేపీకి అలవాటైన వ్యవహారం. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు నిరసనకు దిగినప్పుడూ ఇదే పద్ధతి అనుసరించారు. అధికారపక్షమే దౌర్జన్యానికి దిగినప్పుడు గందరగోళం, అనుమానానికి తావుంటుంది. ఇలాంటప్పుడు బాధిత పక్షమే సంజాయిషీ ఇచ్చుకోవలసి వస్తుంది. అప్పుడు అసలు సమస్య మరుగున పడుతుంది. దౌర్జన్యం మాత్రం కొనసాగుతుంది. ఇంతకాలం విధులకు పరిమితమైన దౌర్జన్యం ఇప్పుడు పార్లమెంటుకు పాకింది. పార్లమెంటు ఆవరణలో నిరసన కొత్త కాదు. కానీ అధికార పక్షమే నిరసనకు దిగడం ఇప్పుడే అనుభవంలోకి వస్తున్న విచిత్రం. సమ్యమనం ప్రదర్శించవలసిన అధికార పక్షం తద్విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. ప్రతిపక్షం నోరు మూయించి అధికార వ్యవస్థను గుప్పెట్లో పెట్టుకోవడమే బీజేపీ వ్యూహం. దీనివల్ల ప్రభుత్వ జవాబుదారీతనం అంతం అవుతుంది. అదే బీజేపీ లక్ష్యం. ఏమైతేనేం అదానీ వ్యవహారం ప్రస్తావనకు రాకూడదన్న బీజేపీ పంతం నెగ్గింది.

వాహ్... జాకీర్...

అబ్బే... పెద్ద గొప్పోడేం కాదు. మహానుభావుడంతే. జులపాల జుట్టు పెంచేసుకున్నాడు కాబట్టి మహానుభావుడు కాదు. వాహ్ తాజ్ అంటూ టీ పొడుం కొనుక్కోండర్రా అన్నాడని కూడా కాదనుకోండి. మనందరిలాంటోడే. కాకపోతే అతని ప్రాణాల్ని చేతి వేళ్లలో పెట్టుకున్నాడు కదా... అదిగో, అందుకే మహానుభావుడు. ఆ తబలాని వాయిద్యంలా కాకుండా దేవుడి ముందు పెట్టే దీపపు దివ్వెలా భావించాడు కదా. అందుకని మహానుభావుడు. నాంపల్లిలో ప్రజల పూదోట.. అదే పబ్లిక్ గార్డెన్స్‌లో ఆనాడెప్పుడో ఈ జాకీర్ హుస్సేన్ అంటూ పిలుచుకునే తబలా వాయించే ఆయన కార్యక్రమానికి వెళ్లాను. సాంస్కృతిక విలేకరి కదా ఆ మూడు దశాబ్దాల క్రితం. ఆ నెపంతో వెళ్లాను. మనకి సంగీత జ్ఞానమే కాదు... అసలు ఏ జ్ఞానమూ లేని రికామీ రోజులు అవి. ఇప్పుడూ అంతే అజ్ఞానం. కాకపోతే ఐదు పదుల అజ్ఞానపు అంథకారంలో ఉన్నానంతే. భుజాన సంచి వేళ్లాడేసుకుని పబ్లిక్ గార్డెన్స్‌లో ఆరుబయటి వేదిక... అదే ఓపెన్ డయాస్ ముందు ప్రెస్ అని రాసున్న బోర్డు పక్కన మూగగా కూర్చున్నాను. సరిగ్గా ఈ శీత వేళలే. చూరు నుంచి కురుస్తున్న వానబొట్టులా మంచు కురుస్తోంది. చలి కూడా ఉండాలి కదా. అందుకని అదియునూ ఉంది. వేదిక మీద పక్క వాయిద్యాల వాళ్లు సదురుకుంటున్నారు తమ శరీరాలని. ముందు వరుసలో కూర్చునే ఛాన్స్ కొట్టేసిన వాళ్లలో కొందరు చెవులు కొరుక్కుంటూంటే

చక్రవాకం

\- ముక్కాము చక్రధర్

మరికొందరు చెవులు తినేసే పనిలో ఉన్నారు. అక్కడంతా గంభీరంగా లేదు. గందరగోళంగా ఉంది. అదిగో అప్పుడు వచ్చాడాయన. పెద్ద పొడుగు కాదు... అలాగని పొట్టీ కాదు. రెండు చేతులతో అందరికీ నమస్కారం పెడుతు నలువైపులా చూస్తూ వచ్చి నేల మీద పరచిన ఆ ముఖమల్ చాప మీద కూర్చున్నాడు. అంతే అంతటా నిశ్శబ్దం. అన్నింటా నిశ్శబ్దం. అతడే ఉస్తాద్ జాకీర్ హుస్సేన్. వస్తాదును చూసి భయపడతాం కదా... ఉస్తాద్‌ను చూసి భయంతో కూడిన ఆనందంతో వణుకుతాం. కన్నీరవుతాం. ఇంత అదృష్టవంతుడేంట్రా అని ఈర్ష్యకు పోతాం. ఆ మహానుభావుడ్ని చూసిన అదృష్టమైనా దక్కినందుకు గర్వపడతాం. ఇవన్నీ ఆనాడు నేను చూసేసాను. అనుభవించేసాను.

కులమతాలు గీచుకున్న గీతల్లో కదా ఉన్నాం. అందుకని అలాగే ఆలోచిస్తాం. కళాకారులు అలా కాదు కదా. వారికి కళే కులం కదా. వారికి ఆర్టే హార్టు కదా. అందుకే జాకీర్ హుస్సేన్ పుట్టిన వెంటనే ఆయన తండ్రీ అల్లా రఖా ఖాన్ చేసిన పనికి తల్లి విస్తుపోయింది. ఇంతకీ ఏం చేసారంటే.... జాకీర్ హుస్సేన్ చెవిలో తబలా తాళాలు వినిపించారు. పైగా "నేను సరస్వతీ దేవి, వినాయకుడి భక్తుడ్ని" అని తన తండ్రి అన్నారని జాకీర్ హుస్సేన్ చెప్పారు. ప్రఖ్యాత షెహనాయ్ విద్వాంసుడు బిస్మిల్లా ఖాన్ కూడా అంతే... "అమెరికా వచ్చేయండి" అంటూ తెల్లోళ్లు అడిగితే... ఈ ఖాన్ గారు "అక్కడ గంగ ఉంటుందా... మా శివయ్య ఉంటాడా" అని అడిగారట. ఇదిగో ఇలాంటప్పుడే, ఈ మహానుభావుల మాటలు చదువుతున్నప్పుడే... "బాబొరే కళలంటే దైవ పీఠాలురా... కళాకారులంటే సాక్షాత్తూ దేవుళ్లర్రా" అని అరవాలనిపిస్తుంది. అందుకే... ఇందుకే వాళ్లు అక్కడున్నారు. మనం ఇక్కడున్నాం.

చాలా చిన్నప్పుడు జాకీర్ హుస్సేన్ క్రికెట్ ఆడుతున్నాడని ఆయన తండ్రి అల్లా రఖా ఖాన్ కొట్టారు. ఆ తర్వాత కొడుకుని కొట్టినందుకు దారుణంగా ఏడ్చారు. "ఎందుకు కొట్టారు... ఎందుకు ఏడుస్తున్నారు" అని పండిట్ జాకీర్ హుస్సేన్ తల్లి భర్తని అడిగితే... " ఆ వేళ్లు తబలా కోసం పుట్టినవి. తబాలా కోసం మాత్రమే పుట్టిన వేళ్లు. క్రికెట్ ఆడి వేళ్లకు గాయాలైతే ఎలా. అందుకే కొట్టాను. ఇక నేను ఎందుకు ఏడ్చానంటే ఆవేశంలో ఆ వేళ్లపై ఎక్కడ కొట్టానో అని బాధతో ఏడ్చాను" అన్నారట. ఆ చిన్నారి వేళ్లే సంగీత ప్రపంచాన్ని తన చుట్టూ తిప్పుకుంటాయని ఆ తండ్రి గుర్తించారు. అదే నిజమైంది. అదే రుజువైంది. నాలుగు రూకల కోసం మారుపేరుతో ఓ చానెల్‌కి రచనలు చేస్తున్న కాలంలో సంతూర్ మాస్ట్రో పండిట్ శివ కుమార్ శర్మ గురించి రాసాను. ఆ కార్యక్రమం చూసిన ఓ పెద్దాయన నన్ను చాలా అభిమానించారు. ఆ తర్వాత చాలాకాలానికి శివ కుమార్ శర్మ హైదరాబాద్ వస్తే నన్ను తీసుకువెళ్లి ఆయనకు నన్ను పరిచయం చేశారు. నేను కొంటెగా "మీ స్నేహితుడు జాకీర్ హుస్సేన్ ఎలా ఉన్నారు" అని అడిగాను. దానికి పండిట్ శివ కుమార్ శర్మ మహదానంద పడిపోతూ "అచ్ఛాహై బేటా" అంటూ నన్ను తీసుకువెళ్లిన పెద్దాయనతో "మా ఇద్దరి స్నేహం ఈ పిల్లాడికి బాగా నచ్చినట్టు ఉంది" అన్నార్ట. ఈ విషయం ఆ పెద్దాయన నాకు తెలుగులో చెప్పారు.

ఇప్పుడు ఆ ముగ్గురు మహానుభావులు లేరు. బహుశా దేవుడి సమక్షంలో కుడి వైపు ఒకరు, ఎడమ వైపు మరొకరు, ఎదురుగా ఇంకొకరు కూర్చుని తమ వాయిద్యాలతో దేవుడ్ని పరవశింప చేస్తూంటారు. మనమే ఇక్కడ ఏటీఎం క్యూ లైన్లలోనో, ఆసుపత్రి ఓపీ బోర్డు ముందో, ఆదిపరాశక్తి వైన్ షాపు ముందో, రైలు రిజర్వేషన్‌లో ఆర్‌ఈసీ కూడా దొరకలేదన్న చింతలోనో కొట్టుమిట్టాడుతూంటాం. వ్యర్థ జీవులం కదా.. అలాగే వచ్చాం. అలాగే వెళ్లిపోతాం. మధ్యలో కొత్త సినిమా బెనిఫిట్ షో చూసి పోతాం.

సీనియర్ జర్నలిస్టు
సెల్:99120 19929

రాహుల్ అరెస్టుకు బీజేపీ కుట్ర

అరుణ్ శ్రీవత్సవ

"రాహుల్ భయం" బీజేపీకి ఒక వ్యాధిగా పట్టుకుంది. గుజరాత్‌కు చెందిన ఇద్దరు నాయకులకు నిద్రపట్టడంలేదు. పార్లమెంటులో గురువారం గందరగోళ జరగడానికి బీజేపీ ముందుగా రూపొందించుకున్న వ్యూహం అనిపిస్తోంది. మకరద్వారం ద్వారా ఇండియా బ్లాక్ సభ్యులను పార్లమెంటు లోపలికి రావడానికి బీజేపీ సభ్యులు అడ్డగించడం వెనకనే ఏదో కుట్ర ఉందని భావిస్తున్నారు. రాహుల్ గాంధీని అప్రదిష్టపాలుచేసి అదిసాకుగా చూపి అరెస్టుచేసి జైలుకు పంపాలన్నది బీజేపీకి ఉన్న అభిప్రాయంలా ఉంది. భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో అసాధారణ మైన ఘర్షణ సంఘటన బహుశా ఇదే. రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌ను ఎగతాళిచేస్తూ హోం మంత్రి అమిత్‌షా కించపరుస్తూ వ్యాఖ్యానించడాన్ని కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆగ్రహం వ్యక్తంచేశాయి. ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే అమిత్ షా అంబేద్కర్‌ను కించపరుస్తూ మాట్లాడారు. తోపులాట జరిగినప్పుడు రాహుల్‌గాంధీ తనను నెట్టివేశారని, తనకు గాయమైందని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ రాహుల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ తనతో తప్పుగా వ్యవహరించారని, హత్యచేయడానికి కూడా ప్రయత్నించారని బీజేపీ గిరిజన ఎంపీ ఫంగనాన్ కొన్యాక్ ఆరోపించారు. తనను బెదిరించారని ఆమె అన్నారు. కొన్యాక్ వాస్తవంగా కొంతమంది బీజేపీ ఎంపీలతో కలిసి ఉన్నారు. అప్పుడు రాహుల్‌గాంధీ కొంచెం దూరం నుంచే ఆమెతో మాట్లాడారు. ఇండియాబ్లాక్ ఎంపీలను పార్లమెంటు లోపలికి రాకుండా చేయాలన్నదే బీజేపీ ఎంపీల పన్నాగం. రాహుల్ తమపై గూండాగిరి చేశారని తమను తోసివేసే శక్తి ఆయనకు ఉన్నదని 'కుంగ్ ఫూ' ను ప్రయోగించి నెట్టివేశారని బీజేపీ నిందవేసింది.

బీజేపీ మీడియా తప్పుడు ప్రచారం:

బీజేపీ సోషల్ మీడియా అధిపతి అమిత్ మాలవీయ రాహుల్ తప్పుగా వ్యవహరించారన్న ఆరోపణకు మరోకొత్త ట్విస్ట్ ఇచ్చారు. ఎస్‌సి, ఎస్‌టీలపై అత్యాచార నిరోధక చట్టాన్ని ప్రయోగించి అరెస్టు చేయాలని, పార్లమెంటులో మహిళ గౌరవాన్ని దిగజార్చారని ఒక కేసు, ఇద్దరు బీజేపీ ఎంపీలను నెట్టివేశారని మరో ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ప్రచారం చేశారు. రెండు ఎఫ్ఐఆర్‌లు కూడా తగిన సాక్ష్యంతో మద్దతుగా నిలవవు. పార్లమెంటులో జరిగిన ఈ సంఘటన సమూహం మధ్య జరిగింది. దీన్ని సీసీటీవీ నెట్‌వర్క్ ప్రసారం చేసింది. అయితే రాహుల్‌గాంధీపైన ఆరోపణలు వాస్తవమేనని నిరూపించేందుకు సీసీటీవీ ఫుటేజిని బీజేపీ అందించలేకపోయింది. సీసీటీవీ ఫుటేజి రాహుల్ గాంధీపై "గుజరాత్ కుట్ర" ను వెల్లడిస్తుంది. అలాగే సభలోకి 'లాఠీలను' తీసుకురావడానికి బీజేపీ ఎంపీలను ఎవ్వరు అనుమతించారనేది పెద్ద ప్రశ్న. లాఠీలను ఝళిపిస్తూ సభలోకి ప్రవేశించడానికి పార్లమెంటుకు భద్రత కల్పిస్తున్న టిఐఎస్ఎఫ్ సిబ్బంది ఎందుకు అడ్డగించలేదు? అమిత్ షా పార్లమెంటులో కండబలం రాజకీయాలను ప్రయోగించడంలో విజయవంతమయ్యారని ఈ ఘటన జరిపించారని స్పష్టంగా తెలుస్తోంది. లాఠీలు ఝళిపించి ఇండియా బ్లాక్ ఎంపీలు లోపలికి వచ్చేమార్గాన్ని అడ్డుకుంటూ తమకుగల శక్తిని ప్రయోగించారనేది స్పష్టమవుతోంది. మరో కట్టుకథ రాజకీయాలను కూడా బీజేపీ అమలుచేసింది. కింద మెట్లమీదనే

లాఠీలను ఝళిపిస్తూ సభలోకి ప్రవేశించడానికి పార్లమెంటుకు భద్రత కల్పిస్తున్న టిఐఎస్ఎఫ్ సిబ్బంది ఎందుకు అడ్డగించలేదు? అమిత్ షా పార్లమెంటులో కండబలం రాజకీయాలను ప్రయోగించడంలో విజయవంతమయ్యారని ఈ ఘటన జరిపించారని స్పష్టంగా తెలుస్తోంది. లాఠీలు ఝళిపించి ఇండియా బ్లాక్ ఎంపీలు లోపలికి వచ్చేమార్గాన్ని అడ్డుకుంటూ తమకుగల శక్తిని ప్రయోగించారనేది స్పష్టమవుతోంది. మరో కట్టుకథ రాజకీయాలను కూడా బీజేపీ అమలుచేసింది. కింద మెట్లమీదనే ఇద్దరు బీజేపీ ఎంపీలను రాహుల్‌గాంధీ తోసివేశారని బీజేపీ ఎంపీలు ఆరోపణలు చేశారు.

ఇద్దరు బీజేపీ ఎంపీలను రాహుల్‌గాంధీ తోసివేశారని బీజేపీ ఎంపీలు ఆరోపణలు చేశారు.

ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌యాదవ్, హోం మంత్రికి 'వెర్రితనం' పట్టుకున్నదని, తక్షణం రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అగౌరవపరచారన్న అంశంపై అమిత్‌షాపై కాంగ్రెస్ బాణాలు ఎక్కుపెట్టింది. ప్రధాన అంశంపై దృష్టిని మళ్లించేందుకు బీజేపీ పక్కదార్లు పడుతోందని రాహుల్ విమర్శించారు. అమెరికాలో అదానీపై నేరంమోపిన అంశంపై రాహుల్ ప్రశ్నిస్తూ అదానీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేయడంపై బీజేపీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాజకీయ ప్రయోజనాల కోసం అంబేద్కర్‌ను అమిత్‌షా వినియోగించు కుంటున్నారని ఇండియా బ్లాక్ విమర్శించింది. రాజ్యసభలో అమిత్‌షా మాట్లాడుతూ, అంబేద్కర్‌పైగల తప్పుడు ఉద్దేశాలను వెల్లడించారు. అంబేద్కర్‌ను అసంబద్ధ వ్యక్తి అని మాట్లాడటమేగాక, అంబేద్కర్‌పై విలువలేని వ్యాఖ్యానాలు చేశారని కాంగ్రెస్ పేర్కొంది. కోట్లాదిమంది దళితులు, మైనారిటీలు, అంబేద్కర్‌ను గౌరవిస్తున్నారు. వారేగాకుండా సాధారణ తరగతుల ప్రజలు కూడా గౌరవిస్తున్నారు. అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలు బాబాసాహెబ్‌ను ద్వేషిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్, బీజేపీ దృష్టిలో అంబేద్కర్ దళితుడు, పేదవాడు ఈబీసీ తరగతికి చెందిన వాడు అని తక్కువ చూపు చూస్తున్నాయి. ఇప్పటికైనా అమిత్‌షా కోట్లాది ప్రజలకు క్షమాపణచెప్పి రాజీనామా చేయాలి. రాహుల్‌ను ఒక విలన్‌గా చూపించడానికి చేసిన ప్రయత్నం బీజేపీనే తిప్పి కొట్టింది. హోం మంత్రి మాటలను, నడకను ప్రజలకు తెలియజేసింది. రాహుల్‌గాంధీపై బీజేపీకుట్ర బహిర్గతమైంది. గుజరాత్ ద్వయం మౌనంగా ఉండవలసివచ్చింది. అంబేద్కర్ భావజాలాన్ని, తాత్విక కట్టుబాట్లను, మనుస్మృతిని 'కాషాయ పవిత్ర పుస్తకాన్ని' తీవ్రంగా వ్యతిరేకించారని మతవాద శక్తులు ఆయనను ద్వేషిస్తారు.

సభలో ఎవరు మాట్లాడినా వారి ప్రసంగాన్ని ట్విస్ట్ చేసేందుకు బీజేపీనాయకత్వం సిద్ధంగా ఉంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్‌నే లక్ష్యం చేసుకుంటుంది. వాస్తవంగా అమిత్‌షా ప్రసంగం ఆడియో కూడా లభిస్తుంది. వీటిని ఎవరూ తిరస్కరించలేరు. అయితే గోదీ మీడియా మాత్రం కట్టుకథలను బాగా అల్లగలదు. రాజకీయ బాసుల సంతృప్తి కోసం టేపులను కూడా తయారుచేసి ప్రసారం చేయగలదు. బీజేపీ అనుకున్నదొకటి, జరిగిందొకటి అని స్పష్టమైంది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది.

రాష్ట్రాలు వద్దన్నా గోదావరి కావేరి అనుసంధానమా?



వి. శంకరయ్య

దక్షిణాదిలో ముఖ్యంగా తమిళనాడులో పాగా వేసేందుకు బీజేపీ చేయని ప్రయత్నంలేదు. ఇందుకోసం దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాల ప్రయోజనాలను బలి పశువు చేయడమే కాకుండా రాష్ట్రాల పరిధిలో గల సాగునీటి రంగంలో దురాక్రమణకు బీజేపీ పాల్పడుతోంది. గోదావరి, కావేరి అనుసంధానాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక తుదకు బీజేపీ అధికారంలో వున్న చత్తీస్‌ఘడ్ వ్యతిరేకిస్తున్నా ముందుకు పోయేందుకు సిద్ధమౌతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మొన్న గురువారం దిల్లీ నుంచి కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలో అన్ని రాష్ట్రాలు అభ్యంతరం చెప్పాయి. గమనార్హమైన అంశమేమంటే కేంద్ర జల సంఘమే గోదావరిలో మిగులు జలాలు లేవని తేల్చిచెప్పింది. 63 వేల కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టే ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం నిబంధనల మేరకు నికర జలాలు వుండి తీరాలి. ముందుగా ఏదో విధంగా నికర జలాలు చూపెట్టి తదుపరి మిగులు లేక వరద జలాలను తరలించ వచ్చని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. లేకుంటే కేవలం 147 (ఛత్తీస్ ఘడ్ మిగులు వాటా) టియంసిల కోసం ఇంత హంగామా చేస్తుందా? ఇంత భారీ స్థాయిలో నిధులు వ్యయం చేయదు కదా? పైగా ఈ 147 టియంసిల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు ఇవ్వగా తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎన్ని టియంసిలు తరలించ గలదు?

కేంద్ర జల వనరులశాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలో అన్ని రాష్ట్రాలు కట్ట గట్టు కొని అభ్యంతరాలు తెలిపాయి. వాస్తవంలో గోదావరి, కావేరి అనుసంధానమే అమలు జరిగితే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల సాగునీటి పథకం గోదావరి పెన్నా అనుసంధానం పూర్తిగా అటకెక్కినట్లే. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏం చేస్తారో వేచి చూడాలి. గతంలోనే కాకుండా తిరిగి అధికారం చేపట్టిన తర్వాత కూడా గోదావరి పెన్నా అనుసంధానానికి ముఖ్యమంత్రి విస్తృత ప్రచారం కల్పించారు. అయితే గోదావరి కావేరి అనుసంధానం పోలవరం నుండి చేపట్టాలనే ప్రతిపాదన కూటమి ప్రభుత్వం బలంగా వినిపిస్తోంది. ఇది ఏ పక్షంలోనూ జరగదు. ఆశ్చర్యకరమైన అంశమేమంటే గతంలోనే జగన్మోహన్ రెడ్డి హయాంలోనే ఈ ప్రతిపాదనను నదులు అనుసంధానం టాస్క్ ఫోర్స్ కమిటీ ఛైర్మన్ వెదిరె శ్రీ రాం త్రోసిపుచ్చడమే కాకుండా పోలవరం వద్ద నికరజలాలు లేవని స్పష్టంచేసి వున్న అంశం ప్రస్తుత ఇంజినీరింగ్ ప్రముఖులకు తెలియదంటే నమ్మలేము. ఒక విధంగా టాస్క్ ఫోర్స్ కమిటీ ఛైర్మన్ వెదిరె శ్రీ రాం చెప్పిన సాంకేతిక అంశం ఎందుకు గమనంలోనికి తీసుకోలేక పోతున్నారో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రి లేదా రాజకీయ నేతలు ఏమైనా చెప్ప వచ్చు. దేశంలో నికర జలాలు లేకుండా భారీ ప్రాజెక్టులు నిర్మాణం జరగ లేదని ఈ ఇంజనీరింగ్ అధికారులు తెలియదా? పైగా గోదావరిలో ఎన్ని నీళ్లు వున్నాయో లెక్కలు లేవు. వివిధ రకాలుగా గణాంకాలు వున్నాయి. దీనికి తోడు గోదావరిలో

తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ వాటా ఇంత వరకు తేల లేదు. ఇరు రాష్ట్రాల గణాంకాలకు పొంతనలేదు. ఇవన్నీ తేల కుండా గోదావరి కావేరి అనుసంధానం జరిగితే దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ గొంతు కోసినట్లే. 1989 లో జాతీయ జల అభివృద్ధి సంస్థ ప్రతి పాదించిన తొమ్మిది అనుసంధానాల్లో తొట్ట తొలిది మహానది గోదావరి అనుసంధానం. మహానది నుండి 430 టియంసిలు నీళ్లు గోదావరికి తరలించాలని ఈ సమయంలో 200 టియంసిలు నీళ్లు మార్గమధ్యలో ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లకు ఇస్తూ 230 టియంసిలు నీళ్లు ధవళేశ్వరం వద్దకు చేరునట్లు అప్పట్లో ప్రతి పాదించారు. మొన్న జరిగిన సమావేశంలో గోదావరిలో మిగులు జలాలు లేవనే వాదనకు జవాబుగా మహానది గోదావరి అనుసంధానం ముమ్ముందు చేయ బడుతుందనే సమాధానం కేంద్ర మంత్రి చెప్పడం హాస్యాస్పదంగా వుంది. మహానది నుండి 230 టియంసిలు నీళ్లు ధవళేశ్వరం వద్ద చేరితే ఆంధ్ర ప్రదేశ్ ఏం చేసుకుంటుంది?

గోదావరి కావేరి అనుసంధానం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వానికి ముళ్ల కిరీటమే. ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యామ్నాయ ప్రతి పాదనలు చేయగా తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులు మరీ తెగించి 147 టియంసిల్లో 50 శాతం తమకు ఇవ్వాలని స్పష్టం చేశారు. కేంద్రం చెబుతున్నట్లు ఇచ్చంపల్లి నుండి కాకుండా సమ్మక్క బ్యారేజీ నుండి తరలించాలని పైగా అచ్చట నిల్వచేయకుండా వివిధ చోట్ల రెండు రిజర్వాయర్లు కేంద్రమే నిర్మించాలని డిమాండ్‌లు పెట్టారు. ఇప్పుడు తాజాగా కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు అనుసంధానానికి అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇవన్నీ అటుంచి బీజేపీ అధికారంలో వున్న ఛత్తీస్ ఘడ్ తమ వాటా నీళ్లు ఇవ్వ బోమని తెగేసి చెప్పింది. ముమ్ముందు తాము ప్రాజెక్టులు నిర్మించుకోవాలంటే నికర జలాలు లేకుండా పోతాయని స్పష్టం చేసింది. అయినా కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేసేట్టుగా లేదు. త్వరలో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర జలవనరుల శాఖలో జరుగుతున్న పరిణామాలు వేరుగా వున్నాయి. ప్రధాన మంత్రి మోదీ నేరుగా రంగంలోకి దిగుతారని ముందుగా ఛత్తీస్ ఘడ్ ను ఒప్పిస్తారని చెబుతున్నారు. తదనంతరం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంతు వస్తుంది. ఆంధ్రప్రదేశ్ అంగీకరిస్తే తెలంగాణను ఎటూ ఒప్పించవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి పెన్నా అనుసంధానం వదులుకొని గోదావరి కావేరి అనుసంధానానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేక రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడతారో తేలవలసిఉంది. జమిలి ఎన్నికలు వచ్చే లోపు గోదావరి కావేరి అనుసంధానం పట్టాల కెక్కించాలనే పట్టుదలతో కేంద్ర ప్రభుత్వం వుంది.వి. శంకరయ్య విశ్రాంత పాత్రికేయులు

సెల్: 9848394013

ఎగిసిపడ్డ మంటలు... కమ్మేసిన పొగ

గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొని 30 వాహనాలు దగ్ధం
11 మంది దుర్మరణం: 35 మందికి గాయాలు

- అనేక మంది పరిస్థితి విషమం • జైపూర్-అజ్మీర్ రహదారిపై దుర్ఘటన
- రూ.2లక్షల పరిహారం ప్రకటించిన కేంద్రం

జైపూర్: రాజస్థాన్‌లో జైపూర్-అజ్మీర్ రహదారిపై శుక్రవారం ఘోర ప్రమాదం సంభవించింది. గ్యాస్ ట్యాంకర్‌ను ట్రక్కు ఢీకొనగా అందులోని గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిలిసిపడ్డాయి. 30 వాహనాలు మంటల్లో చిక్కుకున్నాయి. ఆ ప్రాంతాన్ని నల్లటి పొగ కమ్మేసింది. ఈ ఘటనలో 11 మంది చనిపోయారు. 35 మందికిపైగా గాయపడ్డారు. వీరంలో దాదాపు సగం మంది పరిస్థితి విషమంగా ఉంది. ఆకస్మిక పరిణామం క్రమంలో వాహనాల్లో నుంచి బయటకు రాలేక కొందరు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మంటలను అదుపు చేయడం అగ్నిమాపక దళానికి కష్టసాధ్యంగా మారింది, ఆ ప్రాంతంలో మూడు పెట్రోల్ బంకులు ఉండటం, ఓ వైపు కాలిపోతూనే ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు ప్రయత్నించడం, మరికొందరు సజీవ దహనం కావడంతో అక్కడ భయానక దృశ్యం ఆవిష్కృతమైనట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కిలోమీటరు దూరం నుంచి మంటలు కనిపించినట్లు చెప్పారు. సమాచారం అందిన వెంటనే అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలు అక్కడకు చేరుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని రాజస్థాన్ ఆరోగ్యశాఖ అధికారులు అన్నారు. మంటలను అదుపు చేయడం కోసం అగ్నిమాపక దళం చాలా శ్రమించాల్సి వచ్చిందని, మూడు పెట్రోల్ బంక్‌లు ఉండగా, వాటికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని భాంక్రోటా స్టేషన్ హౌస్ అధికారి మనీశ్ గుప్తా చెప్పారు. 25కుపైగా అంబులెన్సుల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ ఘటన వల్ల రహదారిపై 300 కిమీలు దెబ్బతిన్నదన్నారు. రహదారి పక్కకున్న దుకాణాలు దగ్ధమయ్యాయని, జరిగిన నష్టం ఎంతో ఇప్పుడే చెప్పలేమని ఓ అధికారి అన్నారు. జిల్లా అధికారుల బృందం ఆసుపత్రిలో బాధిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. ఈ ఘటనపై సమాచారం కోసం 9166347551, 876688431, 73003636 హెల్ప్‌లైన్ నంబర్లను జైపూర్ పోలీసులు ప్రారంభించారు.

ఎస్ఎంహెచ్ ఆసుపత్రికి వెళ్లిన సీఎం, ఆరోగ్య మంత్రి

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఆరోగ్య శాఖ మంత్రి గజేంద్ర సింగ్ ఖింసర్ విషయం తెలిసిన వెంటనే ఎస్ఎంహెచ్ ఆసుపత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. అక్కడి అధికారులు, వైద్యులతో మాట్లాడారు. గాయపడిన వారికి సరైన వైద్యం అందించాలని సూచించారు. సీఎం అనంతరం ఘటనాస్థలిని సందర్శించారు. అక్కడున్న పోలీసు అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిలో దాదాపు సగం మంది పరిస్థితి విషమంగా ఉందని మంత్రి గజేంద్ర సింగ్ అన్నారు. డాక్టర్లు, రెసిడెంట్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది మొత్తం విధుల్లో ఉన్నట్లు చెప్పారు. ఆసుపత్రిలో మరొక వార్డునూ గాయపడిన వారి కోసం తెరిపించినట్లు తెలిపారు. స్వల్ప గాయాలైన వారికి సమీప ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స అందించినట్లు చెప్పారు. ఘటనాస్థలి నుంచి ఎస్ఎంఎస్ ఆసుపత్రి వరకు 'గ్రీన్ కారిడార్' ఏర్పాటు చేశామన్నారు.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

జైపూర్ ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'రోడ్డు ప్రమాదంతో ఇంత మంది చనిపోవడం చాలా బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం' అని ముర్ము, మోదీ వేర్వేరుగా ట్వీట్లు చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు చొప్పున నష్టపరిహారాన్ని ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి ప్రకటించారు. సీఎం భజన్‌లాల్ శర్మకు ఫోన్ చేసి ఘటన వివరాలు తెలుసుకున్న మోదీ... కేంద్రం తరపున సహాయ సహకారాలు అందిస్తామని ఆయనకు భరోసానిచ్చారు.

ప్రభుత్వ నిస్పృహకు నిదర్శనం

రాహుల్‌పై కేసు నమోదు... మండిపడిన ప్రియాంక

న్యూఢిల్లీ : పతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ 'ప్రభుత్వ నిస్పృహకు నిదర్శనమని' కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మండిపడ్డారు. బీఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తే 'దేశం' సహించదని తెలిసి బీజేపీ పరధ్యానంలో మునిగిపోయిందని ఆరోపించారు. 'అంబేద్కర్‌పై అసలు భావాలు బయటపడ్డాయని, అందుకే ఈ అంశాన్ని లేవనెత్తే ప్రతిపక్షాలకు బీజేపీ భయపడుతోంది' అని అంబేద్కర్‌పై హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి స్పష్టంగా పేర్కొన్నారు. లోక్‌సభ వాయిదా పడిన తర్వాత ఆమె పార్లమెంటు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ 'ఈ ప్రభుత్వం భయపడుతోంది. ఈ ప్రభుత్వం అదానీ అంశంపై చర్చకు భయపడుతోంది. వారు ఏదైనా చర్చకు భయపడుతున్నారు. అంబేద్కర్‌పై వారి నిజమైన భావాలు బహిరంగంగా ఉన్నాయని వారికి తెలుసు. అందుకే మేము లేవనెత్తుతున్నందున వారు ప్రతిపక్షానికి భయపడుతున్నారు' అని తెలిపారు. అంబేద్కర్‌కు జరిగిన అవమానంతో జాతీయ ప్రయోజనం ముడిపడి ఉందని ఆమె నొక్కి చెప్పారు. మన రాజ్యాంగాన్ని డాక్టర్ అంబేద్కర్ అందించారని, దేశ ప్రజలు, స్వాతంత్ర్య పోరాటం చేశారని, ఆయన అవమానాన్ని దేశం సహించదని ప్రియాంక అన్నారు. రాహుల్ గాంధీపైఎ దాఖలయిన ఫ్ఐఆర్ గురించి అడిగిన ప్రశ్నకు ఆమె మాట్లాడుతూ 'ఇది ప్రభుత్వ నిస్పృహకు ప్రతీక.

వారు చాలా నిరాశకు గురయ్యారు. వారు తప్పుడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. రాహుల్ జీ ఎప్పుడూ ఎవరినీ నెట్టలేదు. నేను అతని సోదరిని, నాకు తెలుసు. అతను అలాంటి పని ఎప్పటికీ చేయడు' అని అన్నారు. అదానీపై చర్చ అవసరం లేదని, అంబేద్కర్‌ను అవమానించిన తీరును దేశం సహించదని తెలిసి బీజేపీ ఈ ఏకపక్ష ఎఫ్ఐఆర్‌లు వేస్తోందని దేశానికి కూడా తెలుసునని ఆమె అన్నారు. 'అందుకే వారు పరధ్యానంలో మునిగిపోతున్నారు' అని ప్రియాంక గాంధీ అన్నారు.

మరాఠాలపై బీజేపీ కుట్ర

సంజయ్ రౌత్

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన తర్వాత మరాఠీ మాట్లాడే ప్రజలపై దాడులు పెరిగిపోయాయని, వారిని ముంబై, పొరుగు ప్రాంతాల నుంచి వెళ్లగొట్టే వాతావరణాన్ని సృష్టిస్తున్నారని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ థానే జిల్లాలోని కళ్యాణ్‌లో మరాఠీ మాట్లాడే కుటుంబంపై మరాఠీ మాట్లాడని వ్యక్తులు దాడి చేసిన సంఘటనను ప్రత్యేకంగా ప్రస్తావించారు. నావికా దళానికి చెందిన బోటు, ప్రయాణికుల ఫెర్రీ ఢీకొన్న ప్రమాదంలో 14 మంది మరణించినందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని 'అశుభకరం' అని ఆయన అభివర్ణించారు. గ్రామాలు, జిల్లాల్లో దోపిడీలు, హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. మరాఠాలపై దాడికి కుట్ర జరుగుతోందని, దానికి కల్యాణ్ ఘటన నాంది అని అన్నారు. బీజేపీ... 'మరాఠీ సంస్థ' అయిన శివసేనను విభజించి, స్థానికులను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూసే విధంగా బలహీనపరిచిందని, ముంబై, దాని చుట్టుపక్కల ప్రాంతాలను మరాఠీయేతర భాష మాట్లాడే బిల్డర్లు, వ్యాపార వేత్తలకు అప్పగించిందని ఆరోపించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తర్వాత మరాఠీ ప్రజలపై దాడులు పెరిగిపోయాయని, మరాఠీలను ముంబై నుంచి తరిమికొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, థానే, కల్యాణ్‌లో మరాఠా ప్రజలు నివసించకుండా ఉండేలా వాతావరణం సృష్టిస్తున్నారని అన్నారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగమైన తమను తాము శివసేన అని పిలుచుకునే వారు అసమర్థులని, కళ్యాణ్ సంఘటన గురించి పట్టించుకోవడం లేదని అన్నారు. 'వారు (షిండే నేతృత్వంలోని శివసేన) అధికారం కోసం తహతహలాడుతున్నారు. మరాఠీ మనువులను నాశనం చేయడమే బీజేపీ వైఖరి' అని అన్నారు. డా. బీఆర్ అంబేద్కర్‌ను అవమానించారని ఆరోపిస్తూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు, ఎన్డీఏ ఎంపీల మధ్య జరిగిన వాగ్వాదంపై రౌత్ మాట్లాడుతూ 'మాజీ మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి, ముకేశ్ రాజ్‌పుత్ గొడవలో గాయపడ్డారు. నటనలో రాణించారు, నాటకాలలో బహుమతి పొందాలి' అని అన్నారు.

అంబేద్కర్‌పై రాజకీయాలు

కాంగ్రెస్, బీజేపీపై మాయావతి విమర్శ

లక్నో: బీజేపీ, ఇతర పార్టీలను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి శుక్రవారం దుయ్యబట్టారు. 'బాబా సాహెబ్ అంబేద్కర్‌ను గౌరవించకపోవడంలో ఆ పార్టీలన్నీ ఒకే నాణానికి రెండు పార్శ్వాలు' అని తెలిపారు. 'దళితులు, ఇతర నిర్లక్ష్యానికి గురైన వర్గాల దూత పరమపూజ్య బాబా సాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ గురించి పార్లమెంటులో బీజేపీ నేత అమిత్ షా వాడిన మాటలు ఈ వర్గాల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని, అలాంటి పరిస్థితుల్లో ఆ మాటలను వెనక్కి తీసుకోవడం ద్వారా ఆయన కచ్చితంగా పశ్చాత్తాపపడాలి' అని మాయావతి హిందీలో 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'విషయానికొస్తే, బాబా సాహెబ్ డా.అంబేద్కర్, ఆయన కోట్లాది మంది దళిత-వెనుకబడిన, దోపిడీ, అణచివేతకు గురైన అనుచరుల ప్రయోజనాలు, సంక్షేమం పట్ల కులవాద వైఖరి, కాంగ్రెస్, బీజేపీ, వారి మిత్రపక్షాల సంకుచిత మనస్తత్వం కారణంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు నిరంతరం అధ్వానంగా మారుతున్నాయని కొట్టిపారేయలేం' అని మాయావతి మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. 'బీఆర్ అంబేద్కర్‌ను హృదయపూర్వకంగా గౌరవించకపోవడంలో, అనుచరులపై అన్యాయం, దౌర్జన్యాలు చేయడం, వారి రాజ్యాంగ, చట్టపరమైన హక్కులను హరించడంలో ఈ పార్టీలు ఒకే నాణానికి రెండు వైపులా ఉన్నాయి' అని ఆమె అన్నారు. 'ఈ అంశంపై అధికార పార్టీ, ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం కేవలం ఓటు బ్యాంకు రాజకీయం' అని మాయావతి పేర్కొన్నారు. 'దీంతో పాటు ప్రతిచోటా రాజ్యాంగాన్ని పుస్తకాన్ని ఊపుతూ నీలం రంగు ధరించడం వంటి చౌకబారు రాజకీయాలు. ఇవన్నీ చేసే ముందు అధికార పార్టీ, ప్రతిపక్షాలు తమ హృదయాలను సంకుచిత మనస్తత్వం, ద్వేషం, కులతత్వం, చీకటి నుంచి శుభ్రపరచుకోవాలి. అప్పుడే ఆ వర్గాలకు దేశానికి నిజమైన సంక్షేమం సాధ్యమవుతుంది' అని బీఎస్పీ అధినేత్రి మరొక పోస్ట్‌లో పేర్కొన్నారు.

ప్రియాంకకు కానుకగా '1984' బ్యాగ్

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వివిధ అంశాలపై ప్రతిపక్షాలు నిరసనలు హోరెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, మోదీ, అదానీలు కలిసి ఉన్నట్లు ముద్రించిన బ్యాగులు, పలస్తీనా అని రాసి ఉన్న బ్యాగులు, బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను ఖండిస్తున్నట్లు సందేశం ఉన్న బ్యాగులను వెంట తీసుకువచ్చి వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. దీనికి సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి స్థితిలో బీజేపీ ఎంపీ అపరాజితా షడంగి... ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగు అందించడం ప్రాముఖ్యత సంతరించుకుంది. దీనికి సంబంధించిన వీడియోనూ అపరాజితా షడంగి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కోట్ జత చేశారు. అందులో 'కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకకు బ్యాగులంటే చాలా ఇష్టం. అందుకే ఆమెకు '1984' నాటి సిక్కుల ఊచకోతకు సంబంధించిన బ్యాగు అందజేశాను. తొలుత దాన్ని తీసుకోవడానికి ఆమె నిరాకరించినా... తర్వాత తీసుకొని పక్కన పెట్టేశారు' అని రాసుకొచ్చారు. గత 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందో నేటితరానికి తెలియాలనే ఉద్దేశంతో ఈ బ్యాగును బహూకరించానని ఆమె పేర్కొన్నారు.

ధన్కర్‌ను వదిలేది లేదు

ఆ నోటీసు ట్రైలర్ మాత్రమే: జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెడుతూ ఇచ్చిన నోటీసులు కేవలం ట్రైలర్ మాత్రమేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆయనపై అవిశ్వాసం కోసం ప్రతిపక్షాలు మళ్లీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఉపరాష్ట్రపతిని తొలగించేందుకు ఇచ్చిన నోటీసు అనాలోచిత చర్యగా పేర్కొంటూ డిప్యూటీ చైర్మన్ దానిని తిరస్కరించిన సంగతి విదితమే. 'చైర్మన్‌పై అభిశంసన తీర్మానం కోసం మేం ఇచ్చిన నోటీసులు తిరస్కరించారు. అవిశ్వాస తీర్మానం ఎన్నిసార్లు ఇవ్వాలనే అంశంపై రాజ్యాంగంలో ఎలాంటి పరిమితి లేదు. అందుకే, జనవరి 30 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో దీనిని మళ్లీ పరిశీలిస్తాం'అని జైరాం రమేశ్ వివరించారు. ప్రతిపక్షాలు మరోసారి నోటీసులు ఇస్తాయా? అన్న ప్రశ్నకు సూటిగా అవునని బదులిచ్చారు. ఇది తొలి అడుగు మాత్రమేనని, అవిశ్వాస తీర్మానానికి సంబంధించినంత వరకు ఇదొక ట్రైలర్ మాత్రమేనని చెప్పారు. ధన్కర్‌ను తొలగించాలని కోరుతూ ఏకంగా 60 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకాలు చేసి ఈ నెల 10వ తేదీన అభిశంసన తీర్మానం కోసం నోటీసు ఇచ్చారు. ధన్కర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై నమ్మకం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(బీ) కింద వారు ఈ నోటీసు ఇచ్చారు. తనపై ఇచ్చిన నోటీసుపై తాను నిర్ణయం తీసుకోలేనంటూ గురువారం ధన్కర్ సభకు అధ్యక్షత వహించలేదు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇక సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న హరివంశ్... ప్రతిపక్షాల నోటీసును తిరస్కరిస్తూ రూలింగ్ ఇచ్చారు. ఉప రాష్ట్రపతిని తొలగించేందుకు 14 రోజుల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని, ప్రస్తుతం ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసు 24వ తేదీ తర్వాతే చెల్లుతుందని తెలిపారు.

ఎంపీలను రాహుల్ గాంధీ తోసేశారు: బీజేపీ

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో ఎంపీలు గాయపడిన సంఘటనపై బీజేపీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మకరద్వారం వద్ద పైకెక్కి... ఎంపీలను తోసేశారని ఆ పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ... 'గేట్‌పైకెక్కి తన పక్కన ఉన్న ప్రతాప్ సింగ్ సారంగి, సంతోశ్ పాండేని రాహుల్ తోసేశారు. ముకేశ్‌రాజ్‌పుత్‌తో పాటు అక్కడ నిలబడి ఉన్న వారిని నెట్టేశారు. మొదటిసారి ఇలాంటి ప్రవర్తన చూశాను. అయినా వారిలో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. దీనిని మేం ఖండిస్తున్నాం' అని దూబే ఆగ్రహం వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో రెండు రోజుల క్రితం . రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. మరోవైపు అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం ఎంపీలు కూడా నిరసన చేపట్టారు. ఇరువర్గాల ఆందోళనలతో పార్లమెంట్ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇద్దరు బీజేపీ ఎంపీలు తీవ్రంగా గాయపడ్డారు. రాహుల్ తోయడం వల్లే వారు గాయపడ్డారని బీజేపీ ఆరోపిస్తోంది.

రాహుల్‌పై కేసు 'బ్యాడ్జ్ ఆఫ్ ఆనర్'

వేణుగోపాల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై రాజకీయ కక్షతో బీజేపీ చేస్తున్న కుట్రల వల్ల ఆయన ఇప్పటికే 26 ఎఫ్ఐఆర్‌లను ఎదుర్కొంటున్నారని ఆ పార్టీ జాతీయ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వారసత్వాన్ని కాపాడే ప్రయత్నంలో రాహుల్‌పై నమోదైన కేసును 'బ్యాడ్జ్ ఆఫ్ ఆనర్'గా భావిస్తున్నామని, ఇది తమకు గర్వకారణమని తెలిపారు. తమపై ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదైనా ఆర్ఎస్ఎస్-బీజేపీ పాలనను వ్యతిరేకిస్తూనే ఉంటామన్నారు. కాంగ్రెస్‌ను, రాహుల్‌ను బీజేపీ ఎప్పటికీ నిలువరించలేదన్నారు. తమ ఎంపీలు బీజేపీ నేతలపై ఫిర్యాదు చేస్తే... పోలీసులు వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వేణుగోపాల్ ప్రశ్నించారు. పార్లమెంట్ ఆవరణలో రెండు రోజుల క్రితం జరిగిన తోపులాటలో ఇద్దరు బీజేపీ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజ్‌పుత్ గాయపడడానికి రాహుల్ గాంధీయే కారణమని... ఆయన వారిని నెట్టివేశారని బీజేపీ నేతలు ఆరోపించడంతో రాహుల్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును క్రైం బ్రాంచ్‌కు పంపినట్లు పోలీసులు వెల్లడించారు. హోం మంత్రి అమిత్ షా ... అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను రాహుల్ ప్రశ్నించడం వల్లనే ఆయనపై బీజేపీ నేతలు ఇటువంటి కుట్రలు పన్నుతున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ వద్దకు బీజేపీ నేతలు కర్రలతో వచ్చి అడ్డుకున్నారని పేర్కొన్నారు. వారే గందరగోళాన్ని సృష్టించినందుకు బీజేపీ ఎంపీలపై పార్లమెంట్ హౌస్ పోలీస్ స్టేషన్‌లో తమ పార్టీ కౌంటర్ ఫిర్యాదు చేసిందని ప్రియాంక తెలిపారు.

మానవ తప్పిదమే

రావత్ మృతిపై నివేదిక

న్యూఢిల్లీ: మానవ తప్పిదం వల్లే త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందినట్లు వెల్లడైంది. ఆయన ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైంది. ఆ ఘటనలో మొత్తం 12 మంది మరణించారు. ఈ ప్రమాదంలో బిపిన్ రావత్ భార్య మధులిక రావత్ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తమిళనాడులోని కూనూరులో జరిగింది. ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదిక తయారు చేసింది. ఆ నివేదికను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మానవ తప్పిదం వల్ల ఎంఐ-17 హెలికాప్టర్ కూలినట్లు నివేదికలో వెల్లడించారు. 2017 నుంచి 2022 వరకు భారతీయ వైమానిక దళానికి చెందిన 34 ప్రమాదాలు జరిగినట్లు స్టాండింగ్ కమిటీ నివేదికలో పేర్కొన్నారు. 2021-2022లో జరిగిన 9 ప్రమాదాల్లో... డిసెంబర్ 8వ తేదీన జరిగిన ప్రమాదం కూడా మానవ తప్పిదం వల్లే జరిగినట్లు తెలిపారు.

భారత్ సామరస్య దేశం: మోహన్ భగవత్

ముంబై: మందిర్-మసీద్ వివాదాలు గణనీయంగా పెరగడం ఆందోళనకరమని రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్య రామమందిర నిర్మాణం తర్వాత ఇలాంటి వివాదాలు రాజేసి తాము కూడా హిందూ నాయకులం కావచ్చని కొందరు వ్యక్తులు భావిస్తున్నారన్నారు. ఇది తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వెల్లడించారు. పుణెలో 'ఇండియా-ది విశ్వగురు' అనే అంశంపై సహజీవన్ వ్యాఖ్యానాల కార్యక్రమంలో మాట్లాడుతూ కలుపుగోలు సమాజాన్ని ఆయన సమర్థించారు. మన దేశం సామరస్యంగా ఉంటుందని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని భగవత్ పేర్కొన్నారు. తాము హిందువులం కాబట్టే రామకృష్ణ మిషన్‌లో కూడా క్రిస్మస్ వేడుకలు చేసుకొంటామని తెలిపారు. చాలాకాలంగా సామరస్యంగా ఉంటున్నామని దీనిని మనం ప్రపంచానికి చాటాలనుకొంటే ఓ ఉదాహరణగా నిలవాలన్నారు. 'ప్రతిరోజూ కొత్త వివాదం తీసుకొస్తున్నారు. వీటిని ఎలా అంగీకరించమంటారు. ఇది కొనసాగకూడదు. కలిసిమెలిసి ఎలా ఉంటామో భారత్ చూపించాలి. ప్రస్తుతం దేశం రాజ్యాంగం ప్రకారం నడుస్తోంది. దీనిలో ప్రభుత్వాన్ని నడిపే ప్రజాప్రతినిధులను వారే ఎన్నుకొంటారు. ఎవరో ఒకరి ఆధిపత్యం చేసే రోజులు ఎప్పుడో పోయాయి. ప్రతిఒక్కరూ తమను తాము భారతీయులుగా చెప్పుకొంటున్నప్పుడు ఆధిపత్యం భాష ఎందుకు... ఎవరు మైనార్టీ... ఎవరు మెజార్టీ... ప్రతిఒక్కరూ సమానమే. ఎవరి ఇష్టమైన భగవత్ ఆరాధనను వారు పాటించడమే ఈ దేశ ఆచారం. కాకపోతే నిబంధనలు, చట్టాలకు లోబడి సామరస్యంగా జీవించడం అవసరం' అని ఆయన ప్రసంగంలో పేర్కొన్నారు.

పోలీసుల నుంచి ప్రాణహాని: సీటీ రవి

బెంగళూరు: కర్నాటక మంత్రి, కాంగ్రెస్ నేత లక్ష్మీ హెబ్బల్కర్ పై అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దీంతో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే సీటీ రవి... తనకు పోలీసులు, కాంగ్రెస్ నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించారు. తొలుత ఖానాపుర్ పోలీస్‌స్టేషన్‌కు, ఆ తర్వాత రామ్‌దుర్గా స్టేషన్‌కు తరలించారు. తన తలకు గాయమైందని ఆయన ఎక్స్‌లో తెలిపారు. తనకు ఏదైనా జరిగితే పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. పోలీసులు తనపై ఏదో కుట్ర పన్నారని, గాయమైన వ్యక్తికి ప్రథమచికిత్స అందించేందుకు పోలీసులు మూడు గంటల సమయం తీసుకున్నారని వెల్లడించారు. మరోవైపు తమ నేతను రాష్ట్ర ప్రభుత్వం హత్య చేసేందుకు కుట్ర పన్నిందని ఆరోపిస్తూ రాష్ట్ర బీజేపీ అధికారిక ఎక్స్‌లో ఆరోపించింది. ఇదిలాఉండగా... సీటీ రవి తనపై చేసిన వ్యాఖ్యలకు ఎలా స్పందించాలో తెలియడం లేదని, తాను ఎవరికీ భయపడనని లక్ష్మీ హెబ్బల్కర్ పేర్కొన్నారు.

సంభల్ ఎంపీపై విద్యుత్ చౌర్యం కేసు

సంభల్ (ఉత్తర ప్రదేశ్): సంభల్ లోక్‌సభ సభ్యుడు జియా ఉర్ రెహ్మాన్‌కు విద్యుత్ శాఖ రూ. 1.91 కోట్ల జరిమానా విధించింది. అలాగే విద్యుత్ చౌర్యం ఆరోపణపై అతని ఇంటికి విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు కూడా ఒక అధికారి శుక్రవారం తెలిపారు. విద్యుత్ చౌర్యం కింద సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీపై 2003 విద్యుత్ చట్టంలోని సెక్షన్ 135 కింద గురువారం పోలీసు కేసు నమోదయింది. దీప సరాయ్ ప్రాంతంలోని అతని నివాసంలో తనిఖీ సందర్భంగా అధికారులను బెదిరించినందుకు ఎంపీ తండ్రి మమ్లుకూర్ రెహ్మాన్ బార్క్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు వివరించారు. 'ఈ రోజు కూడా సంభల్‌లో విద్యుత్ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎంపీకి విద్యుత్ శాఖ రూ.1.91 కోట్ల జరిమానా విధించింది. అతని నివాసానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశాం' అని సంభల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వినోద్ కుమార్ పీటీఐకి తెలిపారు. విద్యుత్ శాఖ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం... తనిఖీ బృందం మీటర్‌ను దాటవేయడం ద్వారా విద్యుత్ చౌర్యం జరిగినట్లు ఆధారాలు కనుగొని అక్రమ విద్యుత్ వినియోగాన్ని నిర్ధారించింది. ఎంపీ నివాసం వద్ద భారీ బందోబస్తు మధ్య గురువారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. నగరంలోని కోట్ గర్వి ప్రాంతంలోని మొఘల్ నాటి షాహీ జామా మసీదులో కోర్టు ఆదేశించిన సర్వే సందర్భంగా భద్రతా సిబ్బందితో జరిగిన ఘర్షణలో నలుగురు స్థానికులు మరణించిన నవంబరు 24 హింసాకాండకు సంబంధించి నమోదయిన కేసులో జియా ఉర్ రెహ్మాన్ కూడా ఉన్నారు. సంభల్ పోలీసు సూపరింటెండెంట్ కృష్ణ కుమార్ బిష్ణోయ్ అంతకుము ందు విలేకరులతో మాట్లాడుతూ గురువారం ఉదయం 7.30 గంటలకు విద్యుత్ శాఖకు చెందిన సంతోష్ త్రిపాఠి దీప సరాయ్ ప్రాంతంలో విద్యుత్ పరికరాలను తనిఖీ చేశారు. ఎంపీ నివాసంలో జరిగిన తనిఖీల్లో మమ్‌లుకూర్ రెహమాన్ బార్క్ ఇంజనీర్లు వీకే గంగల్, అజయ్‌కుమార్ శర్మను దుర్భాషలాడారని, ప్రభుత్వ పనులను అడ్డుకున్నారని తెలిపారు. ' ప్రభుత్వం మారుతుంది. మేము మిమ్మల్ని నాశనం చేస్తాం' అని బార్క్ ఇంజనీర్‌తో చెప్పాడని పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు.

అత్యంత కాలుష్య నగరం ఢిల్లీ

న్యూఢిల్లీ: భారత్‌లోనే అత్యంత కలుషిత నగరంగా దేశ రాజధాని ఢిల్లీ నిలిచినట్లు అధికారిక డేటా తెలిపింది. ఢిల్లీలో శుక్రవారం ఉదయం వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) పేలవమైన కేటగిరీలోనే కొనసాగింది. గత ఐదు రోజుల నుండి ఢిల్లీలో ఏక్యూఐ పేలవంగానే కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం ఉదయం 24 గంటల సగటు వాయు నాణ్యతా సూచి 433గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) తెలిపింది. ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) సూచించిన పరిమితి కన్నా 17 రెట్లు ఎక్కువగా ఉందని వెల్లడించింది. సీపీసీబీ ప్రకారం ఢిల్లీలో పీఎం 2.5 (ప్రధాన కాలుష్య కారకం) స్థాయి గురువారం ఉదయం 8 గంటలకు క్యూబిక్ మీటరుకు 255.3 మైక్రో గ్రాములుగా ఉంది. ఇది డబ్ల్యుహెచ్ఓ సూచించిన 15 మైక్రోగ్రాముల పరిమితి కన్నా 17.02 రెట్లు ఎక్కువ. ఈ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులతో పాటు ప్రజల్లో ఊపిరితిత్తుల వ్యాధులు, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

కాంట్రాక్టు కార్మికుల వేతనం పెంచాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో దాదాపు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాలలో అతి తక్కువ జీతాలతో పనిచేయుచున్నారని, కార్మికుల శ్రమ ద్వారా జిహెచ్ఎంసికి ఆదాయం సమకూరుతున్నప్పటికీ వారి శ్రమకు తగిన గీతం మాత్రం ప్రభుత్వం చెల్లించడం లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. శుక్రవారం జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ మూడవ మహాసభ హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో బొడ్డు పెల్లి కిషన్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.నరసింహ మాట్లాడుతూ జిహెచ్ఎంసి కార్మికులకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ప్రస్తుత ప్రభుత్వం ఏమైనా వారి జీతాలను పెంచి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏసురత్నం మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో పని చేస్తున్నటువంటి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్, హెల్త్ ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలను కల్పించాలని వారు డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.రవి చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, కార్యదర్శి మనం జైపాల్ రెడ్డి, ఏఐటియుసి హైదరాబాదు నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, జిహెచ్ఎంసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నగర ఉప ప్రధాన కార్యదర్శి జి.నరసయ్య, నిరంజన్, స్వప్న, కొండల్, జి.ధర్మపురి, విక్రమ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : గృహ రుణాలలో అగ్రగామి సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ తెలిపారు. హైటెక్స్‌లోని హాల్ నెంబర్ 4 నందు శుక్ర వారం నుండి 22 వరకు మూడు రోజులపాటు మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో షోను అట్టహాసంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశ వ్యాప్తంగా 22.500కి పైగా శాఖలతో తన ఉనికిని కలిగి రూ.7.95 ట్రిలియన్ మార్కును అధిగమించిందిని వివరించారు. హైదరాబాద్ సర్కిల్ ఏడాదికి రూ.10.000 కోట్ల హౌసింగ్ లోన్ పంపిణీలు, గృహ రుణాల ప్రాసెసింగ్, మంజూరు కోసం తెలంగాణ రాష్ట్రం అంతటా బ్యాంక్ 27 ప్రత్యేక గృహ రుణ కేంద్రాలను కలిగి ఉందని పేర్కొన్నారు. బ్యాంక్ యోనో యాప్‌లో వివిధ డిజిటల్ ఎనేబుల్‌లను ఏర్పాటు చేసిందని, దీని ద్వారా కస్టమర్‌లు బ్యాంక్ శాఖను సందర్శించకుండానే హోమ్ లోన్‌లను దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పోలో, హైదరాబాద్ నగరంలోని 50 మందికి పైగా పెద్ద బిల్డర్లు తమ కొనసాగుతున్న చేపట్టబోయే ప్రాజెక్టలను ప్రదర్శించారు. ఈ ప్రాపర్టీ షోలో తమ ఇంటిని బుక్ చేసుకునే వారికి ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ రేట్లలో రాయితీలు అందించబడతాయని అన్నారు. హైదరాబాద్‌లో ప్రాపర్టీని కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్న వ్యక్తులు ప్రాపర్టీ ఎక్స్‌పోను ప్రాసెసింగ్ చేసుకుని, వారి డ్రీమ్ హోమ్‌ను ఎంచుకుని, ప్రాపర్టీ షోను సద్వినియోగపర్చుకుని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్‌బిఐ సిబ్బందితో పాటు పలువురు బిల్డర్లు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శేర్లింగంపల్లి కమిటీ ఆధ్వర్యంలో చందానగర్ లో అంబేద్కర్ విగ్రహం దగ్గర కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్ పైన చేసిన వాక్యాలపై నిరసనగా అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కించపరచడం అంటే దేశాన్ని అవమానించడమేనన్నారు. భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అమిత్ షా గద్దెనెక్కిన తర్వాత అంబేద్కర్ ని అవమానించడం అత్యంత హేయమైన చర్య అని, బిజెపి ప్రభుత్వం తక్షణమే అమీషాను తన పదవి నుంచి భర్త రఫ్ చేయాలి దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత పౌరులకు క్షమాపణ చెప్పాలన్నారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ద్వారానే అమిత్ షాకు కేంద్రంలో హోంమంత్రి దక్కిందని విషయాన్ని మర్చిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండలకార్యదర్శి ఎస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వెంకటేష్, సి.రాజు, కెవిపిఎస్ నాయకులు సత్యము, శ్రీనివాసు, సిపిఎం శేర్లింగంపల్లి కార్యదర్శి శోభన్, కాంగ్రెస్ నాయకులు కవిరాజు, సూర్య, సిఐటియు కార్యదర్శి కృష్ణ, వరుణ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రతి సంవత్సరం ముస్లిం మాసాల ప్రకారం రబ్బీసాని మాసంలో దర్గ వద్ద గ్యార్మీ పండుగను, హిందువులు, ముస్లింలు మమేకంగా ఘనంగా జరుపుకుంటారని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. గ్యార్మి పండుగ పురస్కరించుకుని అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈద్గా నందు నిర్వహించిన ఉత్సవాల్లో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం ఒకరి ఇంటి వద్ద నుండి సందల్ ఊరేగింపుతో దర్గా వద్దకు చేరుకుని ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుండి జెండా దర్గా వద్దకు తీసుకువచ్చి దర్గా వద్ద నిలుపుతారు వారు తెలిపారు. నాయకులు కూన సత్యం గౌడ్,కావూరి ప్రసాద్, వాసు, నవీన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నవాజ్,కైజర్, సయ్యద్, రెహ్మాన్, సుల్తాన్, అబ్దుల్, కలీల్, అలహాబాక్ష, ముస్తఫా, షఫీ, సోయల్ పాల్గొన్నారు.

తప్పు చేస్తే న్యాయవిచారణ ఎదుర్కోవాల్సిందే

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముసుగు వేసుకుని రాష్ట్రంలో బీఆరెస్ రాజకీయం చేస్తూ ప్రజల సానుభూతి పొందాలని ప్రయత్నం చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబెడ్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మండిపడ్డారు. కేబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ రేస్‌కు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ఆమె నిలదీశారు. అయినా ప్రభుత్వం అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకని ప్రశ్నించారు. అదేవిధంగా గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని స్పష్టం చేశారు. శాసనసభకు ముందు బీఏసీలో ఈ ఫార్ములా మీద చర్చ కోసం బిఆర్ఎస్ ఎందుకు అడగలేదని ఆమె బీఆరెస్‌ను నిలదీశారు. జైలుకు వెళ్లి యోగా చేస్తా అన్న కేటీఆర్ ఇపుడు ఎందుకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. తప్పు లేకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా అన్నారు. కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళితే తప్పు పట్టిన కేటీఆర్ ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు, అంటే కేటీఆర్ కు నిజాయితీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. లక్షలాది మంది రైతుల ప్రయోజనం చేకూర్చే భూభారతి బిల్లు పై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. వాళ్ల భూకబ్జాల బాగోతం బయటపడుతుందని సభను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, కానీ అందరూ చట్టం ముందు సమానులే, ఫార్ములా ఈ కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే అని పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణకు మండలి ఆమోదం...

తెలంగాణ పంచాయతీ రాజ్ 2018 చట్టానికి 25 సవరణలు చేస్తూ ప్రతిపాదించిన తెలంగాణ పంచాయతీరాజ్, 2024 బిల్లుకు నిన్న అసెంబ్లీ ఆమోదం తెలిపింది. గురువారం శాసనసభలో సవరణలకు సభ ఆమోదం తెలపగా శుక్రవారం శాసన మండలిలో చర్చ అనంతరం ఆమోదం తెలిపారు. శాసనమండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన పంచాయతీ రాజ్ బిల్లును ప్రవేశపెట్టారు. మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదాలో రాష్ట్రపతి కార్యక్రమంలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఉండడంతో శాసనమండలిలో బిల్లును పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : వన మహోత్సవం - 2024 కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ వెనుక భాగంలో గల లింక్ రోడ్డు ప్రాంతంలో పెద్దయెత్తున చేపట్టిన ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా యావత్ తెలంగాణ ప్రజలు ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రతి పౌరుడు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ ఒక మొక్క నాటాలని సంకల్పం తీసుకోవాలని, రాబోయే రోజుల్లో హైదరాబాద్‌ను కాలుష్యం నుండి రక్షించే బాధ్యతను యువత తీసుకోవాలన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్‌కి అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో భాగంగా కాలుష్యాన్ని నివారించడానికి వాహనాలకు ఈవీ పాలసీ తీసుకొచ్చింది. అలాగే హైదరాబాద్ నగరంలో అన్ని వాహనాలు ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు, ఆటోలకు ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తామన్నారు. కాల పరిమితి పూర్తి చేసుకున్న జీహెచ్ఎంసీలో వాడే వాహనాలు స్క్రాప్‌కి ఇచ్చి వాటిని ఈవి వెహికిల్‌గా మారుస్తామన్నారు. అలాగే 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామన్నారు.

కాలుష్య నిర్మూలనకు చెట్లు చాలా అవసరమని అన్నారు. సామాజిక బాధ్యతగా రోజు వారి కార్యక్రమాల్లో మొక్కలు నాటడం, పెంచడం అలవాటుగా చేసుకోవాలన్నారు. వాతావరణాన్ని కాపాడడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ నాన్-గజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి.రవి ప్రకాశ్ అధ్యక్షతన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులతో కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ గౌతమ్ పోట్రుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సంక్షేమ హాస్టళ్లలో అమలవుతున్న నూతన డైట్ విధానం (కామన్ మెనూ) అమలుతో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలను, సవాళ్లను కలెక్టర్‌కి వివరించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాన్-గజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి ధేరవాత్ రజిని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ కేంద్ర ఫోరమ్ ఉపాధ్యక్షుయులు పాండు, సుధాకర్ రెడ్డి, తెలంగాణ నాన్-గజెటెడ్ ఆఫీసర్స్ యూనియన్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మద్దూరి మాణిక్యం, కార్యదర్శి కమల్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు జీవన ప్రమాణ పత్రాలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ వారి సిబ్బంది రైల్వే ఉద్యోగులకు సౌకర్యవంతంగా వసతులు కల్పించినందుకు, జీవన ప్రమాణ పత్రాలు అందించినందుకు మహిళలు, బ్రాంచ్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ జి.కిర్మయిని ఘనంగా సత్కరించారు. బ్రాంచ్ మేనేజర్ సాయిలత మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా తమ శాఖ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లిల్లి మోడల్ హై స్కూల్ ప్రిన్సిపల్ పద్మావతి, సంధ్యారాణి విశాలక్షి, కనకదుర్గ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మానవ కమిషన్‌లో అల్లు అర్జున్‌పై ఫిర్యాదు

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : ప్రచార మోజులో ప్రాణాలు తీసిన అల్లు అర్జున్, ప్రొడక్షన్ టీం, సంధ్య థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాధు చేశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాధు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న సంధ్య థియేటర్‌లో పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ దుష్ప్రవర్తన, నిర్లక్ష్యం కారణంగా మానవ హక్కులను తీవ్ర భంగం వాటిల్లిందన్నారు. ప్రేక్షకులను కంట్రోల్ చేయలేమని పోలీసులు హెచ్చరించినా లెక్కలేనితనంతో నటుడు అల్లు అర్జున్ వచ్చారని, దానివల్ల ఓ నిండు ప్రాణం బలైందని, ఆమె కుమారుడు శ్రీతేజ చావు బతుకుల మధ్య ఉన్నాడని కమిషన్‌కు తెలిపారు. ఈ సంఘటన జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు హామీ ఇచ్చే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్పష్టమైన ఉల్లంఘన అని, అల్లు అర్జున్ ఉద్దేశపూర్వక దుష్ప్రవర్తన, థియేటర్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ టీమ్ నిర్లక్ష్యంతో ప్రజా భద్రత ప్రమాదంలో పడిందని కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రజా భద్రతను నిర్ధారించడంలో పోలీసు సలహాలను పాటించడంలో థియేటర్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ నిర్వాహకులు అల్లు అర్జున్ సంయుక్తంగా విఫలమైందని, మానవ హక్కులు ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ సేఫ్టీ, పబ్లిక్ ఈవెంట్‌ల కోసం పోలీసుల సలహాలను కఠినంగా అమలు చేయడం కోసం కఠినమైన ప్రోటోకాల్‌ల సూత్రీకరణను సిఫార్సు చేయాలని కోరారు. ఈ సంఘటన మరణించిన వారి కుటుంబానికి కోలుకోలేని దుఃఖాన్ని కలిగించిందని, చిన్నారి శ్రీ తేజ్‌కు తీరని బాధ కలిగించిందని, బాధితులకు న్యాయం జరగడానికి బాధ్యులకు జవాబుదారీగా ఉండేలా ఈ గౌరవ కమిషన్ తక్షణ జోక్యం అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి గౌడ్, బడేసాబ్, నాయకులు రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్, మహిందర్ నాయుడు, గౌతమ్ శంకర్, దేవర శివ తదితరులు పాల్గొన్నారు.

ఛలో అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తత

విశాలాంధ్ర - హైదరాబాద్ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఛలో అసెంబ్లీ ముట్టడి చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం వలన పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రను చేస్తున్నారని అన్నారు. మతతత్వ భావజాలాన్ని విద్యార్థులపై రుద్దాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసేంతవరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వం అనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కార్పొరేట్ కళాశాలల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించి ఆయా కళాశాలలను సీజ్ చేయాలని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌లను నివారించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేసి, భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బానోత్ రఘురాం నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడుపల్లి లక్ష్మణ్, బాషాబోయిన సంతోష్, ముదిగొండ మురళీ, మచ్చ రమేష్, ఎం.డి.అన్వర్, ప్రేమ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, అంజి, శరత్, దత్తురెడ్డి, లోకేష్, పార్థసారథి, శివ, అభిరామ్, ప్రణీత్, శ్రావణి, హరీష్, రవితేజ, చరణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలి

కమిషనర్ ఇలంబర్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగరంలో మహిళా సాధికారిత సాధించేందుకు అధికారులు కృషి చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఎస్టేట్, అర్బన్ కమ్యూనిటీ విభాగం అడిషనల్ కమిషనర్లు, ప్రాజెక్టు అధికారులతో పాటు జోనల్ పిఓ లు, అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులతో ఆ శాఖల ప్రగతి పై కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మహిళా సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోటి మహిళలను కోటీశ్వర్లను చేయాలనే లక్ష్యంతో ఉన్నందున నగరంలో అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించి వారికి బ్యాంక్ లింకేజి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అర్హులైన మహిళలందరిని స్వయం సహాయక సంఘాల గ్రూప్‌లో సభ్యులుగా చేర్చి ఆర్థిక సాధికారతకు దోహద పడే విధంగా కృషి చేయాలని కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 10,240 స్వయం సహాయక సంఘాలకు 704.67 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.543.43 రూపాయలను, 5016 సంఘాలకు బ్యాంకు లింకేజీ పంపిణీ చేసిన నేపథ్యంలో వచ్చే నెల వరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా మహిళలకు రూ.412 కోట్ల విలువ గల 487 యూనిట్లు అందించాలని లక్ష్యంగా కాగా 1.59 కోట్ల రూపాయల విలువ గల 184 యూనిట్‌లకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో మొత్తం 7వేల మహిళా ఎంటర్ ప్రేనియార్ షిప్ నెలకొల్పేందుకు నగర వ్యాప్తంగా 410 కోట్ల రూపాయలతో 6000 వ్యక్తిగత ఎంటర్ ప్రైజేస్, మరో 1000 గ్రూప్ ఎంటర్ ప్రైజేస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోనైనది. ఇప్పటి వరకు 1062 కొత్త గ్రూప్‌లను ఏర్పాటు చేసినట్లు అడిషనల్ కమీషనర్ చంద్రకాంత్ రెడ్డి వివరించగా నగరంలో సుమారు 24 లక్షల గృహాలు ఉన్నాయని ఒక్కొక్క ఇంటికి ఒక మహిళను హెచ్ఎస్‌జి గ్రూప్‌లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఆర్థిక సామాజికంగా అభివృద్ధి చెందితే కుటుంబం మొత్తం ఆర్థికాభివృద్ధి చెందే వెసులుబాటు ఉంటుందన్నారు.

జీహెచ్ఎంసీ ఆస్తులను కంప్యూటరైజ్ చేయాలి: కమిషనర్...

నగర వ్యాప్తంగా ఉన్న జిహెచ్ఎంసి ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రార్ ఏర్పాటు చేసి దాని ప్రకారంగా కంప్యూటరైజ్ చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఆస్తులకు సంబంధించిన లీజు పూర్తయిన, ఇంకా కొనసాగుతున్నట్లు వివరాలను సేకరించి వారందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. లీజుకు తీసుకున్న వ్యక్తి వినియోగించుకుం టున్నారా లేదా ఇతరులు ఉపయోగించుకుం టున్నారా అని క్షేత్ర స్థాయిలో జోనల్ అసిస్టెంట్ ఎస్టేట్ అధికారులు విచారించి నివేదిక అందజేయాలన్నారు. ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రార్ తప్పని సరిగా ఉండాలని, ఆస్తులు కంప్యూటరైజ్ చేసి అందులో పూర్తి వివరాలు ఉండాలని లీజు ఎప్పటి వరకు ఉంది, ఎప్పుడు పూర్తవుతుంది వివరాలు పూర్తి సమాచారం ఉండాలన్నారు.

CHANGE OF NAME

I, **GRUHA LASKHMI ARUDALA** (Old Name), W/o. **Singi Venkateswara Rao**, Resident of Door No:8-32/1, Sreenagar Colony, Opposite to Fabcity Entrance, Sreenagar Colony, Thukkuguda, Mankhal, K.V. Rangareddy District, Telangana. I have changed my name as **ARUDALA GRUHALAKSHMI** (New Name) W/o. **Singi Venkateswara Rao**. Hereafter my name is known as **ARUDALA GRUHALAKSHMI** (New Name) W/o. **Singi Venkateswara Rao**.

అభివృద్ధిలో ఇంధన పొదుపు భాగం కావాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఇంధన పొదుపు భాగం కావాలని టిజి రెడ్కో అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ టిజి రెడ్కో ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ప్రధాన కూడళ్లు, పలు కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరగని సహజ ఇంధనవనరులు సౌర, పవనశక్తి ఉపయోగించడం వలన సహజవనరులను బొగ్గు, గ్యాస్, పెట్రోల్ భావి తరాల కొరకు కాపాడుకోగలుగుతామని, పెట్రోల్, డీజిల్, వాహనాలు వినియోగించడం వలన వాతావరణ కాలుష్యం పెరుగుతున్నందున ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించి తగరని ఇంధన వనరులు వాడుకొని పర్యావరణాన్ని కాపాడవలసిందిగా టీజీ రెడ్కో మేడ్చల్ మల్కాజ్గిరి, జిల్లా మేనేజర్ పవన్ చందు కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్-3 కాలనీ వాసులు టీజీ రెడ్కో అసిస్టెంట్ ఫీల్డ్ ఆఫీసర్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

Zen Crop Care India Pvt.ltd
Plot No.80, Phase V, Street No.3, CZECH Colony, IPA Jeedimetla, HYDERABAD -55, Telangana State
Mobile : 9963726052
Email : zencropcareindia@gmail.com

Notification

In pursuance to the Order No-SO 2900(E) dated 24-10-2015, and its amendment dated 30-12-2017 issued by department of Agriculture and Co-operation and Farmers Welfare, Ministry of Agriculture and Farmers Welfare, Govt. of India. **M/s Zen Cropcare India Pvt Ltd.**, here by notifies that it intends to sell 100% water soluble NPK Mixture fertilizers as per specification given below:

1) N:15 P: 0 K:10

In above all grades the detailed specifications are

1) N:15 P:0 K:10 (Total Nitrogen-15%, Phosphorus-0%, Potassium-10%)

We assure that all procedures as laid out in the notification shall be followed and adhered to:

Thanking You,
Yours Truly,
For Zen Cropcare India Pvt.Ltd
Managing Director

వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలి : గవర్నర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 2047 నాటికి వ్యవసాయ రంగంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయికి ఎదగాలని విశ్వవిద్యాలయం కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. భాగస్వాముల అందరితో సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణలో పురోగతి సాధించాలని సూచించారు. రాజేంద్రనగర్‌లో రెండు రోజుల పాటు జరగనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. రాజేంద్రనగర్ లోని పిజేటిఏయు క్రీడా మైదానంలో కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనల్ని ప్రారంభించారు. వివిధ స్టాళ్లను పరిశీలించారు. తర్వాత ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వజ్రోత్సవాల మీనియేచర్ పైలాన్‌ని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పిజేటిఏయు ఉపకులపతి అల్దాస్ జానయ్యతో కలిసి ప్రారంభించారు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీ గుర్తింపు పత్రాలని అందజేశారు. తర్వాత విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్లుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ అభివృద్ధికి అసమాన సేవల్ని అందించిందన్నారు. సోనామసూరి, తెలంగాణ సోనా వంటి వంగడాలు రూపొందించిందన్నారు. భవిష్యత్ ప్రణాళికల అమలులో విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ వంటి అధునాతన పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగంలోకి

విస్తృతంగా తీసుకురావాలని గవర్నర్ సూచించారు. భారతీయ స్టేట్ బ్యాంక్ సహాయంతో విశ్వవిద్యాలయం త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌నీ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఉదయం ఉత్సవాల ప్రారంభ సదస్సులోనూ, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కిసాన్ మేళాలోను తుమ్మల నాగేశ్వరరావు రైతులని ఉద్దేశించి ప్రసంగించారు. 60 ఏళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయం భవిష్యత్తులో దేశానికి దిక్సూచిగా మారాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు వ్యవసాయ సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయం మొదటి 10 ర్యాంకుల్లో నిలవాలని తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ప్రతి వ్యవసాయ కళాశాల పరిధిలో ఒక "మోడల్ అగ్రికల్చర్ ఫార్మ్"ను అభివృద్ధి చేయాలన్నారు. వజ్రోత్సవ ఉత్సవాల ప్రారంభ సమావేశంలో భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సభ్యులు రమేష్ చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత ఉపకులపతి అల్దాస్ జానయ్యతో తనకు పూర్వం నుంచి పరిచయం ఉందని ఆయన నాయకత్వంలో విశ్వవిద్యాలయ అభివృద్ధి సాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గతంలో రైతులకి దక్కిన గౌరవం నేడు దక్కడం లేదని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. రైతుకి వ్యవసాయానికి మూలమైన విత్తనాలు 90 శాతం ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడం దురదృష్టకరమన్నారు. రైతు సుఖంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పురుగు మందుల రహిత వ్యవసాయం కోసం మనమందరం కృషి చేయాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సందర్శించడం గొప్ప అనుభవం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నా రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇక్రిసాట్, క్రిడా వంటి సంస్థల సహకారం తీసుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, టెక్నాలజీలని వ్యవసాయ రంగంలో విస్తృతంగా వినియోగించుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల కష్టాలు నాటికి నేటికి అలానే ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నాదెండ్ల భాస్కరరావు అన్నారు. వందేళ్ళ క్రితమే వ్యవసాయంగా ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ చెప్పారని మరో మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సమరసింహా రెడ్డి అన్నారు. 60 ఏళ్ల వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రస్తానాన్ని పిజేటిఏయు ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వల్ల హైదరాబాద్ విత్తన రాజధానిగా రూపొందిందని జానయ్య వివరించారు. 60 ఏళ్లలో సుమారు 500 వంగడాలని విడుదల చేశామన్నారు. పౌల్ట్రీ, పశుసంవర్ధక రంగాల్లోనూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అపూర్వ ప్రగతి సాధించిందని అల్దాస్ జానయ్య అన్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్ల విశ్వవిద్యాలయం ప్రయాణంపై ఒక లఘు చిత్రాన్ని విడుదల చేశారు. అలాగే వివిధ సాగు పద్ధతులపై అనేక ప్రచురణల్ని కూడా విడుదల చేశారు. స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఏపిసి రఘునందన్ రావు, కమిషనర్ బి.గోపి, విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాల్ రాజు, కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డి.రాజి రెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి, పద్మశ్రీ గ్రహీతలు చింతల వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వర రావు, విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతులు రఘువర్ధన్ రెడ్డి, రాఘవ రెడ్డి, పద్మరాజు, వెటర్నరీ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రభాకర్ రావు, పూర్వ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కిసాన్ మేళా వేదికపై పలువురు తమ రైతులకు ఈ సందర్భంగా అవార్డులను బహుకరించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర - ఘట్‌కేసర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించాలని సంస్కృతి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి కొండాపూర్ సంస్కృతి విద్యా సంస్థలలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో నిర్వహించిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీలను గురువారం నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి టి.ఐసయ్యతో కలసి డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదం చేస్తాయని గుర్తు చేశారు. ఈ క్రీడాపోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రధానంచేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. జానకి రాములు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రావన్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.శివకేశవ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు సైదులు, సరిత, అభిషేక్, సమన్వయ కర్తలు డాక్టర్ హరిప్రసాద్, విజయ్ పాల్, తదితరులు పాల్గన్నారు.

మేర కులస్తులను బీసీఏలోకి మార్చాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మా మేర కుల వృత్తి మాకే కావాలని, మేర కులస్తులను బీసి-డి నుండి బీసి-ఏ గ్రూపులోకి మార్చి, ప్రత్యేక జీవో ఇచ్చే విధంగా కృషి చేయాలని తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మేర కులవృత్తి సంక్షేమ సంఘం ఎంకెవిఎస్ఎస్ అధ్యక్షులు వాడపల్లి మాధవ్ మేరు ఆధ్వర్యంలోని మేర కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ కవితని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గత తెలంగాణ గవర్నమెంట్‌లో స్కూల్ యూనిఫామ్ బట్టలు మేర కులస్తులు కుట్టడానికి గతంలో ఇచ్చిన జీవోల వలన 30 నుండి 50శాతం వరకు మేమే కుట్టడంతో మాకే ఆర్డర్లు వచ్చేవని, కానీ కాంగ్రెస్ గవర్నమెంట్‌లో స్కూల్ యూనిఫామ్ బట్టలన్నీ అన్ స్కిల్డ్ టైలర్స్, మహిళా సంఘాలకు కుట్టేలా ఆర్డర్లు ఇస్తున్నారని, వారు సరిగా కుట్టకపోవడంతో వాటిని విద్యార్థులు ధరించలేని పరిస్థితి నెలకొందని, దుస్తులన్నీ ఎంఈఓ కార్యాలయాల్లో ఉన్నాయన్నారు. మేర కులాన్ని బీసీ-ఏ గ్రూప్ జాబితాలోకి చేర్చే విధంగా అసెంబ్లీలో బిల్ పాస్ చేసి కేంద్ర ప్రభుత్వా నికి నివేదికను పంపే ప్రయత్నం చేయాలని వారు కోరారు. పింఛన్ పెంచవల సిందిగా, మేర కుల సమస్యల మీద అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వినతిపత్రం ద్వారా వారు విన్నవించుకున్నారు. ఎంకేవిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు కర్నే శ్రీనివాస్, కొత్తపల్లి వినోద్ కుమార్, దికొండ కవిత, ఓదల రమేష్, పాడిశెట్టి రమేష్, తాళ్ల శ్రీధర్ వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

కార్మికులకు అండగా ఉంటా...

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: అన్యాయం జరిగిన నిరుపేద కార్మిక సోదరులకు అండగా ఉంటానని బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి సింగ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి సుభాష్ నగర్ ఇండస్ట్రియల్ ఏరియా నందు "ఉట్ర ఫ్యాన్ కంపెనీ"లో నరేష్ అనే వ్యక్తి హెల్పర్ గత కొన్ని సంవత్సరల నుంచి కంపెనీలో పని చేసేవాడు. కంపెనీ యజమాన్యం నరేష్‌కు ఆరు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో అక్కడ పని మానేశాడు. మొత్తం ఆరు నెలల వేతనం 60 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని నరేష్ అడిగిన యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపో వడంతో విసుగు చెందిన కార్మికుడు తోటి కార్మికుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించాడు. అనంతరం సానుకూలంగా స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటా హుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడు నరేష్‌కు రావాల్సిన ఆరు నెలల వేతనం 60 వేల రూపాయలు తీసుకొని ఆయన చేతుల మీదుగా అందజేశారు. అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంగరంగ వైభవంగా శంషాబాద్ అయ్యప్ప దేవాలయంలో 18వ మహా పడిపూజ మహేష్ గురు స్వామి, సన్నిధానం స్వాముల ఆధ్వర్యంలో జరిగింది. దీనికి స్థానిక ప్రజాప్రతినిధి అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకులు గణేష్ గుప్త గురుస్వామి, శంషాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శుస్మ మహేందర్ రెడ్డి వైస్ చైర్‌పర్సన్ బి. గోపాల్ యాదవ్, స్థానిక కాన్సిలర్‌లు గురుస్వాములు హాజరయ్యారు. వేద మంత్రాల నడుమ మధు గురుస్వామి 18వ మహాపడి పూజ శంషాబాద్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో జరిగింది. మహా పడిపూజకు స్థానిక నాయకులు ఆర్. గణేష్ గుప్త, శంషాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ, మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్, పి.నాగేష్ యాదవ్ పలువురు నాయకులు, గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో ఈ మహా పడిపూజ జరుపుకున్నారు.

ఆటో డ్రైవర్ల ఛలో అసెంబ్లీ ఉద్రిక్తత

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత 12 సంవత్సరాలుగా పెండింగ్‌లోఉన్న తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నిర్వహించిన ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ' తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. హైదరాబాద్, హిమాయత్ నగర్ ప్రధాన రహదారిపైవచ్చి వేలాదిమంది ఆటో డ్రైవర్ల జండాలు, ప్లకార్డులు చేతబూని, పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అసెంబ్లీ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకొనగా, తోపులాట జరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. కొంతమంది ఆటో డ్రైవర్ల రోడ్డుపై పడుకొని నిరసన తెలుపగా, పోలీసులు అతికష్టమీద బలవంతంగా నిరసనకారులను అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టైన వారిలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ నేతలు బి.వెంకటేశం (ఏఐటీయూసీ), ఎంఏ.సలీం, ఎండి.నజీర్ (యు.టి.ఏ.డబ్ల్యు.ఏ), వి.మారయ్య, ఎస్.రాంకిషన్ (బి.ఆర్.టి.యు), ఏ.సత్తిరెడ్డి (టిఏడిఎస్), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఏ.బిక్షపతి యాదవ్, సిహెచ్. జంగయ్య, ఎస్.అశోక్, ఎండి.ఒమర్ ఖాన్, మల్లికార్జున్, ఎస్కె. లతీఫ్ (ఏఐటీయూసీ) లక్ష్మణ్ (సిఐటియు)లు ఉన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థిక సహాయం, రవాణారంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ కోరుతున్నామని, అలాగే పెరిగిన ఇంధన ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచమని, 20 వేల కొత్త ఆటో పర్మిట్లను జారీచేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓలా, రాపిడో బైక్ టాక్సీ, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం వల్ల బేరాలు రాక ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, కొంతమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గత ఆరు నెలలనుండి చేర్చాలా పేరట కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని బి.వెంకటేశం హెచ్చరించారు.

నేటి నుండి 'పత్రీజీ ధ్యాన మహాయాగం' వేడుకలు ప్రారంభం

విశాలాంధ్ర - ఆమనగల్లు : పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ఆఫ్ ఇండియా(పిఎస్ఎస్ఎం) ఆధ్వర్యంలో కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ వద్ద డిసెంబర్ 21 నుంచి 31వరకు(11 రోజులు) పాటు కొనసాగే 'పత్రీజీ ధ్యాన మహాయాగం' వేడుకలకు సిద్ధం అయ్యిందని ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ యాగనికి ఎన్ని వేల మంది హాజరైనా భోజన, ఆశ్రయం, ఇతర వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ యాగానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా ప్రపంచ నలు మూలల నుంచి పెద్ద ఎత్తున ధ్యానులు పిరమిడ్ మాస్టర్లు, కళాకారులు, ధ్యానులు, అధ్యాత్మిక వేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో కడ్తాల్ మహేశ్వా మహా పిరమిడ్, పత్రీజీ శక్తి స్థల్ ను తప్పక సందర్శించాలని అన్నారు. పత్రీజీ అందించిన ధ్యానం, జ్ఞానం, క్రమశిక్షణతో ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ప్రపంచ పటంలో కడ్తాల్ కు ఒక గుర్తింపు వచ్చేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. పత్రీజీ భౌతికంగా మాత్రమే దూరం అయ్యారని ఆత్మ రూపంలో అందరికీ మార్గదర్శకం చేస్తున్నారని అన్నారు. యాగ ఏర్పాట్లకు మూడు నెలలుగా ధ్యానులందరూ కలసికట్టుగా పని చేయడం అభినందనీయం అన్నారు. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ధ్యాన మందిరం మహేశ్వర పిరమిడ్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పిరమిడ్ ధ్యాన కేంద్రాల వ్యవస్థాపకులు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ఆశయాలు ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. మహేశ్వర మహా పిరమిడ్ కడ్తాల మండల కేంద్ర సమీపంలో హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిని అనుసరించి అన్మాస్ పల్లి గ్రామానికి వెళ్లే సమీపంలో ఉందన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : నల్గొండ జిల్లా చిట్యాల మండలం శివనేనిగూడెం (చిట్యాల మున్సిపాలిటి పరిధి) లోని సర్వే నెం.34 లోని 18 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని (గుట్టలు) కొంతమంది కబ్జా చేసి మట్టిని విక్రయిస్తున్నారని శివనేని గూడెం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నేత దేవనక దేవేందర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న గుట్టలను ఇటాచి మిషన్లతో ధ్వంసం చేస్తూ మట్టిని విక్రయిస్తూ స్థానిక తహశీల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ, ఇతర సిబ్బంది కబ్జాదారులతో కుమ్మక్కై కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుట్టల వెనుక కొంతమంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని, ఈ గుట్టలను తొలగించే భూకబ్జాదారులు రైతులను పొలాల్లోకి పోనివ్వకుండా మహిళలను అడ్డంపెట్టి అడ్డుకోవడంతో, చేతికొచ్చిన పంట పొలాలు ఎండి పోయి రైతులు ఏమి చెయాలో తోచక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. అధికారులతో, బడా నేతలతో కబ్జాదారులు కుమ్మక్కయ్యారన్నారు. రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి, రెవిన్యూ సిబ్బందికి, జిల్లా కలెక్టర్, ఆర్.డి.ఓ దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కోట్లాది రూపాయల విలువైన భూమిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: బ్యాక్ లాగ్ పోస్టులను అమ్ముకుంటున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ చైర్మన్ డా.మహిపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో ప్రభుత్వ అధికారులు, మధ్యవర్తులతో కుమ్మక్కయ్యి రూ.15 నుంచి 20 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన జేఏసీ నేతలతో కలసి మీడియాతో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో బ్యాక్ లాగ్ ఉద్యోగాలను అక్రమంగా అడ్డదారిలో భర్తీకి సన్నాహాలు చేస్తున్నారని, ఈ భర్తీని ఆపకపోతే నిరుద్యోగుల తరపున పోరాటం చేయడానికి ఎంత దూరం అయినా వెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా విరమించుకోకపోతే మీ వివరాలు స్వీకరించి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతకుమారితో పాటు సీఎం రేవంత్ రెడ్డికి ఈ డేటాను సమర్పిస్తామని అన్నారు. అలాగే వికారాబాద్ తో పాటు వరంగల్, అదిలాబాద్, ఖమ్మం, నిజాంబాద్, హైదరాబాద్, నారాయణపేట జిల్లాలో కూడా బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. వీరిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ నేతలు రాఘవేందర్, సూరన్న, చీమల జగదీశ్ యాదవ్, నరేష్ యాదవ్, రాము, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై డీజీపీకి ఫిర్యాదు చేస్తాం

విశాలాంధ్ర - కాప్రా : ఎవరో.. ఏ సంఘమో... ఏ రాజకీయ పార్టీనో.. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలకో, ప్రధానమంత్రి వస్తున్నాడనో లేదా ఇతర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పిలుపునిస్తారు. అంతే పై అధికారుల అదేశాలు వచ్చిందంటూ వామపక్ష ప్రజాసంఘాల నేతల ఇళ్లపైకి ఉదయం కాకముందే వాలిపోయి, నడవండి పోలీసు స్టేషన్‌కు ...మీరు అరెస్ట్ అంటూ దాష్టీకానికి పాల్పడుతున్నారు నాచారం పోలీసులు. వాస్తవానికి ఈరోజు ఏదో సంఘం ప్రభుత్వ తీరును నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కానీ, నాచారం పోలీసులు పూర్తి స్థాయి నివేదిక లేకుండా సంఘాలతో సంబంధం లేని నేతలను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఎటువంటి ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకున్నా మల్లాపూర్‌లో నివాసం ఉంటున్న ధర్మేంద్ర ఇంటికి నాచారం పోలీసులు వెళ్లి ముందస్తు పేరుతో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర మాట్లాడుతూ వామపక్ష కమ్యూనిస్టు పార్టీ సీపీఐ వాటి అనుబంధ ప్రజా సంఘాలు సమాజ హితాన్ని, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరును నిరసిస్తూ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని, రాజీలేని పోరాటాలు చేపడుతాయని అన్నారు. ఏదేని కార్యక్రమాలు ఉన్నా ముందుగానే బహిరంగంగా ప్రచారం ద్వారా నిరసనలు, ముట్టడిలు చేపడుతామని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా శుక్రవారం ఉదయం సర్వే తీరును కమిషనర్ జి.రామలింగం స్వయంగా పరిశీలించారు. సర్వే పరిశీలన సందర్భంగా కమీషనర్ జి.రామలింగం మాట్లాడుతూ ప్రతి ఒక్క సూపర్వైజర్ ప్రతీ రోజు 50 నుండి 60 ఇళ్ల వరకు తప్పనిసరిగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-దుండిగల్: పార్లమెంట్‌లో దారుణంగా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే తమ పదవికి రాజీనామా చేయాలని సిఐటియు దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి కొంపల్లి నందు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బొడిగె లింగస్వామి మాట్లాడుతూ ప్రపంచ మేధావి అణగారిన వర్గాల హక్కుల కోసం తన జీవితమంతా భారతదేశం కోసం అంకితం చేసిన భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కించపరిచే విధంగా పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి మాట్లాడడం అత్యంత దారుణమని, తక్షణమే అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని మండిపడ్డారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి అమీషాపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.అదేవిధంగా అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ దేశంలో బిజెపి ప్రభుత్వం కావాలని భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడం కోసం కుట్ర చేస్తున్నారని అంబేద్కర్ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియకుండా ఉండాలని చేస్తున్న కుట్ర అని తెలిపారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వాక్యాలను ఖండిస్తూ దేశ ప్రజలందరూ ఉద్యమాలు నిర్మించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యం, లక్ష్మయ్య, శ్రీను. దుర్గేష్, రాజు, స్వామి, పరశురాములు, యాదగిరి అమృత బాలమణి, వసంత యాదమ్మ, శాంతి, ఎల్లమ్మ, మంజుల, స్వరూప, లలిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గ్రామాల అభివృద్ధి దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర - అమనగల్లు : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతితో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని, ఆరోగ్యకరంగా మారాయని బీహార్ గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు (సర్పంచులు) అన్నారు. రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి బీహార్ సర్పంచులతో ఎన్ఐఆర్‌డిపిఆర్ రాజేంద్రనగర్‌లో సమావేశమై గత పాలకవర్గంలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి వివరించారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త వేరు విధానం, ఇంకుడు గుంతల నిర్వహణ, పల్లెప్రకృతి వనం, రైతు వేదిక, వైకుంఠధామం నిర్మాణాలు, గ్రామపంచాయతీల సొంత ఆదాయ వనరుల పెంపు మొదలగు అంశాలను వివరించారు. గ్రామాలను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో అందరితో కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకున్నందునే అభివృద్ధిలో ముందున్నామని తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ అరుణ్ రాజ్, సిక్కిం గ్రామపంచాయతీల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సహించేది లేదు : కూన

విశాలాంధ్ర - దుండిగల్: ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన ప్రజల తాగునీటి కోసం 2017లో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎలాంటి సమాచారం అందించకుండా కాంట్రాక్టర్ కూల్చివేసిన పనితీరును మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూన శ్రీశైలం గౌడ్ ఆకస్మిత తనిఖీ చేసి విద్యార్థులకు మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ కావాలి గోపాల్, పూర్ణచంద్రరావు, అశోక్ రెడ్డి, దశరథ్, ఆంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, ఖదీర్, నవీన్ ముదిరాజ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం సమస్యలు పరిష్కరించండి

- నిర్వాసితులకు ప్యాకేజీ అందించి... పునరావాసం కల్పించాలి
- ప్రాజెక్టు ఎత్తు పూర్తిస్థాయిలో 45.72 మీటర్లు నిర్మించాలి
- సీఎం చంద్రబాబుకు రామకృష్ణ, ముప్పాళ్ల వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు చేపట్టవలసిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కలిసి విజ్ఞప్తి చేశారు. ఇటీవల మీరు పోలవరం ప్రాజెక్టును సందర్శించి, 2026 అక్టోబరు నాటికి పూర్తిచేస్తామని ప్రకటించడం హర్షణీయం. కానీ పోలవరం నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కార అంశాలలో కేంద్ర ప్రభుత్వం నత్తనడక వైఖరి అవలంభిస్తోంది. ప్రాజెక్టు ఎత్తును కుదించాలనే యోచనలో కేంద్రం ఉంది. తద్వారా నిర్వాసితులకు అందించాల్సిన పునరావాస ప్యాకేజీని ఎగ్గొట్టేందుకు పావులు కదుపుతోంది. ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనంటూ కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ పార్లమెంటులో ప్రకటన చేశారు. ఆయన ప్రకటనలో రెండో దశ గురించి ప్రస్తావనే లేదు. మొదటి దశ పేరుతో 45.72 మీటర్ల కాంటూరు నుంచి 41.15 మీటర్లకు ఎత్తు తగ్గిస్తే జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారుతుంది. దీనివల్ల ప్రాజెక్టు నీటి నిల్వ 196.60 టీఎంసీల నుంచి 92 టీఎంసీలకే పరిమితం కానుంది. పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. 80 టీఎంసీల నీటిని గోదావరి నుంచి కృష్ణానదికి తరలించడం, కృష్ణా నీటిని శ్రీశైలం ద్వారా కృష్ణా డెల్టాకు ఇచ్చే నీటిని ఆదా చేసి వాటిని రాయలసీమకు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. రాయలసీమ ప్రాజెక్టులయిన గాలేరు-నగరి, హంద్రీ-నీవా లాంటి ప్రాజెక్టులకు కొంతమేర నికరజలాలు కుడి, ఎడమ కాలువల ద్వారా 534 గ్రామాలకు తాగునీరు, విశాఖపట్నానికి 24 టీఎంసీల నీటిని అందించి విశాఖ తాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలు తీరతాయి. బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా 8 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడం తగదు. పోలవరం జాతీయ ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతోనే నిర్మాణం గావించాలి. మొదటి దశ, మలిదశ అనే మెలికపెట్టకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు తగు చర్యలు చేపట్టాలి. అలాగే పోలవరం ముంపు మండలాల ప్రజలు ప్రతి ఏటా సర్వం కోల్పోయి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నిర్వాసితులకు పునరావాసం కల్పించి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి కడు దయనీయంగా ఉంది. నిర్వాసితుల పరిహారం, ప్యాకేజీకి నిధులు ఇవ్వకుండా, వారి సమస్యలు పరిష్కరించకుండా ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాదు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నిర్వాసితులకు పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం రూ.30 వేల కోట్ల నిధులను కేంద్రం నుంచి రాబట్టాలి. మండలం మొత్తాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ అందజేయాలి. స్థానిక అర్హతలు అన్నీ ఉన్నప్పటికీ అనర్హులుగా పేర్కొన్న కుటుంబాలకు ప్యాకేజీ వర్తింప చేయాలి. 2017వ సంవత్సరంలో పెట్టిన కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా నిర్వాసితులను తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ప్యాకేజీ ఇవ్వాలి. ఇళ్లకు కూడా నష్టపరిహారం ఇచ్చిన తదుపరి మాత్రమే నిర్వాసితులను తరలించాలి. మిగులు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలి. గత ప్రభుత్వంలో నిర్వాసితుల విషయంలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపాలి. వరద ముంపునకు గురయ్యే మండలం మొత్తాన్ని 41.15 కాంటూర్ పరిధిలో చేర్చి ప్యాకేజీ వర్తింపచేయాలి. పునరావాస ప్రాంతంలో అన్ని వసతులు ఏర్పాటు చేయటంతో పాటు ప్రతి కుటుంబానికి ఉపాధి చూపాలి. ముంపు ప్రాంతం నుంచి నిర్వాసితులు తరలివెళ్లే వరకు ఉపాధి హామీ పథకాన్ని అక్కడే కొనసాగించేలా తగు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ తొలుతగా ఫేజ్-1 నిర్వాసితులకు పరిహారం అందిస్తామని, తదుపరి మిగిలినవారి కోసం కేంద్రాన్ని కోరతామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఆప్కోస్‌లో వైద్యారోగ్యశాఖ కార్మికులు

- సంఘం 6వ రాష్ట్ర మహాసభ డిమాండ్
- అధ్యక్షుడిగా రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూదోట ఎన్నిక

విశాలాంధ్ర-విజయవాడ: వైద్యారోగ్య శాఖలో పారిశుద్ధ్యం, భద్రత, చెదలు నివారణ సిబ్బందిని ప్రభుత్వ నియంత్రణ కలిగిన ఆప్కోస్ ద్వారా నియమించి, కనీసవేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని గురువారం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వైద్య ఒప్పంద ఉద్యోగ, కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభ తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జె.రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ తెలియచేశారు. పారిశుద్ధ్యం, భద్రత, చెదలు నివారణ సిబ్బందిని ఒకే కేటగిరి కింద సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కోస్ ద్వారా మునిసిపల్ కార్మికులకు ఇచ్చే విధంగా వైద్య సిబ్బందికి కూడా వేతనాలు ఇచ్చి... ఒప్పంద ఏజెన్సీల మధ్య దళారీ వ్యవస్థను రద్దు చేయిడం ద్వారా పూర్తి వేతనాలు కార్మికుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలని కోరారు. ఆసుపత్రులలో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న సర్వీసు, అనుభవం కలిగిన వారందరిని శాశ్వత ప్రాతిపదికన నియమించాలని పూదోట డిమాండ్ చేశారు.

పెనుగొండకు చంద్రబాబు, జగన్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ సాహితీవేత్త, రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం పట్ల సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. పెనుగొండ ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులుగా ఉన్నారు. ఆయన రచించిన 'దీపిక' అభ్యుదయ వ్యాస సంపుటి(విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ)గాను కేంద్ర సాహిత్య అవార్డు లభించించడం పట్ల చంద్రబాబు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన ఆయనకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పెనుగొండకు అభినందనలు తెలిపారు. పెనుగొండ మట్టి నుంచి ఎదిగిన మాణిక్యం అని జగన్ కొనియాడారు. ఇప్పటికే జాతీయ స్థాయితోపాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ రచయితలు, కవులు, కళాకారులు పెనుగొండకు అభినందనలు తెలిపారు.

పెనుగొండకు కూనంనేని అభినందన

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ రచయిత, సాహిత్య పరిశోధకుడు, నిత్యాన్వేషి పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం పట్ల సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు హర్షం వెలిబుచ్చారు. పెనుగొండ తనకు చిరకాల మిత్రుడని, ఉద్యమ సహచరుడని తెలిపారు. ఒక రచయితగా అభ్యుదయ రచయితల సంఘానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో తన సేవలందించారని కొనియాడారు. పేద రైతు కుటుంబంలో జన్మించిన పెనుగొండ లక్ష్మీనారాయణ అంచలంచెలుగా ఎదిగారని తెలిపారు. ఈ మేరకు కూనంనేని శుక్రవారం పెనుగొండకు ఫోన్ చేసి అభినందించారు.

పార్సిల్‌లో మృతదేహం కలకలం

పశ్చిమ గోదావరి జిల్లాలో ఘటన

విశాలాంధ్ర-ఉండి: పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండల పరిధిలోని యండిగండి గ్రామంలో ఒక పార్సిల్‌లో మృతదేహం రావడంతో కలకలం రేగింది. శుక్రవారం స్థానిక జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న తులసి అనే మహిళ తనకు వచ్చిన పార్సిల్‌ను తెరిచి చూడగా సుమారు 45 సంవత్సరాలు వయసుగల కుళ్లిన పురుషుడి శవం కనిపించింది. దీంతో ఒక్కసారి ఆ మహిళ విస్మయానికి గురైంది. భయాందోళనతో కేకలు వేసింది. పార్సిల్‌లో మృతదేహం వచ్చిన విషయం దావనంలా ఊరంతా వ్యాపించడంతో గ్రామస్తులంతా భయాందోళనకు గురై వెంటనే స్థానిక ఎస్‌ఐ మహమ్మద్ నసిరుల్లాకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నసురుల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి సంఘటనా స్థలానికి చేరుకొని చుట్టుపక్కల క్షుణ్ణంగా పరిశీలించారు. పార్సిల్ ఎక్కడ నుంచి వచ్చింది... ఎలా వచ్చిందనే విషయాలపై ఆరా తీశారు. ఈ ఘటన గురించి నాలుగు కోణాల నుంచి విచారణ చేస్తున్నారు. సంఘటనను త్వరితగతిన ఛేదించేందుకు బృందాలను సమాయత్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పార్సిల్‌లో వచ్చిన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం

ఫాస్ట్‌ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయ, హోం మంత్రుల సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారానికి న్యాయశాఖ, పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు ఎన్ఎండి ఫరూక్, వంగలపూడి అనిత సూచించారు. వెలగపూడి సచివాలయంలోని సమావేశపు మందిరంలో శుక్రవారం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరుపై ముఖ్య అధికారులతో సమీక్షించారు. కేసుల తీవ్రతను బట్టి ఆయా కోర్టుల్లో కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరగడానికి ఆయా కోర్టులు మరింత వేగవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయశాఖ కార్యదర్శి జీ ప్రతిభా దేవి, హోంశాఖ కార్యదర్శి పాల్గొన్నారు.

23న విజయవాడలో క్రిస్మస్ తేనేటి విందు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 23న ప్రభుత్వం తేనేటి విందు ఇస్తున్నట్టు మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. విజయవాడలోని లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం ఐదు గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవ కుటుంబ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆ వార్తలు నిజం కాదు

జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ పదవికి తన పేరు పరిశీలిస్తున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలు అవాస్తవమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం తాను కుటుంబంతో కలిసి సమయం గడుపుతున్నానని, మరో పదవి స్వీకరించే ఆలోచన ఇప్పటికైతే లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా పదవీకాలం పూర్తి అయిన నాటి నుంచి (జూన్ 1) ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ పదవి ఖాళీగా ఉంది. తదుపరి చైర్‌పర్సన్‌ను ఎంపిక చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సమావేశమైనట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. పార్లమెంట్ ప్రాంగణంలో ఇటీవల జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హాజరైన విషయం తెలిసిందే. ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్‌ను ఎంపిక చేసే కమిటీకి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తుండగా... ఇందులో లోక్‌సభ స్పీకర్, హోంమంత్రి, లోక్‌సభ, రాజ్యసభలో విపక్షాల నాయకులు, రాజ్యసభ డిప్యూటీ చైర్‌పర్సన్ సభ్యులుగా ఉంటారు. ఈ పదవికి సాధారణంగా భారతదేశ మాజీ ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమిస్తారు. వారి పేర్లను కమిటీ రాష్ట్రపతికి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. జస్టిస్ మిశ్రా పదవీ విరమణ తర్వాత ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతి సయానీ తాత్కాలిక చైర్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. 2022 నవంబర్‌లో భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ డీవై చంద్రచూడ్ చాలా ముఖ్యమైన కేసుల్లో చరిత్రాత్మక తీర్పులు వెలువరించారు.

ఏపీలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

జాతీయ భవన నిర్మాణ సంఘం డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను నిర్లక్ష్యం చేస్తోందని, వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలని అఖిల భారత భవన నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి విజయ్ కొనిసేరి డిమాండ్ చేశారు. సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం ఒడిశా రాష్ట్రంలో పూరీలో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు పశ్చిమ బెంగాల్ భవన నిర్మాణ సంఘం సీనియర్ నేత బాసుదేవ్ గుప్తా అధ్యక్షత వహించగా, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రామకృష్ణ పాండ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్ర ప్రదేశ్ నుంచి 9 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.సత్యనారాయణ, నాయకులు శ్రీరాములు మద్దిలేటి సోమరాజు రామకృష్ణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ్ కొనిసేరి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాస్తామని ప్రకటించారని తెలిపారు. ఈ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల కార్మికులు ఆంధ్ర రాష్ట్రంలో సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఉద్యమం సాగిస్తామని తీర్మానించారని అన్నారు.

కొలకలూరి పురస్కారాలు... గ్రంథాలకు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కొలకలూరి సాహిత్య పురస్కారాలు-2025ను ప్రకటించారు. 17 సంవత్సరాలుగా ఈ పురస్కారాల కింద వివిధ ప్రక్రియలకు ప్రదానం చేస్తున్నట్లే... ఈ ఏడాది మూడు ప్రక్రియ గ్రంథాలకు మూడు పురస్కారాలను ప్రకటించినట్లు, ఈ పురస్కారాలకుగాను ప్రపంచంలోని తెలుగు సాహిత్యస్రష్టల నుంచి గ్రంథాలను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆచార్య కొలకలూరి సుమ కిరణ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొలకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారం-2025 కింద రూ.15 వేలు, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం-2025 కింద రూ.15 వేలు, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం-2025 కింద రూ.15 వేలు ప్రదానం చేస్తారు. ఆయా ప్రక్రియల్లో ప్రచురితమైన నాలుగేసి ప్రతులను ఆహ్వానిస్తున్నారు. ముగ్గురు సాహితీ స్రష్టలు, వేత్తలు, న్యాయమూర్తుల సంఘాలు వీటిని పరిశీలించి, పురస్కార గ్రంథాలను నిర్ణయిస్తాయి. కవిత్వం, నాటకం, పరిశోధన ప్రక్రియలకు చెందిన గ్రంథాలు జనవరి 1, 2023 తర్వాత ముద్రితమై ఉండాలి. రచయితలైనా, ప్రచురణ కర్తలైనా తమ గ్రంథాలను జనవరి 15 లోగా పంపాలి. ఫిబ్రవరి 26వ తేదీన హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లిలో జరిగే సభలో పురస్కారాలను ప్రదానం చేస్తారు. కవిత్వం, నాటకాల గ్రంథాలను ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (సెల్ 9441923172), తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం-తిరుపతికి, పరిశోధనా గ్రంథాలను ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (సెల్ 9963564664), ఆంగ్లాచార్యులు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం-తిరుపతికి పంపాలి.

24 మంది మంత్రుల పీఆర్‌ఓల నియామకం

విశాలాంధ్ర-సచివాలయం: రాష్ట్ర మంత్రులు వద్ద మీడియా సంబంధ వ్యవహారాలు చక్కబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం 24 మంది పీఆర్వోలను నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వ రాజకీయ కార్యదర్శి జి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో మంత్రి వద్ద ఒక్కో పీఆర్‌ఓ చొప్పున 24 మందిని నియమించారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలోప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టింది. పీఆర్‌ఓలకు గౌరవ వేతనంగా రూ.37 వేలు ఇస్తారు. వారు ఐదేళ్లు ఈ విధుల్లో కొనసాగుతారు.

కనువిందు చేసిన గురుగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ: వినీలాకాశంలో ఆసక్తిగొల్పే దృశ్యం కన్పించింది. శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో విజయవాడ నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఆగ్నేయ దిశలో చందమామ దర్శన మిచ్చింది. మార్గశిర బహుళ షష్టి నాడు చందమామ కనడబటమేంటి? అని ప్రజలు ఆసక్తిగా గమనించారు. ఈ అంశంపై ఎన్టీఆర్ జిల్లా సైన్సు అధికారి మైనం హుస్సేన్‌ని వివరణ కోరగా గురుగ్రహం (బృహస్పతి/జూపిటర్) భూమికి దగ్గరగా వచ్చిందని, ఆకాశం మేఘావృతం కావటంతో కాంతి పరిక్షేపణ, పరావర్త నం కారణంగా గురుగ్రహం మరింత కాంతివంతంగా ప్రకాశించిం దని, డిసెంబరు 21వ తేదీ రాత్రి సమయం ఎక్కువగా ఉండే రోజు కావటం వల్ల ఎక్కువ చీకటి ఉండటం, మేఘాల వల్ల ఇతర నక్షత్రాలు కనిపించకపోవటంతో గురుగ్రహం కాంతి రెట్టింపై మరో చందమామలా అనిపిస్తుందని వివరిం చారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో అనేక అంశాలు చక్కర్లు గొడుతున్నాయి.

ఆర్థిక శాఖలో ఆరుగురు నిపుణుల నియామకం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆర్థిక శాఖలో ఆరుగురు నిపుణులను కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు వీరు సేవలు అందించనున్నారు. డేటా అనలైసిస్, పాలసీ రీసెర్చ్, పీపీపీ ప్రాజెక్ట్స్, న్యాయ సంబంధ అంశాలలో సేవలు అందించేందుకు నియమించినట్లు జీవోలో పేర్కొన్నారు. సీనియర్ లెవెల్ కన్సల్‌టెంట్‌గా, పీపీపీ నిపుణుడు డీ షాలెం రాజు, మిడిల్ లెవెల్ కన్సల్‌టెంట్‌లుగా శోభన్ బద్గుజర్, వంశీకృష్ణారెడ్డి, సుబ్రమణ్య వివేక్ భార్గవ్ ఓరుగంటి, జూనియర్ లెవెల్ కన్సల్‌టెంట్‌గా సీనియర్ లీగల్ అనలిస్ట్ వై.జగదీశ్వరావు, యంగ్ ప్రొఫెషనల్‌గా లీగల్ అనలిస్ట్ సురజ్ గులిపల్లిలను నియమించారు.

నాబార్డ్ వడ్డీ చెల్లింపునకు రూ.95.68 కోట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి నాబార్డు ఇచ్చిన రుణాలకు వడ్డీ చెల్లింపులకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌ఐడీఎఫ్, ఎల్‌టీఐఎఫ్, ఎంఐఎఫ్ రుణాలకు 2024 అక్టోబరు ఒకటి నుంచి 31 డిసెంబరు, 2024 వరకు వడ్డీ కింద చెల్లించేందుకు రూ.95,68,59,114 ప్రభుత్వం విడుదల చేసింది.

దలేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చండి: సుప్రీం

న్యూఢిల్లీ: ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించాలని సుప్రీంకోర్టు శుక్రవారం పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా ఖనౌరీ సరిహద్దు వద్ద తాత్కాలిక ఆసుపత్రిలో చేర్చాలని సూచించింది. దలేవాల్‌ను ఆసుపత్రికి తరలించే క్రమంలో జరిగిన పరిణామాలను తెలపాలని పంజాబ్ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ గుర్మిందర్ సింగ్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజల్ భుయన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. సింగ్ స్పందిస్తూ దలేవాల్ గురువారం వైద్య పరీక్షలకు సహకరించారని, ఈసీజీ, రక్త పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. దలేవాల్ ఆరోగ్యం ప్రస్తుతానికి నిలకడగానే ఉందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికిగాను కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు క్యాన్సర్ రోగి, 70ఏళ్లు పైబడిన దలేవాల్ నవంబరు 26వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే.

జాకీర్ హుస్సేన్‌కు కన్నీటి వీడ్కోలు

శాన్‌ఫ్రాన్సిస్కోలో ముగిసిన అంత్యక్రియలు

శాన్‌ఫ్రాన్సిస్కో: ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు శాన్‌ఫ్రాన్సిస్కోలో ముగిశాయి. ఫెర్న్‌వుడ్ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. జాకీర్ హుస్సేన్‌కు డ్రమ్స్ మ్యాస్ట్రో ఆనందన్ శివమణి, కొందరు కళాకారులు సంగీత నివాళి అర్పించారు. తమ అభిమాన కళాకారుడికి వందలాది మంది కన్నీటి వీడ్కోలు పలికారు. ఊపిరితిత్తుల సమస్యతో 73ఏళ్ల జాకీర్ హుస్సేన్ ఈనెల 16న తుదిశ్వాస విడిచారు. జాకీర్ హుస్సేన్‌కు భార్య ఆంటోనియా మిన్నెకోలా, కుమార్తెలు అనిసా ఖురేషి, ఇస్బెల్లా ఖురేషి ఉన్నారు. 1951 మార్చి 9 ముంబైలో జన్మించిన జాకీర్ హుస్సేన్ 12 ఏళ్ల చిరు ప్రాయంలోనే కెరీర్ ప్రారంభించారు. 18ఏళ్లకు ప్రపంచ ఖ్యాతి పందారు. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలతో అభిమానాలను అలరించేవారు. ఆరు దశాబ్దాల సంగీత ప్రయాణంలో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. హిందుస్థానీ క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో నైపుణ్యం సాధించి తనదైన ముద్ర వేసిన జాకీర్ హుస్సేన్ 1980వ దశకంలో కొన్ని చిత్రాలకూ పని చేశారు. అమెరికా శ్వేతసౌధం నుంచి ఆహ్వానం అందుకున్న తొలి భారతీయ సంగీతకారుడిగానూ జాకీర్ హుస్సేన్ గుర్తింపు పొందారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ యత్నం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనమని, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఉంటాయని, అందుకే అంబేద్కర్ జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నారని విమర్శించారు. ఈ మేరకు షర్మిల శుక్రవారం ట్వీట్ చేస్తూ, అమిత్ షా రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని, కానీ ఇప్పుడు కొత్త నాటకానికి తెరదీశారన్నారు. పార్లమెంట్ లోపలికి వెళ్తున్న రాహుల్ గాంధీ, మల్లికార్జునఖడ్గే, ప్రియాంక గాంధీని బీజేపీ ఎంపీలు అడ్డుకుని పక్కకు తోయడం వారి అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఖడ్గే కిందపడిపోయారని, సాక్షాత్తూ పార్లమెంట్ ఆవరణలోనే బీజేపీ ఎంపీలు రౌడీల్లా కర్రలు చేతబట్టి సభలోకి వెళ్లకుండా కాంగ్రెస్ ఎంపీలను అడ్డుకోవడం దారుణమన్నారు. వారిలో వారే కొట్టు కుని రాహుల్ గాంధీపై నింద మోపుతు న్నారని, వారి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చగా నిలుస్తోందన్నారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల వీడియోను తొలగించాలంటూ 'ఎక్స్'కు కేంద్రం నోటీసులు ఇవ్వడం చూస్తుంటే వారు తప్పు చేశారని అర్థమవుతోందని పేర్కొన్నారు. అంబేద్కర్‌పై బీజేపీ అసలు ఆలోచనలు...అమిత్‌షా వ్యాఖ్యల రూపంలో బయటపడ్డాయని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.